ISSN 2582-6565

నవ మల్లెతీగ

జనవరి 2023
పేజీలు : 64
వెల రు.20/-

సకుటుంబ సాహిత్య మాసపత్రిక

లోకాభి'రామ్మా'యణం

కార్టూన్లతో వినోదాలు

డా॥నందమూరి లక్ష్మీపార్వతి సీరియల్ 6వ భాగం

భారతదేశంలోనే మొట్ట మొదటిసారిగా



ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 4,59,564 మంది విద్యార్థులకు, 59,176 మంది ఉపాధ్యాయులకు 778 కోట్ల బైజూస్ ప్రీ లోడెడ్ కంటెంట్, 686 కోట్ల విలువైన 5,18,740 సామ్‌సంగ్ ట్యాబులను డిసెంబరు 4న బాపట్లజిల్లా యడ్లపల్లిలో ఉచితంగా పంపిణీ చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి



డిసెంబరు 19న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'జగనన్న సాంస్కృతిక సంబరాలు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి ఆర్.కె.రోజా

డిసెంబరు 28న గుడివాడలో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ పక్షాన సీనియర్ జర్నలిస్టు బండారు రాధాకృష్ణ దంపతుల్ని సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సెక్రెటరీ బాలగంగాధర తిలక్

డిసెంబరు 18న విజయవాడ ఐఎంఏ హాలులో ఎక్స్‌రే ప్రధాన పురస్కారం అందుకుంటున్న దాకరపు బాబూరావు. చిత్రంలో డా॥మండలి బుద్ధప్రసాద్, ఇండ్ల రామసుబ్బారెడ్డి, కొల్లూరి వున్నారు.

డిసెంబరు 18న నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరుజిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక అనంతరం యేమినేని వెంకటరమణను సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాష్ట్ర నాయకత్వం ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో సాహితీ పరిశీలకురాలు సిహెచ్ సుశీలమ్మ, జర్నలిస్టులు, రచయితలు పాల్గొన్నారు. (వార్త లోపలి పేజీల్లో)

KRSA101M255

అమ్మా నాన్న- అత్తా మామల ఆశీస్సులతో...

సంపుటి : 6 సంచిక : 10 జనవరి 2023

నవ మల్లెతీగ

సకుటుంబ సాహిత్య మాసపత్రిక

RNI.APTEL/2017/73957 ISSN 2582-6565

ముద్రాపకులు : శ్రీమతి కె.రాజేశ్వరి ★ సంపాదకుడు : కె.సాంబశివరావు (కలిమిశ్రీ)

అసోసియేట్ ఎడిటర్ : కె.సంపత్

సాహితీ సంపాదకులు : సాగర్ శ్రీరామకవచం, పి.శ్రీనివాస్ గౌడ్

సీనియర్ సబ్ ఎడిటర్ : సిహెచ్.రాఘవేంద్రశేఖర్

సబ్ ఎడిటర్స్:
కె.లక్ష్మీదీపక్, పి.చిదంబరం, ఎ.జి.ప్రసన్నకుమార్

సంపాదకవర్గ సభ్యులు :
చిన్ని నారాయణరావు, వజ్ఝల కృష్ణమూర్తి, పోగుల విజయశ్రీ

ఆర్.ఎస్. న్యూస్ ఏజన్సీస్, సెల్ : 83329 03156

పబ్లికేషన్ కన్సల్టెంట్: కలిదిండి రఘురామరాజు

లీగల్ అడ్వయిజర్ : సూరేపల్లి రవికుమార్, 97003 34999

తెలంగాణ బ్యూరో : ఇస్కా రాజేష్‌బాబు, 96520 39780

చిత్తూరు కరస్పాండెంట్ : హరిప్రసాద్

తిరుపతి రిపోర్టర్ : జయచంద్ర

గుంటూరు కరస్పాండెంట్ : బి.జనార్ధనరెడ్డి

కర్నూలు కరస్పాండెంట్ : ఎస్‌కె.వలి

తూ.గో.జిల్లా కరస్పాండెంట్ : పి.కుమార రాజు

నెల్లూరు కరస్పాండెంట్ : జి.శ్రీధర్ (బాబి)

నెల్లూరు రిపోర్టర్ : తోట శ్రీమంతు కుమార్

నంద్యాల రిపోర్టర్ : రామకృష్ణారెడ్డి

ఎడిటోరియల్ ఆఫీసు

నవమల్లెతీగ

41-20/3-24, మన్నవవారివీధి, కృష్ణలంక
విజయవాడ-520 013, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్
మొబైల్స్ : 92464 15150, 81255 51051
e-mail:malleteega@gmail.com, kalimisri@gmail.com

తెలంగాణ ఆఫీసు :
షాప్ నెం.17, సాయిరాం అపార్ట్‌మెంట్స్, సాయినగర్, మేడ్చల్
మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్-500 047
మొబైల్స్ : 96520 39780, 91332 84131

All legal matters subject to
Vijayawada jurisdiction only.

పాఠకులకు విజ్ఞప్తి

నవమల్లెతీగ చందాలను, విరాళాలను

PhonePe Google Pay

ద్వారా చెల్లించవచ్చు.

చెల్లించవలసిన ఫోన్ నెం. 92464 15150

పై నెంబరుకు నగదు బదిలీ చేసిన తరువాత ఫోన్ చేసి మీ పూర్తి చిరునామా, సెల్ నెంబరు తెలుపగలరు.

చందా వివరాలు

విడి ప్రతి రూ.20/-	1 సం. : రూ.240/-
3 సం. : రూ.720/-	5 సం. : రూ.1100/-

ఎం.వో ద్వారా గానీ, లేదా నవమల్లెతీగ (NAVAMALLETEEGA) పేరుతో డి.డి.గానీ, చెక్కు గానీ పంపొచ్చు. చెక్కు పంపేట్లయితే అదనంగా రు.30/-లు చేర్చి పంపాలి. ఆన్‌లైన్ ద్వారా చందా పంపేవారు నవమల్లెతీగ (NAVAMALLETEEGA) ధనలక్ష్మి బ్యాంక్ విజయవాడ మెయిన్‌బ్రాంచ్‌కి పంపాలి.

NAVAMALLETEEGA- DHANALAXMI BANK,
VIJAYAWADA MAIN BRANCH
ACCOUNT NO. 010305300007556
IFS Code : DLXB 0000103

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపినవారు, ఆ వెంటనే-చిరునామా, ఫోన్ నెం.తదితర వివరాలను, ఉత్తరం ద్వారా గాని, ఫోన్ మెసేజ్ ద్వారా గాని తెలియజేయాలి.

రచనలు, చందాలు పంపవలసిన చిరునామా:
ఎడిటర్, నవమల్లెతీగ, డోర్ నెం. 41-20/3-24,
మన్నవవారి వీధి, కృష్ణలంక, విజయవాడ-520 013.
ఫోన్స్ : 92464 15150, 81255 51051

రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

న్యాయపరమైన అన్ని విషయాలు విజయవాడ న్యాయస్థానాల పరిధిలో

3

ఈ నె ల ప రి మ ళా లు





ఆర్టిస్టులు : బాలి, పి.చిదంబరం, మాధవ్

కార్టూనిస్టులు :
అరుణ్, భగవాన్, బొమ్మన్, రావెళ్ళ, శాబా, చక్రవర్తి, జై దాస్

కవులు : డా॥ఎన్.గోపి, నిఖిలేశ్వర్, ఈతకోట సుబ్బారావు, సాయి విస్సాప్రగడ, విజయ్‌కుమార్ ఘంటా, ఎరుకలపూడి గోపీనాథరావు, ఎన్.లహరి

ముఖచిత్రం : సెకండ్ ఇన్నింగ్స్‌లో దూకుడు పెంచింది ప్రియమణి..38 యేళ్ళ ఈ భామామణి సెకండ్ లోనూ పెద్ద హీరోలతోనే జతకడుతుందట. బెస్టాఫ్ లక్...

శీర్షికలు

సంపాదకీయం	...కలిమిశ్రీ	-5
సాగర వచనం-	...సాగర్ శ్రీరామకవచం	-6
కలాలు-కవనాలు	...డా.బీరం సుందరరావు	-13
తపాలా	...	-14
కవిగారి అంతరంగాలు	...పి.చంద్రశేఖర అజాద్	-15
జీవన మంజూష	...మంజు యనమదల	-16
నేను గాంధీ, నాలో అంబేద్కర్	...గాంధీ నాగరాజన్	-21
కవితలు		-22
లోకాభి 'రచ్చా'యణం	...సాంబ	-28
సంక్రాంతి అంటే...	...కాయల నాగేంద్ర	-30
అవునా..?	...జంధ్యాల రఘుబాబు	-35
కిటికీ	...జాన్సన్ చోరగుడి	-36
కలం యోధుడు	...అన్నవరపు బ్రహ్మయ్య	-38
ప్రేమలేఖలు	...విడదల సాంబశివరావు	-39
నవ్వుల చౌరస్తా	...	-41
కథా సాహిత్యం స్త్రీపాత్ర	...డా॥ఇండ్ల రాధారెడ్డి	-42
అడవిపుత్రుల భూపోరాటం	...ఎస్వీఎం నాగ గాయత్రి	-44
పొరుగింటి పరిమళం	...పి.శ్రీనివాస్ గౌడ్	-49
రమణీయం	...యేమినేని వెంకటరమణ	-50
రోల్‌మోడల్	...పి.సత్యప్రకాశరావు	-52
వసుమతీ'పథం'	...చలసాని వసుమతి	-53
కావ్యమల్లిక	... రాధశ్రీ	-53
సాహితీ సమాచారం	...	-54
పుస్తక సమీక్ష	....	-57
నేపథ్యం	...డా॥కొత్వాలు అమరేంద్ర	-58
ముందుతరం నటుల వరుస మరణాలు	...	-61
బొద్దసాహితీ సాగరం	...బొర్రా గోవర్ధన్	-62



సీరియల్స్

ప్రేమసౌధం	...పుష్పాల సూర్యకుమారి	-8
ఏదో ఒకనాడు	...డా॥నందమూరి లక్ష్మీపార్వతి	-31
నిర్వేదం-	...సాగర్ శ్రీరామకవచం	-46

కథలు

చెరపకే చెడేవు	...పి.రాధామహేశ్వరి	-17
ప్రియమైన మీకు	...డా.కె.శ్రీనివాసులురెడ్డి	-24

నూతనమిత్రునికో సమకాలీన లేఖ

సంపాదకుడి మాట

జూమ్ సంకెళ్ళ నుండి విముక్తి పొంది కాస్త ప్రత్యక్ష సాహిత్య కార్యక్రమాల గాలులు వీస్తుండగానే 2022 మిత్రుడు వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయాడు. ఏ సంతోషాలూ, విషాదాలూ, కార్యక్రమాలూ, కాకరకాయలూ నాకు సంబంధం లేదంటూ నేనొచ్చిన పని ముగిసిందంటూ తాను తగిలించుకున్న 'కొత్త' అనే అధికార కిరీటాన్ని తీసి నీ హృదయపీఠంపై అలంకరించి స్వచ్ఛందంగా కాల విరమణ చేసి, తను చేసిన తప్పుల్ని మన్నించమని కోరుతూ ప్రశాంతంగా నిష్క్రమించాడు.

బాధ్యతల్ని స్వీకరించి విజయవాడ పుస్తకాల పండుగతో ప్రమాణస్వీకారం చేయాల్సిన నువ్వేమో పుస్తక ప్రేమికుల్ని నిరుత్సాహపరిచావు. బుక్ ఫెస్టివల్‌ని నెలరోజులకు వాయిదా వేసి పుస్తక రచయితలకు, ముద్రాపకులకు, పుస్తక విక్రేతలకూ నీ ప్రతాపాన్ని చూపించావు. నెల మార్చావు.. స్థలమూ మార్చావు.

అంతటితో ఆగావా! రావడంతోనే రాజకీయాన్ని రక్తసిక్తం చేశావు. గుంటూరు గుండెపై వాలి మృత్యునాట్యం చేశావు. వెళ్తూ వెళ్తూ నీ దోస్తు కందుకూరులో మరణ కచేరి పెడితే...నువ్వేమో గుంటూరు చెట్టుపై కెక్కి మూడు కొమ్మల్ని నేలకూల్చావు. నువ్వొచ్చేటప్పుడు నీ చేతిసంచిలో సుఖసంతోషాల సంకటిని నింపుకున్నావనుకున్నాను...నా ఆత్మీయులకు ప్రాణసంకటం మోసు కొస్తున్నావని నువ్వొచ్చాక కొన్ని గంటలకు తెలిసింది.

మనిషి విశ్వాసానికి ఆధ్యాత్మికత ఓ ఆహ్లాదకర పరిమళం. ఎవరి నమ్మకాలు వాళ్ళకు శిరోధార్యాలు. అవి వారి వ్యక్తిగత మనోభావాలు. రాజ్యాంగం పూలకొమ్మ రాల్చిన పూపరిమళాలు. వాటిపై విషం చిమ్మే కందిరీగల్ని ఉసిగొల్పి, భజనలు పాడే భక్తి మంచులో దౌర్జన్యపు మంటల్ని రేపిన పాతమిత్రుడి దురాగతాన్ని నిరసిస్తూ...ఆ మూఢఅడుసుల వైపు నీ అడుగులు వేయొద్దని ఆజ్ఞాపిస్తున్నాను.

రాజకీయాల్లో మతాన్ని, మతంలో రాజకీయాల్ని చొప్పించే చౌరబాటుతనాన్ని, సాహిత్యంలో రాజకీయాల్ని, ఆధిపత్య భావజాలాన్ని, రచయితల్లో, రచయితల సంఘాల్లో నానాటికీ పెరిగిపోతున్న అనైక్యతా బూజును వాక్యూమ్ క్లీనర్‌లా తుడిచెయ్యమని నా మాటగా చెబుతున్నాను.

ఆకుపచ్చని రాజకీయాల పంటపొలంలో విచ్చలవిడిగా సంచరిస్తూ, దాడి చేస్తూ మా నోటికందే ఆరోగ్యకర పంటమెతుకుల్ని నాశనం చేస్తున్న వ్యక్తిగత ద్వేషాల మిడతల దండుల్ని అంతం చేసే కొత్త ఫెర్టిలైజర్ని నీ చేతితో నువ్వే అందిస్తావని నమ్ముతున్నాను.

చెట్టుపై నుండి రాలిపోయిన అఫలదీకరణ పువ్వుల్లా మనుషుల్లో ఆరిపోయిన మనిషితనాన్ని వెలిగించే సామాజికబాధ్యతా చమురునిధుల్ని నీ ఏలుబడిలో ..నీ కాలపరిధిలో నింపుతావని పూర్తి విశ్వాసంతో వున్నాను.

చివరిగా-

ఇది చాలా ముఖ్యమైన మాట. ఆరోగ్యకరమైన మాట. నా జాతి ప్రాణాలకు సంబంధించిన మాట. చెవులతో కాదు..మనసుతో విను. నువు రాకముందు నుండే నీ మీద అభాండాలు వేశారు. కార్ల వేగంకన్నా మిన్నగా పుకార్లు పుట్టించారు. అవి పుకార్లో, అభాండాలో లేక నిజంగానే వాస్తవాలో నువ్వే చెప్పాలి. నీకూ నాకూ మిత్రుడైన ***విజన్ 2020*** అమలుపర్చిన 'వేవ్‌లు..లాక్‌డౌన్‌లు' అనే ప్రమాదకర ఎజెండాని భుజానికి వేలాడేసుకుని వస్తున్నావని, అదే నీ కొత్త మేనిఫెస్టో అని నా వాళ్ళందరూ భయకంపితులౌతున్నారు. మెజారిటీని గెలుపుసూత్రంగా భావించే వ్యవస్థలో వున్నాను కాబట్టి నాకూ నీ మీద అనుమానమొస్తుంది. నిజం చెప్పు..నిజంగా నీ కొత్త మేనిఫెస్టో అది కాదుకదా! కాదులే..నువ్వంత దుస్సాహసానికి ఒడికట్టవని నమ్ముతున్నాన్లే. నా నమ్మకానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే నువ్వొక నమ్మకద్రోహిగా చరిత్రలో మిగిలిపోతావ్ జాగ్రత్త.

- కవిమిత్ర

జనవరి 1

సాహిత్యంలో విజిల్ బ్లోయర్స్-వారి ఆత్మహత్యలు

తెలుగు సాహిత్యంలో విమర్శ ఎండమావిగా మారినప్పుడు విజిల్ బ్లోయర్స్ అవతరించారు. ఇది ఆనంద దాయకం. సాహిత్యంలో అనగా తెలుగు సాహిత్యంలో మొదటి విజిల్ బ్లోయర్ ఎవరు అనేది పరిశోధనాంశం. అది ఎకడమిషియన్స్‌కి వదిలేస్తాను. ఫేస్‌బుక్ వచ్చాక చాలా మేరకు విజిల్ బ్లోయర్స్ వస్తున్నారు. కానీ మొట్టమొదటి విజిల్ బ్లోయర్‌గా నేను ఆత్మహత్యలు చేసుకున్న విమర్శకులు గురించి ఆలోచించమని కోరుతున్నాను. సట్లెజ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న బంగోరేని ఇక్కడి రంగం మీదకి తేవటం లేదు.

కానీ ఇటీవల ఆత్మహననం లేదా తనని తాను ధ్వంసం చేసుకున్న అనామధేయుడి గురించి ప్రస్తావిస్తున్నాను. అతనికి నాకూ పదేళ్ళ నుంచీ కమ్యూనికేషన్స్ లేవు. ఈ పది సంవత్సరాలు అతను ఎక్కడ ఇక్కట్లు పడ్డాడో ఏ సహచరులూ చెప్పటం లేదు. అతను శవంగా మారాక నేను కాదు గోరటి వెంకన్న, అంబటి సురేంద్రరాజు, వెన్నెలకంటి రామారావు తరలి వచ్చి అంజలి ఘటించారు. నాకు బాగా మతిమరుపు వచ్చింది. మిగతావాళ్ళ పేర్లు ప్రకటించకపోతే క్షమించండి. ఇది నాకు దుఃఖకాలం. నా ఇంట్లో నేనో దొంగగా మారి పోయాను. ఆర్థికమాంద్యం తప్పదు. మా ఆవిడ పర్సులో పదిహేను వేలు దొంగిలించాను. రాత్రి పట్టుపడ్డాను.

విషయం దారి తప్పుతున్నా, విజిల్ బ్లోయర్‌గా నేనున్నూ నిజం చెప్పాలి కదా! మళ్ళీ మొదటికి వస్తాను. అనామధేయుడి మరో దృక్పథం ప్రచురణలు విజిల్స్ వెనకాతల నేనున్నాననే అభియోగాలు చాలా వచ్చాయి. సాహిత్యంలో పీఠాధిపతులు అలాగే భ్రమించారు. ఆటా వారు తానా వారూ అది నిజం కాదు..మీరు నవలలు గాని నవలలకు బహుమతులిస్తారు. యం.యస్.సుబ్బలక్ష్మి కాపీ నవలకి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి ఇప్పిస్తారు. బుక్ పెయిర్‌లో మీ పుస్తకాలకి రేటింగ్ పెంచుతారు. ఇంతవరకు కిలోల లెక్కన తూచి నవల గాని నవలకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ఇప్పిస్తున్న క్రీడా కార్యక్రమాన్ని బట్టబయలు చేయటానికి ఇంక విజిల్ బ్లోయర్స్ లేరు. వాళ్ళని ఆత్మహత్యలు చేసుకొనేలా వాళ్ళ సహచరులు ఉద్భవించాక మీకేమి అడ్డు వుంది. సాగించండి మీ పుస్తక విక్రేత క్రీడా వ్యాపారం. అన్ని రంగాల్లో మీరు చపాతీలు వండాక కూరలు వండటానికి వంగిమాగధులు ఎప్పుడూ వుంటారు. మీరు ప్రకటించిన ఏ పుస్తకం నవలా శిల్పంలో ఒదగదు. అయినా మీ మాఫియా నడుస్తుంది. శాలువా కప్పుకున్న ఓ ఆకారం మీకు తోడుగా వుంటుంది.

మళ్ళీ రంగం మీదికి అనామధేయుల్ని కాదు విజిల్ బ్లోయర్స్‌ని తెస్తున్నాను. నాకు ఏ గతం గుర్తుకు రావటం లేదు. ఆ గతం మీదా నమ్మకం లేదు. మార్క్సిస్టు వివేచనతో బతికే నాకు సాహిత్యంలో ఎదురవుతున్న దొంగల గురించి మాట్లాడే ఓపిక లేదు. సాహిత్యంలో రాయని భాస్కరులు, రాయటం చేతగాని కవులూ రాజ్యమేలుతున్న రాజ్యమిది. మీరు అవార్డుల పేరిట డబ్బులు సంపాదించుకుంటారు, కానీ కిలోల సాహిత్యానికి నిలువ నీడ వుండదు. ఇంకానా మీ వ్యవహారం.. సాగదు. కేంద్ర సాహిత్య అకాడమీ అనే బురద గుంటని ఇంక ఎండగట్టాల్సిన అవసరం వచ్చింది. ఒకడు లేదా సంస్థ బహుమతి ఇస్తే దానికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు ఇచ్చే ఈ దుర్గతి ఏంది మాస్టారూ!

నిజమైన సాహిత్యానికి పట్టంగట్టే కొత్తరోజులు రావాలి. అవార్డులూ, బహుమతులూ, సన్మానాలూ, శాలువాలూ ఆ కొత్తరోజుల కోసం అన్వేషిస్తున్నాయి. అందుకు ప్రతి కవీ, రచయితా తప్పక ఉద్యమించాలి.

-సాగర్ శ్రీరామకవచం, 98854 73934

లంబాడి బృందంతో మంత్రి రోజా నృత్యం

తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, కళలు, కళాకారుల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాకారుల్లోని ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో డిసెంబరు 19, 20 తేదీల్లో విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు జరిగాయి. ఈ సంబరాలకు మంత్రి రోజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు వేదిక ప్రాంగణంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి కుటుంబంపై ఏర్పాటు చేసిన 'ఆర్ట్ ఎగ్జిబిషన్'ను ఆమె ప్రారంభించారు. ఈ సంబరాల్లో తేళ్ళు, నాగపాముతో కళాకారులు చేసిన ప్రదర్శన వీక్షకుల మన్ననలు పొందాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన జోషిక శివునిపై జానపదం గానంతో అలరించింది. డి.ద్వారతి బృందంతో లంబాడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా బంజారా కళాకారులు వరినాట్లు, కోతలు, ఇంకా ఇతర వ్యవసాయ పనులను నృత్యరూపం చేసి అందరి అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. స్టేజి కింద నుండి వీక్షిస్తున్న మంత్రి రోజా.. వెంటనే స్టేజి పైకి వెళ్ళి లంబాడి బృందంతో నృత్యం చేశారు. బృందంలోని ప్రతి కళాకారిణికి షేక్‌హ్యాండ్ ఇచ్చి మంత్రి రోజా అభినందనలు తెలిపారు.



①
②
?!!
③
BOMMAN

సీరియల్

ప్రేమసౌధం

పుష్పాల సూర్యకుమారి

15

(గత సంచిక తరువాయి)

ఉస్సురంటూ తన బెడ్‌మీద పడుకొని "బావ ఎంత అందగాడు... మంచి రసికుడు కూడాను. అక్కను బావ ప్రేమించినట్టు ఏ మగాడు భార్యను అంతగా ప్రేమించడేమో... బావను తను గాఢంగా ప్రేమిస్తోంది... తనవైపు తిప్పుకోవాలని ఎంత ప్రయత్నించినా లొంగటంలేదు.

ఎలాగయినా మోసం చేసి అయినా బావను తన వాడిని చేసుకోవాలి... బావచేత తన మెడలో మూడు ముళ్ళు వేయించుకోవాలి. ఇది లోక విరుద్ధమైనా తప్పదు. ఏం ఒక మగాడికి ఇద్దరు భార్యలు ఉంటే తప్పేమిటి?" ఒక ప్రణాళిక తయారు చేసుకుంది.

***

ఆ మరునాడు రవితేజ అప్పుడే ఫ్యాక్టరీ నుండి వచ్చాడు... డ్రెస్ మార్చుకొని స్నానానికి వెళ్ళటాన్కి టర్కీటవల్ చుట్టుకొని బాత్‌రూమ్‌కెళ్ళాడు. సోప్ లేదు... ఇవతల కొచ్చి "మేఘనా! మేఘనా! సోప్ కావాలి!" పిలిచాడు. అతడి పిలుపు భార్యకు చేరలేదు... అఖిల చెవులకు సోకింది. మెరుపులాంటి ఆలోచన వచ్చింది... తృటిలో సోప్‌తో ఆ గదిలోకి ప్రత్యక్షమైంది. అతడు ఆమెకు వెనుతిరిగి ఏదో ఆలోచిస్తూ ఉన్నాడు. అతడివంటి మీద టవల్ తప్పితే ఏ ఆచ్ఛాదనా లేదు... దబ్బపండు రంగులో బలిష్టంగా ఉన్నాడు.

అఖిల ఒక్కక్షణం విభ్రాంతిగా చూసి శబ్దం కాకుండా వెనుక నుండి అతడ్ని పెనవేసుకొంది. అతడి స్పర్శ ఆమె గుండెల్ని ఏదో లోకానికి తీసుకుపోయింది. తమకంతో ముఖాన్ని అతడి వీపుకి ఆన్చింది.

ఈ హఠాత్తు పరిణామాన్ని ఊహించని అతడు అయోమయంలో పడి "ఏయ్ మేఘనా! ఏంటిది? నీకీ మధ్య కొంటె చేష్టలు ఎక్కువైపోతున్నాయి!" అంటూ ఇటు తిరిగాడు. కొయ్యబొమ్మలా అయిపోయాడు.

"అఖిలా! ఏంటీ పని? మీ అక్కకు అన్యాయం చేస్తున్నాననే జ్ఞానం ఉందా? అక్క మొగుడు తండ్రితో సమానం!" ఛీదరించుకుంటూ విడిపించుకున్నాడు.

"బావా! నువ్వు నాకు కావాలి! నువ్వు లేకుండా నేను బ్రతకలేను!" అంటూ మళ్ళీ అతడి గుండెల్ని చుట్టేసింది.

"ఛీ! నీకు మదపిచ్చి ఎక్కువ అనుకుంటాను! వదులు!" అంటూ దూరంగా నెట్టేసి బాత్‌రూమ్‌కెళ్ళాడు.

***

రెండు రోజుల తరువాత రవితేజ భోజనం చేస్తూ అటు వెళుతున్న అఖిలను చూసి "ఏమిటీ మీ చెల్లెలు ఇవేళ చీరకట్టింది? డ్రెస్సుల్లో కంటే మీ చెల్లెలికి చీరే బాగుంది!" క్యాజువల్‌గా అన్నాడు భార్యతో.

మేఘన ముఖం మాడిపోయింది. "అవును లెండి నేను పిల్లలు పుట్టిన తరువాత ముసలిదాన్ని అయిపోయాను కదా... నేను చీరలు కట్టుకొంటే బాగోదు... అది పడుచుపిల్ల కదా అది కట్టుకొంటేనే మీకళ్ళకి బాగుంటుంది!" ఎత్తిపొడుపుగా అంది.

"నేనేదో మామూలుగా అంటే సీరియస్‌గా తీసుకొంటావేమిటి? నువ్వు అందంగా లేవని నేను అన్నానా.. నీకు నువ్వే కించపరుచు కుంటావు దేనికి?" బాధ తొణికిసలాడింది.

అఖిల వారి సంభాషణను చాటుగా వింటోంది. "బావ తనని మెచ్చుకుంటున్నాడంటే తనంటే ఇష్టపడుతున్నట్టేగా!" లోలోన మురిసిపోయింది.

రవితేజ బెడ్‌మీద పడుకొని కాసేపు ఇండియా టుడే తిరగేసి, నిద్రముంచుకు రావడంతో లైట్ ఆఫ్ చేసి పడుకున్నాడు

సరిగ్గా రాత్రి పన్నెండవుతోంది. అందరూ మంచి నిద్రలో ఉన్నారు. అఖిల చడీ చప్పుడు కాకుండా రవితేజ పక్కలో చేరింది. గాలి కూడా చొరబడనంతగా అతడ్ని అల్లుకుపోయింది.

మంచి నిద్రలో ఉన్న రవితేజ ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. చిమ్మచీకటి. అఖిల బెడ్‌లైట్ కావాలనే ఆపేసింది. సుతిమెత్తగా ఆమె ఎద ఛాతికి తాకుతుంటే గుండె జల్లుమంది. వళ్ళు నిలువెల్లా పులకించింది. "ఎవరు మేఘనా!" అడిగాడు మంద్రంగా.

ఆమె బదులు ఇవ్వలేదు.

"ఏవిటీ! నిద్రపట్టడంలేదా?" గోముగా అడిగాడు.

ఆమెనుండి ఏ సమాధానం లేదు.

"ఏరా! మాట్లాడవేం?" గారాబంగా అడిగాడు.

ఆమె గాలిచొరబడనంతగా అల్లుకుపోయి "ఐ... లవ్...యూ...!" బావా... ఐ... లవ్...యూ!" తమకంతో అంది.

అతడికి సెకన్‌లో అది అఖిల గొంతని తట్టింది. పక్కలో బాంబు పేలినట్టు లైట్‌వేసి మంచం దిగాడు.

ఆమె వైపు ఛీత్కారంగా పురుగును చూసినట్టు చూసి; "ఛీ! నీ అంత కామాంధురాలు ఈ లోకంలో ఉండదేమో... అక్కకు అన్యాయం చేస్తున్నానే అన్న ఇంగిత జ్ఞానం

ఉందా? ఇంత మోసానికి తలపడతావా... అందరూ పడుకున్న సమయంలో లైట్ ఆఫ్ చేసి నా కళ్ళు కప్పి నా పక్కలో దూరి నన్ను లోబరుచుకోవాలనికోవటం నీ అజ్ఞానం... మీ అక్క అనుకున్నాను... ఇంకా నయమే జరగ రానిది ఏమైనా జరిగితే... నీ జీవితం ఏమ య్యేది. నువ్వే నష్టపోతావు!" అన్నాడు తీక్ష ణంగా చూస్తూ.

అఖిల ఏడుస్తూ అతడి కాళ్ళు పట్టుకొని "బావా! నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకోవూ?" అర్థింపుగా అడి గింది.

అతడు ఆమెను విడిపించుకొని దూరంగా జరిగి... "ఇదిగో ఇప్పుడే చెబుతున్నాను... నా హృదయంలోకి గానీ, నా జీవితంలోకి గాని నీకు ఎప్పటికీ చోటులేదు. మీ అక్కకు తప్పి తే! దట్సాల్!" అనేసి విసురుగా గుమ్మం దగ్గరకొచ్చి కొయ్యబొమ్మలా అయిపోయాడు.

మేఘన ఎప్పుడు వచ్చిందో తెలియదు... జరిగింది చూసినట్టుంది. చలనంలేని బొమ్మ లా నిలబడిపోయింది.

రవితేజ ఆమెను తప్పించుకొని హాల్లోకి వెళ్ళి సోఫాలో పడుకున్నాడు.

మేఘన, అఖిలను ఛీత్కారంగా చూసి మౌనంగా హాల్లోకొచ్చి భర్త దగ్గర నిలబడింది.

తేజ ముఖం మీద చేతులు అడ్డుగా పెట్టుకొని అశాంతిగా పడుకున్నాడు.

"ఏమండీ! ఇక్కడ పడుకున్నారేంటి, మన గదిలో పడుకుందురుగాని రండి!" అంది ఆప్యాయంగా చేతులు తొలగిస్తూ.

"నన్ను ఎక్కడో అక్కడ చావనీ... నెల్లా లనుండి నాకు మనశ్శాంతి లేకుండా చేస్తు న్నావుగా... మదఘటాన్ని వెంటబెట్టు కొచ్చి!" సీరియస్‌నెస్‌గా అన్నాడు పక్కకు తిరిగి పడుకుంటూ.

మేఘనకు వెంటనే అర్థమైంది. అతడు అశాంతితో, ఆవేదనతో ప్రిదివిపోతున్నాడు. అఖిలను వెంటబెట్టుకొచ్చాననే అతడికోపం.

***

ఆరోజు మధ్యాహ్నం భోజనం అయిన తరువాత రవితేజ కాసేపు రెస్ట్ తీసుకుందా మనే ఆలోచనతో తన గదిలోకెళ్ళాడు. అతడి బెడ్‌మీద అఖిల పడుకుని ఉంది. అతడికి చికాకు అనిపించింది. టీ.వీ. హాల్లో సోఫాలో పడుకున్నాడు.

విశాలాక్షి "అదేం నాన్నా! నీ గదిలో పడు కోలేకపోయావా...సోఫాలో పడుకున్నా వేంటి?" అడిగింది ఆప్యాయంగా.

అక్కడే ఉన్న భార్యవైపు ఓరగా చూస్తూ "తల్లివి కాబట్టి నీకుంటుంది బాధ...కట్టుకొన్న భార్యకు ఎక్కడుంటుందీ బాధ. నేనెక్కడ పడుకున్నా తనకేమీ పట్టదు!" వ్యంగ్యబాణం వదిలాడు.

మేఘన విలవిల్లాడింది... "అదేంటి మధ్యలో నేనేం చేశాను!" అడిగింది.

"నెల్లాళ్ళనుండి మీ చెల్లెల్ని వెంటబెట్టు కొచ్చి నాకు మనశ్శాంతి లేకుండా చేశావుగా...!" దెప్పిపొడిచాడు.

"అత్తయ్యా! చూడండి మీ అబ్బాయి మాటలకు అర్థం ఉందా? తనకేదో పరీక్ష ఉ ందని వచ్చింది. అది అయిపోతే వెళ్ళిపోతు ంది. వెళ్ళిపొమ్మని నా నోటితో ఎలా చెప్పను?" కళ్ళనీళ్ళతో అడిగింది.

"నువ్వు ఎలా చెబుతావు చెల్లెలు కదా... ఫ్యాక్టరీ నుండి వచ్చి కాసేపు రెస్ట్ తీసుకో వాలని ఉన్నా ప్రశాంతంగా నాకు పడుకోవ డానికే వుండటం లేదు... నాకసలు ఇంటి దగ్గర ఉండబుద్ధి వేయటం లేదు... చాలా చికాకుగా ఉంటోంది!" అంటూ లేచి డ్రెస్ వేసుకొని బయటికి వెళ్ళిపోయాడు.

విశాలాక్షి గారు కోడలిని నిలదీసి అడిగి ంది "ఏమిటీ మీ ఇద్దరికీ ఏమైనా గొడవలా!"

మేఘన వెక్కి వెక్కి ఏడ్చింది. అత్తగారికి అఖిల ప్రవర్తన గూర్చి చూచాయిగా చెప్పేసి బరువు తీర్చుకుంది.

"నువ్వేమీ బాధపడకు... వాడికి నేను చెబుతానుగా!" ఓదార్పుగా అంది.

"అత్తయ్యా! అఖిల నా సొంత చెల్లెలు కాదు... మా పిన్ని కూతురు. చిన్నప్పుడే తల్లీ తండ్రీ యాక్సిడెంట్‌లో చనిపోతే మా అమ్మ, నాన్న పెంచి పెద్దచేసారు.!" అంటూ ఓ నగ్న సత్యాన్ని వెల్లడించింది.

ఆ సాయంత్రం తేజ బయటినుండి అప్పుడే ఇంటికి వచ్చాడు. తన గదిలోకెళ్ళే సరికి భార్య ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోంది. ఆమె భర్తను గమనించలేదు.

అతడు మెల్లగా సోఫాలో కూర్చుని రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలాడు.

"అమ్మా! అఖిలను నువ్వు గాని, నాన్నగారు గాని వచ్చి తీసుకెళ్ళండి. అది ఇక్కడ నా సంసారంలో నిప్పులు పొయ్యాలని చూస్తోంది!"

"ఏం చేసింది! చెప్పమ్మా మేఘనా!" అడిగింది తల్లి అవతల నుండి.

"ఇక్కడికి రండి అన్నీ వివరంగా చెబుతాను. మీ అల్లుడుగారు మంచివారు కాబట్టి అన్నీ భరిస్తూ మౌనంగా ఊరుకుంటున్నారు. అది చేసే వెధవ పనులకి వేరే ఎవరైనా అయితే దీని బ్రతుకు నడిరోడ్డుమీద విస్తరిలా అయ్యేది!"

"అవునా!"

"నెమ్మదిగా అంటావేంటి! రాత్రి ఆయన నామీద ఎప్పుడూ లేంది విరుచుకు పడ్డారు. మీ వంశంలో ఇలాంటి ఆడవాళ్ళున్నారా అని దెప్పిపొడిచారు. నాకెంత సిగ్గేసిందో తెలుసా... మన కుటుంబం ఎంతో సంప్రదాయబద్ధంగా, ఉన్నతమైనది. మనకెప్పుడైనా ఇలాంటి చెడ్డపేరు వచ్చిందా? తల్లినీ, తండ్రినీ పోగొట్టుకొన్న అనాధను తీసుకొచ్చి పెంచి పెద్దచేసి చదివిస్తున్నారు. దీనికి ఆ విశ్వాసం ఉందా? కృతఘ్నతను ప్రదర్శిస్తోంది. ఏనాడైనా మనింట్లో బయటి పిల్లని చిన్నచూపు చూశామా... నన్ను తమ్ముడ్నీ ఎలా చూవారో తననీ అంత గారాబంగా చూశారు! మీ అల్లుడుగారు దీని ప్రవర్తనకి నామీద చిరాకు పడుతున్నారు. మీ ఇద్దరిలో ఎవరో ఒకరు వచ్చి తీసుకెళ్ళండి. ఉంటాను!" అని ఫోన్ పెట్టేసి ఇటు తిరిగింది.

భర్త సోఫాలో కూర్చుని భార్యనే ఆరాధనగా చూస్తున్నాడు.

"ఎప్పుడొచ్చారు! కాఫీగానీ, టీగానీ తేనా!" అడిగింది దగ్గరకొచ్చి.

"ఏమీ వద్దు ఇలారా! నా ప్రక్కన కూర్చో!" అంటూ కూర్చోబెట్టుకున్నాడు.

"ఫోన్‌లో మీ అమ్మగారితోనా మాట్లాడుతున్నావు?" అడిగాడు.

"ఊఁ! అమ్మగానీ, నాన్నగారు గానీ వచ్చి అఖిలను తీసుకెళ్ళిపోతానన్నారు!" చెప్పింది.

"అఖిల మీ సొంత చెల్లెలు కాదా?" అడిగాడు.

"మా పిన్ని కూతురు. పిన్నీ, చిన్నాన్నా యాక్సిడెంట్‌లో పోతే అమ్మా నాన్నగారు చేరదీశారు. ఎప్పుడు మేం ఎవరితోనూ ఈ ప్రస్తావన తీసుకురాము. అఖిల బాధపడుతుందనీ... దానికీ తెలియదు విషయం చాలా రోజుల వరకూ...మన పెళ్ళిలో ఎవరి ద్వారానో తెలుసుకుంది. అమ్మా నాన్నగారు మమ్మల్ని ఎంత ప్రేమగా చూస్తారో అఖిలను కూడా అంత ప్రేమగా చూస్తారు. పెళ్ళి కూడా ఎంతో ఘనంగా చెయ్యాలనుకుంటున్నారు!" చెప్పింది.

"భార్యను దగ్గరకు తీసుకొని "సారీరా! అనవసరంగా రాత్రి మీ వంశాన్ని నిందించాను. చాలా బాధపడ్డావు కదూ!" మార్దవంగా అని నడుంచుట్టూ చెయ్యివేసి స్పృశించాడు.

ఆ మరునాడు రావుగారు వచ్చి అఖిలను తీసుకెళ్ళిపోయారు.

***

రవితేజ అప్పుడే బయటి నుండి వచ్చాడు. ముఖం సీరియస్‌నెస్‌గా ఉంది.

మేఘన భర్తను పరిశీలనగా చూసి- "ఏమిటీ అలా ఉన్నారు? ఏమైందండీ!" ఆదుర్దాగా అడిగింది.

"మీ చిన్నాన్న కొడుకు ఉన్నాడుగా వినోద్ మన ఫ్యాక్టరీకి చాలా చెడ్డపేరు తెస్తున్నాడు. మా పినమావగారి కొడుకని చెప్పుకోవడానికి చాలా సిగ్గనిపిస్తోంది!" ఇరిటేట్‌గా ముఖం పెట్టి అన్నాడు.

"ఏం చేస్తున్నాడు!"

"మన ఫ్యాక్టరీలో పనిచేసే పెళ్ళికాని అమ్మాయిలతో చాలా వరస్ట్‌గా బిహేవ్ చేస్తున్నాడట... ఇవాళ వర్కర్స్ వచ్చి నాకు కంప్లయింట్ ఇచ్చారు!"

"గట్టిగా వార్నింగ్ ఇవ్వకపోయారా!" అంది.

"ఇలాంటి వెధవ్వేషాలేస్తే నేను ఊరుకోనని తెలుసుగా! నాలుగు చివాట్లు పెట్టి వచ్చాను! అయినా దగ్గిరవాళ్ళని చేరదీయకూడదు... ఇలాంటి ఇబ్బందులే ఉంటాయి! నీ ముఖం చూసి సరేనన్నాను. నాకయితే ఎంతమాత్రమూ ఇష్టం లేదు!" అన్నాడు భార్య కళ్ళలోకి చూస్తూ.

"అనవసరంగా మా మూలంగా మీరు ఇబ్బంది పాలవుతున్నారు. మొన్నటి వరకూ అఖిల ప్రవర్తనతో విసిగిపోయి ఉన్నారు. ఇప్పుడు వినోద్!" జాలిగా చూస్తూ భర్త శిరస్సు మీద చేత్తో నిమిరింది.

అతడు భార్యను ఆరాధనగా చూస్తూ "నువ్వు మాత్రం కలగన్నావా వీళ్ళు ఇలా



ప్రవర్తిస్తారని! బాధపడకు!" అనునయంగా అన్నాడు.

***

నాలుగు రోజుల తరువాత సత్తిబాబు ఒగురుస్తూ ఇంటికి వచ్చాడు లూనా మీద.

ఆ సమయంలో మాధవరావుగారు మనుమరాల్ని ఒడిలో పడుకోబెట్టుకుని ముద్దు లాడుతున్నారు. తరుణ్ తాతగారి వీపుమీద వాలి రెండు చేతులు కంఠానికి వేసి "తాత గారూ! ఫ్యాక్టరీకి తీసుకెళతానన్నారుగా నన్ను తీసుకెళ్ళండి!" గారాబంగా అడిగాడు.

"మీ డాడీని అడుగు తీసుకెళతాడు!" అన్నారు.

"డాడీ ఏమో రేపు తీసుకెళతాను నాన్నా!" అంటున్నారు. ఎప్పుడు అడిగినా!" బుంగ మూతి పెట్టాడు.

"సర్లే రేపు తప్పకుండా తీసుకెళతాను!" అంటూ అనునయించారు.

"ప్రామిస్!" అడిగాడు నవ్వుతూ.

"ప్రామిస్!" అబ్బో నీకిన్ని మాటలు ఎప్పుడొచ్చాయిరా!" అంటూ ముద్దుపెట్టు కున్నారు.

సత్తిబాబు లోపలకు ప్రవేశించి "పెద్ద అయ్యగారు! ఘోరం జరిగిపోతోంది!" అన్నా డు భయంగా చూస్తూ.

"ఏమైందిరా?!" ఆందోళనగా అడిగారు. ఆయన భృకుటి విచిత్రంగా ముడివడింది.

"మన వినోద్ బాబుగారు లేరండీ! ఆయన వలనే ఫ్యాక్టరీలోని వర్కర్స్ అంతా మన చినబాబు గారి మీద తిరగబడ్డారు!" చెప్పాడు.

మేఘన గుండె ఝల్లుమంది. భయంతో శరీరమంతా చమటలు పట్టసాగాయి. గుండె ల్లో దుఃఖం తన్నుకొస్తోంది. "ఏమైంది సత్తి బాబూ! మీ అయ్యగార్కి ఏంకాలేదు కదా!" కంగారుగా అడిగింది. పెదవులు వణుకు తున్నాయి.

మాధవరావుగారి పరిస్థితీ అలాగే ఉంది గుండెల్లో గుబులు మొదలైంది.

విశాలాక్షిగారు "ఏమైందిరా తొందరగా చెప్పు. రవిబాబుకి ఏం కాలేదుకదా!" ఆందో ళనగా అడిగింది.

"అసలు విషయం ఏమిటో చెప్పరా మమ్మల్ని చంపకా!" కసురుకున్నారు మాధవ



రావుగారు.

"మన వినోద్ బాబుగారు మన ఫ్యాక్ట రీలో పనిచేస్తున్న అమ్మాయిల్ని ఏడిపిస్తుం టారు. ఈ విషయం రవిబాబు గారికి తెలిసి గట్టిగా కేకలు వేవారు. ఇవాళ ఏం జరిగిం దంటే, రవిబాబు గారి దగ్గర పర్సనల్ సెక్రట రీగా పనిచేస్తున్న రాధ అనే అమ్మాయిపై రేప్ చెయ్యబోయాడు... ఈ సంఘటన అనుకో కుండా మన రవిబాబు గారి కంటపడింది. వెంటనే రంగంలోకి దూకి మన బాబుగారు ఆ అమ్మాయిని రక్షించారండి. బాబుగారు ఆ సమయానికి అక్కడికి రాకపోతే ఆ అమ్మాయి బ్రతుకు కుక్కలు చించిన విస్తరి అయ్యేది. రవిబాబు ఆవేశంతో వినోద్‌బాబు మీద చెయ్యి చేసుకొని గట్టిగా వార్నింగ్ ఇచ్చి ఫ్యాక్టరీ నుండి సస్పెండ్ చేశారు.

వినోద్ బాబు అవమానంతో కోపంతో వెళ్ళిపోయి... ఫ్యాక్టరీ వర్కర్స్‌ని రెచ్చగొట్టి తన మీద చెయ్యి చేసుకున్న యజమాని మీద మీరంతా తిరగబడాలి అంటూ ఓ వంద మంది వర్కర్స్‌ని వెంటబెట్టుకొచ్చాడు.

"రవి నాకిదంతా ఫోన్ చేసి చెప్పవ చ్చుగా!" అన్నారు ఆవేదనగా.

"మీరు కంగారు పడతారని చెప్పలేదు. మన పెదబాబు మురళీకృష్ణగారు, శశాంక్ గారు అక్కడే ఉన్నారండి!"

"రవీ!" అంటూ విశాలాక్షిగారు సోఫాలో కూర్చుని చిన్నగా ఏడ్పు ఆరంభించారు!"

"విశాలా! నువ్వేం కంగారు పడకు రవికి ఏంకాదు. పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇస్తాను. నేను వెళుతున్నానుగా ధైర్యంగా ఉండు!" అంటూ పాపను కోడలి చేతికిచ్చి సత్తిబాబు వెంట బైక్ మీద ఫ్యాక్టరీకి వెళ్లారు. దారిలో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టు ఇచ్చి వచ్చారు.

12

ఫ్యాక్టరీ ఆవరణలో చాలా గందరగో ళంగా, భయానకంగా ఉంది పరిస్థితి. వర్కర్స్ గొంతులు చించుకొని "యాజమాన్యం నశిం చాలి.. యాజమాన్యం నశించాలి... ఏ తప్పు చెయ్యని వినోద్‌కి సారీ చెప్పాలి. ఎటువంటి కారణం లేనిదే వినోద్‌ని సస్పెండ్ చెయ్యటా న్ని మేం అంగీకరించం. ఇది అన్యాయం... ఇది అన్యాయం!" బిగ్గరగా ఆకాశం చిల్లులు పడేలా అరవసాగారు.

వాళ్ళని ఎలాగో తప్పించుకొని మాధవ రావుగారు ఫ్యాక్టరీ కారిడార్‌లో నిలబడి "ఆగండి! ఆగండి!" సింహగర్జనలా ఉంది అధికారంతో కూడినటువంటి ఆయన ఆజ్ఞ.

వాళ్ళు ఇంకా గొంతులు చించుకొని అరుస్తూనే ఉన్నారు.

"మీకు నామీద గౌరవం ఉంటే నేను చెప్పేది సాంతం వినండి!" అభ్యర్థనగా అన్నారు.

వాళ్ళలో వాళ్ళు తర్జన భర్జన చేసుకొని ఒక నిర్ణయానికి వచ్చి వాళ్ళంతా మౌనంగా శ్రోతలుగా మారారు.

"నాన్నగారు! మీరెందుకు వచ్చారు ఇక్కడికి... మీకసలే వంట్లో బాగాలేదు. మేం పోలీసులకు కంప్లయింట్ ఇచ్చాము వాళ్ళే చూసుకుంటారు!" ఆదుర్దాగా అన్నాడు తేజ.

"తేజా! వాళ్ళకి అసలు జరిగిన విషయం తెలియక ఇలా రెచ్చిపోతున్నారు... ఆ వినోద్ గాడు అసలు విషయాన్ని దాచిపెట్టి వీళ్ళని రెచ్చగొడుతున్నాడు... మన ఫ్యాక్టరీలో వర్కర్స్ ఎప్పుడైనా ఇలా మనల్ని ఎదిరించారా, తిరగ బడ్డారా! వాళ్ళకి నిజం తెలియాలి నాన్నగార్ని మాట్లాడనివ్వు!'' అన్నాడు మురళీకృష్ణ.

తేజ మౌనంగా ఉండిపోయాడు.

"మీ యజమాని రవితేజ మీకెప్పుడైనా చీమకుట్టినంత బాధ కలిగించాడా! మీకోసం, మీ పిల్లల ఆరోగ్యం కోసం ఒక హాస్పిటల్ కట్టించి, డాక్టర్లను నియమించి మీకు అన్ని వేళలా వైద్య సౌకర్యాలు అందిస్తున్నాడే... మీ పిల్లల చదువు కోసం ఒక స్కూల్ కట్టించాడే... మీకు ప్రతి సంవత్సరం బోనస్సులుతో పాటు, సంక్రాంతి నాడు మీ కుటుంబంలోని అందరికీ బట్టలు పంచుతున్నాడే... మీకు ఎల్లవేళలా అన్ని సౌకర్యాలు కలిగిస్తున్న మీ యజమాని పైనే ఈనాడు తిరగబడుతున్నారు కారణం తెలుసుకోకుండా...!''

"కారణం మాకు తెలియదుకదా పెద బాబుగారూ!'' అన్నారు.

"సత్తిబాబు! రాధను ఇలా పిలు!'' అని ఆర్డర్ వేయగానే రాధ వచ్చి అక్కడ భయం భయంతో నిలుచుంది కన్నీళ్ళు కారుస్తూ.

"రాధ! జరిగింది చెప్పమ్మా!'' అన్నారు మాధవరావుగారు.

"వినోద్ నన్ను రేప్ చెయ్యబోయాడు... అది తేజగారు చూసి దేవుడులా వచ్చి నన్ను కాపాడారు... ఆయన నన్ను రక్షించకపోతే నా జీవితం బూడిద అయ్యేది. నా శీలాన్ని కాపాడి నాకు బ్రతుకును ఇచ్చిన ఆ మహానుభావుని మీద మీరు ఆగ్రహించటం న్యాయమా?'' ఆవేదనగా అడిగింది కళ్ళనీళ్ళతో.

అందరూ సిగ్గుతో కుచించుకుపోయారు.

"ఇప్పుడు చెప్పండి ఇలాంటి దుర్మార్గుడ్ని కొట్టకుండా మీరు ఊరుకొంటారా... మా రవి సస్పెండ్ చెయ్యటం తప్పా?'' ఉద్రేకంగా అరిచారు మాధవరావుగారు.

"బాబుగారు! మమ్మల్ని క్షమించండి! మాకు అసలు విషయం తెలియదు. రవి బాబుని అపార్థం చేసుకున్నాం... ఇలాంటి దుర్మార్గుడ్ని కొట్టటం కాదు నరికి పోగులు

పరిపాలన చేతులు మారుతున్నప్పుడల్లా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి కానీ రైతులకు, రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆశించిన భరోసా కనబడటంలేదు. రైతును, రైతు కుటుంబాన్ని కేవలం ఓటు కోసం ఉపయోగించుకుంటున్న వై.సీ.పీ. ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకునే స్థితిలో లేదు.

-జనసేన నేత పవన్ కళ్యాణ్

ప్రేమసౌధం

పెట్టాలి... ఆడకూతుర్ని పాడుచెయ్యాలనుకున్న ఈ పాపాత్ముడ్ని చంపి పాతరేయాలి!'' తలో మాటా అంటూ వినోద్‌పై పిడి గుద్దులు గుద్దసాగారు''.

రవితేజ మేల్కొని మెరుపులా వెళ్ళి అడ్డుకొని! "అతడి మీద సరైన యాక్షన్ నేను తీసుకుంటాను. వదలండి!'' అన్నాడు అధికారికంగా.

వాళ్ళు మౌనంగా ఉండిపోయారు.

"వినోద్! ఇప్పటికైనా నీ మనసు మార్చుకొని మంచిగా మసలుకో!'' అన్నాడు మందలింపుగా రవితేజ.

వినోద్, రవితేజవైపు అవమాన భారంతో చూసి ముందుకి కదిలాడు. అతడిలో ప్రతీకారం బడబాగ్నిలా దహించివేస్తోంది. అతడిలో పగా, కక్షా, బలంగా నాటుకున్నాయి. ప్రపంచంలో ఒసామా బిన్ లాడెన్ లాంటి శత్రువులా రవితేజ కనిపించాడు వినోద్ కళ్ళకి. అతడు ఎలాగయినా తేజని అంతమొందించాలనుకున్నాడు.

"రవితేజ విసురుగా వెళుతున్న వినోద్ వైపు చూస్తూ "దుర్యోధనుని దురహంకారమే అతడి వంశనాశనానికి దారితీసింది. ఇలాంటి దుష్టులకు వాళ్ళ అహంకారమే ఏదో ఒకనాడు కాటువేస్తుంది!'' లోలోన అనుకుంటూ కారులో కూర్చున్నాడు. అప్పటికే అన్న, బావా, తండ్రీ కూర్చున్నారు. కారును ముందుకు పోనిచ్చాడు, పావుగంటలో ఇల్లు చేరుకున్నారు. అందరూ దిగి లోపలకు వెళ్ళారు. హాల్లో కూర్చుని ఆ విషయాలే చర్చించుకోసాగారు.

విశాలాక్షిగారు, మేఘనా ఆసక్తిగా వింటున్నారు వాళ్ళ సంభాషణ.

"ఇలాంటి వెధవల్ని అసలు పోలీసు స్టేషన్‌కి అప్పచెప్పాలి, మనం తప్పు పని చేశాం!'' అన్నాడు మురళి.

"మనకు బంధుత్వం ఒకటి ఏర్పడింది కదా అందుకనే ఊరుకోవలసి వచ్చింది!'' అన్నాడు భార్య కళ్ళలోకి చూస్తూ రవితేజ.

"ఇక ఊరుకోండి మేఘన బాధపడుతుంది. ఎంతయినా వాళ్ళ చిన్నాన్న కొడుకు కదా...!'' మందలింపుగా అన్నారు మాధవరావుగారు.

"అసలు వాడు ఇలాంటి వ్యక్తి అని తెలిసీ ఫ్యాక్టరీలో ఎందుకు పెట్టుకున్నావు? ఎప్పుడూలేంది ఈ రోజు వర్కర్స్‌చేత ఎన్ని మాటలు పడ్డాం!'' అన్నాడు మురళి.

"మేఘన రిక్వెస్ట్ చేస్తేను కాదనలేకపోయాను. అందులోను వాళ్ళ చిన్నాన్న గారు చాలా మంచి వ్యక్తి... అతడి ముఖం చూసి ఇవ్వవలసివచ్చింది!'' చెప్పాడు తేజ.

మేఘనకు చాలా అవమానంగా ఉంది. తన చిన్నాన్న కొడుకు అయినందులకు అక్కడి నుండి వెళ్ళిపోయింది, వాళ్ళ మాటలు వినలేక. తరుణ్ మురళీకృష్ణ ఒడిలో దూరిపోయి "పెదనాన్న గారూ! నన్ను అమ్మ దగ్గరకు తీసుకెళ్ళండి!'' అంటూ గారాబం చేయసాగాడు. వాడ్ని ముద్దుల్లో ముంచేస్తూ "తప్పకుండాను... మీ మమ్మీని అడిగిరా! వెళదాం!'' అంటూ పైకి లేచాడు.

వాడు గదిలోకి మెరుపులా వెళ్ళి "మమ్మీ! నేను అమ్మదగ్గరకి వెళతాను!'' అన్నాడు. వాడికి వసుధను 'అమ్మ' అనటం అలవాటు. మేఘనను 'మమ్మీ' అనటం అలవాటైంది.

"ఎలా వెళుతున్నావు!'' అడిగింది.

"పెదనాన్నగారితో!'' అన్నాడు.

"సరే వెళ్ళు!'' అంది హాల్లోకి వస్తూ.

ఇంకావుంది

కలాలు కవనాలు

నిరంతరం ప్రవహించడం జీవనది లక్షణం. హృదయక్షేత్రాలను తడుపుతూ నిత్యం ప్రవహించే జీవనది కవిత్వం. తరతరాలుగా కవిత్వం సామాజిక చైతన్యం ధ్యేయంగా కదులుతూనే వుంది. కదిలిస్తూనే వుంది. కర్తవ్య బోధ చేస్తూనే వుంది. శోకం నుండి శ్లోకం లోకం కోసం రామాయణ రూపంలో అవతరిస్తే, తెలుగు జాతి మేలుకొలుపుకోసం నన్నయ్య భారతం రాశాడు. నాటి భారత రామాయణాలు నీతి ప్రబోధకాలు. మానవాళికి మార్గదర్శకాలు. కాలం మారినా కథలు మారలేదు. మనషులు ప్రవర్తనలు మారలేదు. మానవ జీవితాన్ని వ్యాఖ్యానించేదే ఉత్తమ కవిత్వం అనుకుంటే అలాంటి కవిత్వం నాటి నన్నయ నుండి నేటి నా దాకా ప్రవాహంలా సాగి వస్తూనే వుంది. కాలానుగుణమైన మార్పులతో కదిలిపోతూనే వుంది. కొత్త కవులు వస్తూ వున్నారు. కొత్త భావాలు, సరికొత్త అభివ్యక్తీకరణలు కవిత్వాన్ని కాంతివంతం చేస్తూనే వున్నాయి. శాస్త్రాలు చదివి కవిత్వం రాయడం కాదు, సాలెగూడు తనకు తాను అల్లుకున్నట్లుగా స్వాభావికంగా సహజంగా వుండాలి. కాపిట లిస్టులు కవులు కాలేరు. సమాజం నుండే కవులు ఆవిర్భవిస్తారని ప్రసిద్ధ వాగ్గేయకార కవి గోరటి వెంకన్న చెప్పిన మాటల్ని కవులు గమనించాలి. కవులు ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకలుగా నిలవాలన్నారు. వృద్ధాప్యంలో ముఖం మీద వచ్చే ముడతల్ని అదృష్టరేఖలనే సిద్ధాంతికి, ఆకలితో అలమటిస్తే ఏర్పడ్డ గీతలనే కవికి ఎంతో తేడా వుందన్నారు. “కవులు, కళాకారులు సమాజ రుగ్మతలకు వైద్యం చేసే మానసిక వైద్యు”లన్న ప్రముఖ మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి గారి మాటల్లో ఆంతర్యాన్ని కవులు గుర్తించాలి.

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రెండురోజులు వైభవంగా జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు కవిత్వం, కళలు, సాహిత్యం సామాజిక స్థితిగతులపై జరిగిన చర్చలు, ఫలవంతమైన ప్రసంగాలు వర్తమాన రచయితలకు కర్తవ్య నిర్దేశం చేశాయి. ఇలాంటి ఉత్సవాలు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో, పట్టణాల్లో జరగవలసిన అవసరం ఎంతోవుంది... సమాజం ఆరోగ్యంగా వుండాలంటే, ఆరోగ్యకరమైన సాహిత్య సృష్టి జరగాలి. అందుకు ప్రభుత్వం, పత్రికలు, ప్రజాహిత సంస్థలు నడుం కట్టాలి. ఈ ప్రయత్నంలో ముందడుగు వేసిన నవమల్లెతీగ పత్రిక, సహకరించిన దాతలు, సాహిత్యాభిమానులందరికీ ధన్యవాదాలు. ఉత్సవాలకు సారధ్యం వహించిన కలిమిశ్రీ బృందానికి అభినందనలు.

'నవమల్లెతీగ' డిసెంబరు 2022 సంచికలో మొత్తం 10 కవితలు ప్రచురితమయ్యాయి. ప్రముఖకవి సరికొండ నరసింహరాజు రాసిన 'ప్రేమ సంజీవని' ధ్వని గర్భితమైన ఉత్తమ కవిత. కవిత మొత్తం చదివాక, చివరి పాదంలో ఆంతర్యం దొరుకుతుంది. మళ్ళీ కవితను చదివితే కవి ఊహల్లోని ప్రేయసి, కవితా ప్రేయసిగా మారుతుంది. కవిత ఎత్తుగడ, ముగింపు బాగున్నాయి. “ప్రేమైక అక్షరాల గడ్డిపూలను కాలితో తొక్కి వెళ్ళిపోయిన ఆమె చివరకు కవి అక్షరాల్లో ఒదిగిపోవడమే” కవిత్వం ప్రారంభంలో కవి ఊహలకు క్రమం ఉండదు. వాటిని మంచి భాషలో క్రమబద్ధీకరించుకోవాలి. గడ్డిపూలే గదా! అని చిన్న చూపు చూడకూడదు. మంచుకురిసే ఆ గడ్డి పూల సొగసు కనువిందు చేస్తుంది. గజిబిజిగా వుండే భావనలు నిగ్గుదేలితే కవిత్వ భాషలో కళకళలాడుతాయి. కవిత్వ రచన ఓ తపస్సు.. ఓ ఆరాధన. మంచి కవిత్వం సంజీవనిలా సమాజానికి కొత్త శక్తినిస్తుంది. “ఆమె వెళ్ళేమార్గంలో దారి దీపమయ్యాను” అంటే చాలు. ఆమెకు అవసరం లేదు. పదాల పునరావృతి వచన కవితను పేలవం చేస్తుంది.

“కన్నతల్లి నేలను” అవసరం లేదు. తల్లినేలను అంటే సూటిగా వుంటుంది. తన కవితా ప్రేయసి “నాలోనే, నాతోనే/ నా హృదయం నా అక్షరాల్లో ఒదిగుంది” అన్న సరికొండ వారి భావం మహాకవి జాషువ గారి ననుసరించిన 'శారద లేచి పోవునే' అన్న భావనతో సరితూగుతుంది మంచి కవిత రాసిన సరికొండకి శుభాభినందనలు.

హరీష్ గొర్లె గారి 'నాన్నకూతురు' కవిత ఫక్తువచనంలో సాగడం వలన అభివ్యక్తి పలచబడి, వస్తువు పేలవమైంది. “నాలోని ఒక కణం ఊపిరి పోసుకుని/ నా కోసం ఒక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించింది” అనే ఎత్తుగడతో ఉదాత్తంగా ప్రారంభమైన కవిత వాక్యాల సాగతీతతో పాఠకుల వస్తు దృష్టిని మరల్చుతుంది. వీలయినంత సంక్షిప్తీకరించి “నన్ను నేను సిద్ధం చేసుకుంటున్నా” వాక్యంతో కవితను ముగిస్తే బాగుండేది. తర్వాత వర్ణన అంతా ముందు రాసిన వాక్యాలకు కొనసాగింపు మాత్రమే.

“వచ్చేది కూతురు కాదు/ నా కంటి పాపల ప్రమిదలో వెలిగే ఆశల కాంతి” అభివ్యక్తీకరణ అద్భుతంగా వుంది. హరీష్‌కు అభినందనలు.

కవిత్వం ఓ జీవనది

“రాగాక్షరాలు” కవితను శరత్‌ప్రమోద్ యల్వీ రాశారు. భావానుగుణమైన భాష, దృశ్యాన్ని కవిత్వీకరించిన విధానం బాగుంది. నిజమే/ ఇవాళ మనుషుల మధ్య మాటలు కరవయ్యాయి. ప్రక్కపక్కనే వున్నా గుండెలు తడవని పొడి మాటలు మనుషుల స్వార్థాన్ని బహిర్గతం చేస్తున్నాయి. వర్షానికి బీడునేల పులకించినట్లే, నిష్కల్మషమైన పలకరింపు స్వచ్ఛమైన చిరునవ్వు ఎన్నో జీవితాల్ని వెలిగిస్తుందన్న సత్యాన్ని చక్కని శీర్షికతో చిక్కని కవిత్వంలో చెప్పిన శరత్ ప్రమోద్ గారికి హార్థికాభినందనలు.

స్వాతిశ్రీపాద రాసిన 'ఉదయం కాసేపు' కవిత ప్రభాత దృశ్యాన్నీ పండించింది. వాక్యాల విరుపులో కవయిత్రి జాగ్రత్త పడితే కవిత మరింత పఠనీయంగా, రమణీయంగా వుండేది.

'నటశేఖరుడే కృష్ణ' చిన్నినారాయణరావు గారు రాసిన స్మృతి కవిత. దివంగతులైన వారి వ్యక్తిత్వాన్ని, జీవితకాలపు కృషినీ, లోకానికి వదిలిపోయిన



ఆశయాల్ని స్మృతి కవిత ప్రతిబింబించింది. కవితను వాచ్యం చేయకూడదు. మొత్తం కవిత చదివాక సదరు వ్యక్తి రూపం మన ముందు సజీవంగా నిల బడాలి. తెలుగులో గొప్ప స్మృతి కవితలు (ఎలిజీలు) ఎన్నో వున్నాయి. నారాయణరావు గారు కొంచెం మనసు పెట్టి రాసివుంటే కృష్ణ అనే రెండక్షరాల్లో అతడు నటశేఖరుడు ఎందుకయ్యాడో చక్కగా తెలిసేది. వెండితెరకు సరికొత్త సాంకేతికతను అద్దిన సాహసవంతుడని, జేమ్స్‌బాండ్, కౌబోయ్ చిత్రాలకు ఆద్యుడని, అల్లూరి సీతారామరాజుగా అజరామర నటనకు భాష్యం చెప్పాడని -ఇలాంటి పాదాలు కృష్ణ పాదముద్రల్ని మనకు గుర్తు చేస్తాయి.

ఆనవాయితీగా ప్రతి సంచికలో ప్రకాశించే విజయ గోలి, విజయలక్ష్మి పండిట్ గార్ల గజల్స్‌తో పాటు అరుణ డేనియల్ గారి కవిత పాఠకులను ఆకట్టుకుంటుంది. విజయ గోలి 'వనమంతా సుమచరుడే కరములతో తిరిగేనులే/ హరుడికన్ను తెరవకుండ ఆపనీయి కలకాలం" మంచి అభివ్యక్తి. కలసిరాని కలిమిలేల బదులు కలిమియేల కలుములేల (సంపదలు) (కలిమి నిత్య బహువచనం) అని రాస్తే దోషరహితంగా వుండేది. విజయలక్ష్మిగారు 'ఎన్ని ప్రేమ కుటుంబ మందిరాలు' బదులు 'ఎన్ని కుటుంబాల ప్రేమ మందిరాలు' అంటే అర్థవంతంగా వుండేది.

భారతీయ కవయిత్రి అఖిలశివ కవితల సమాహారాన్ని 'మంచుసడి' పేరుతో అనువదించారు. స్వేచ్ఛానువాదం చేసినా, మూలానుగుణంగా, అందంగా పఠనీయంగా వుండటం శ్రీనివాస్ గౌడ్ అనువాదంలోని ప్రత్యేకత. చక్కని భావాలను చిక్కని భాషలో అనువదించిన గౌడ్‌కి అభినందనలు.

పద్యమౌళి డా॥ రాధాశ్రీ 'కళాపూర్ణోదయం' ప్రబంధ కావ్యసౌందర్యాన్ని సీసంలో మూసపోసి చక్కగా కావ్యదర్శనం కావించారు. కళాపూర్ణోదయం నిజానికి తెలుగులో కవితా పూర్ణోదయం. రాధాశ్రీగారు పాత్రల ప్రాధాన్యతను వివరించారు. అంతకుమించి రసౌచిత్యం, అద్భుత వర్ణనలు, నాటకీయత సూరనను మహాకవిగా నిలిపాయి. ఇటీవలే కళాపూర్ణోదయాన్ని భాస్కరీయ సరళ వ్యాఖ్యత అజోవిభో కందాళం ఫౌండేషన్ పక్షాన ప్రచురించారు. కావ్య సౌందర్యాన్ని సారాంశాన్ని ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణగారు రసవంతరంగా, వ్యర్థ పదాలులేకుండా అర్థవంతంగా సీసం రాసి తమ కవన పాండితిని నిరూపించుకున్నారు.

నవమల్లెతీగ పాఠకుల కోసం ఆ పద్యం

"సర్వరసోల్బణ సారస్వతవిలాస
కథనకౌశల రీతి కాణయాచి
అర్థగాంభీర్య దివ్య సమాగమా పూర్ణ
శృంగార విషయసుజ్ఞేయరోచి
పాత్రతత్త్వోచిత చిత్రణాతూలిక
వర్ణ నాశ్రీలవైభవ పతాక
భాషోపరీ పాక పదయుక్తి కోశము
బహుశాస్త్రపాండితీ ప్రౌఢపీఠి
తెలుగు సాహితికియ్యదితొలి కమతము
ప్రధితపింగళి సూరనార్య కవిరాజ
హంస కృత "కళా పూర్ణోదయ మహోనీయ
కావ్యము చతుర్ముఖున నర్థభవ్యసృష్టి" !

రాధశ్రీ గారి పద్యంతో పోలిక కోసం అప్పాజోస్యుల వారి పద్యాన్ని ఉదహరించలేదు. పద్య రచనా, సౌందర్యం పాఠకులకు తెలియచేయాలనే సదుద్దేశం మాత్రమే.

కవిమిత్రీగారి సంపాదకీయంలోని సదుద్దేశాన్ని పాఠకులు గుర్తించాలి. సాహిత్యంలో ఒంటెత్తు పోకడలు, ఆధిపత్య ధోరణులు పెరిగాయి. దీనికి అడ్డుకట్ట వేసి, నవ యువకవులకు నూతనోత్తేజం కల్గించాలన్నారు. నిజం చెప్పాలంటే రాజకీయాల్లోనూ, సాహిత్యంలోనూ పలుకుబడి రాజ్యం చేస్తుంది. కథల పోటీల విషయంలో సాగర్‌గారి సూచనలు బాగున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గారి పుట్టిన రోజు కానుకగా వైఎస్‌కి మోహన్‌రావు గారు కవితను బహుకరించారు. ప్రభుత్వం పట్ల వారి పాజిటివ్ దృక్పథాన్ని అభినందిద్దాం! కవి సమాజానికి నిరంతర కాపలాదారుడు.

-డా॥బీరం సుందరరావు, 98480 39080

2022 డిసెంబరు సంచిక ముఖచిత్రం చాలా అందంగా ముస్తాబైంది. ఈ సంచికలో డా॥నందమూరి లక్ష్మీపార్వతిగారి 'ఏదో ఒకనాడు' సీరియల్ 5వ భాగం ఎంతగానో ఆకట్టుకుంది. పాత్రల స్వభావాల్ని ఎంతో ఆసక్తి కలిగించేలా రాస్తున్నారు. నిజంగా మనిషి జీవితంలో తప్పు చేస్తే చివరి మజిలీలో అంతగా నరక యాతన అనుభవిస్తాడా అనిపిస్తుంది. మంచంలో పడుకుని వేదన అనుభవిస్తున్న పాత్రతో కథ మొత్తం చెప్పిస్తున్న తీరు..ఆ పాత్ర గతంలో చేసిన పాపాలు, మోసాలు తలచుకుని కుమిలి పోవడం..ఇవన్నీ సీరియల్‌కి తాత్విక పరిమళాల్ని అద్దుతున్నాయి. రచయిత్రి ఎంత మథనపడితే ఈ పాత్ర సృష్టి చేశారో అనిపిస్తుంది. డా॥లక్ష్మీపార్వతి గారికి కృతజ్ఞతలు.

తపాలా

మరో సీరియల్ 'ప్రేమసౌధం' చక్కని కుటుంబ కథతో సాగుతుంది. 'ఉమ్మడి'లో వున్న అనుబంధాల మకరందాన్ని పాత్రల ద్వారా తెలియ జేస్తున్న రచయిత్రి పుప్పాల సూర్యకుమారి గారికి ధన్యవాదాలు.

శీర్షికల విషయానికొస్తే 'కవిగారి అంతరంగాలు' పి.చంద్రశేఖర్ గారి వ్యాసాలు చాలా బాగుంటున్నాయి. కవుల రచనల గురించి, వారి మనోభావాల గురించి, వాళ్ళలో వుండే పోటీ తత్వం గురించి, వ్యక్తిగత ద్వేషాల గురించి చక్కగా రాస్తున్నారు. అభినందనలు.

-కె.వి.రమణారెడ్డి, మార్కాపురం

డిసెంబరు సంచికలో కలిమిశ్రీ గారు రాసిన సంపాదకీయం ఎంతో ఆకట్టుకుంది. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల గురించి రాసిన రివ్యూ కళ్ళకు కట్టినట్టుంది. 'ఆఖరి ఉత్తరం', 'రూపాయి దేవుడు' కథలు చదివింపజేశాయి. ఆయా రచయితలకు కృతజ్ఞతలు. అవునా? శీర్షిక సెటైరికల్‌గా వున్నా పచ్చి వాస్తవాల్ని తెలియజేస్తుంది. అలాగే 'కిటికీ' శీర్షిక నెలకో అంశంపై లోతైన విషయాల్ని తెలియజేస్తున్నది. కవితలు బాగుంటున్నాయి. ఆ కవితలపై డా॥బీరం సుందరరావుగారు రాస్తున్న విశ్లేషణ అంతకంటే బాగుంటుంది. కార్టూన్లు గొప్ప సందేశాత్మకంగా వుంటున్నాయి. 'మూడు ముక్కలాట' తాజా రాజకీయాల్ని విశ్లేషించింది.

-ఎం.అనూరాధ, హైదరాబాద్

⑧ కవిగారి అంతరంగాలు

కవుల ఆలోచనల్ని, అలవాట్లను, అంతరంగాల్ని జల్లెడ పడుతూ మేకింగ్ ఆఫ్ ఏ రైటర్ రచయిత పి.చంద్రశేఖర్ అజాద్ నవమల్లెతీగ కోసం రాస్తున్న మరో సంచలన శీర్షిక.

(గత సంచిక తరువాయి)

కవులు కవిత్వం రాస్తారు. రచయితలు కథలూ, నవలలు రాస్తారు. నటీనటులు విభిన్న పాత్రల్ని పోషిస్తారు. సంగీతం, నృత్యం ఇలా అనేక కళలకు చెందినవారు తమ వంతు పాత్రను నిర్వహిస్తారు. వీటి నన్నింటినీ విశ్లేషకులు సమీక్ష చేస్తారు. నాకు అప్పుడప్పుడు అని పిస్తుంటుంది- మనం వ్యవసాయదారులతో, కూలిపనుల నుండి శారీరక శ్రమ చేసే వారితో పోల్చుగోగలమా అని.

మన సృజనకారుల్లో అనేక మందికి కవిత్వం రాయటం ప్రవృత్తి మాత్రమే. అందరికీ జీవితం కోసం ఇతర వృత్తులున్నాయి. అరుదుగా మాత్రమే రచనకు, అలాగే కళా ప్రదర్శనకు పూర్తి కాలం అంకితం అయిన వ్యక్తులు కనిపిస్తారు. అలాంటివారికి కూడా వెనకాల అంతకు ముందు వారసత్వంగా వచ్చిన లేదా ప్రస్తుతం కుటుంబంలో ఎవరో ఒకరు పని చేస్తూ ఆర్థికంగా సహకరించటం వుంటుంది. రైతు, కూలీ అలా కాదు. వారి బతుకు చావు కూడా మట్టి, శ్రమలతోనే ముగుస్తుంది. కొంతమంది ధనిక రైతులు మాత్రమే ఇతరేతర వ్యాపారాలు చేయగలుగుతారు. ఇది చెప్పటం నా వరకు నేను రైతులా, శ్రమ జీవిలా కవిత్వాన్ని వృత్తిగా చేసుకుని బతకాలనుకున్న క్షణాల గురించి ఇప్పుడు గుర్తు చేసుకోవటం... అందులో విఫలం అయ్యాను.

కవులేకాదు- సృజనాత్మక కళాకారులందరూ ఈ విషయంలో విఫలం అవుతూనే వున్నారు. సినిమా, మరో కళారూపం ఏదయినా శాశ్వతంగా ఎవరికీ అవకాశాన్ని కల్పించదు. ఏదో ఒకరోజు తెర మీద నుండి నిష్క్రమించాల్సిందే. ఎప్పటికప్పుడు కొత్త నీరు వస్తూనే వుంటుంది. వయసు మీద పడుతూనే వుంటుంది.

నేను కవిత్వం రాస్తాను. ఎప్పటినుంచో రాస్తున్నాను. అది బయటకు వచ్చిన క్షణం నుంచి రకరకాల అభిప్రాయాలు వెల్లువలా వస్తుంటాయి. విమర్శకులు కొత్త వ్యక్తీకరణలనో, అందులోని నిగూఢతనో వెలికి తీయవచ్చు. ప్రశంసలు ఇవ్వవచ్చు. ఇంకో కోణంలో పదం పదాన్ని, వాక్యాల్ని అంతిమంగా వారు అనుకున్న ఆ కవిత తాలుకు ఆత్మని ఖండఖండాలుగా నరికేయవచ్చు. కొన్ని సందర్భాలలో మాత్రం కవులు స్పందిస్తారు. రాసిన ప్రతి కవితనూ భుజాన మోయటం- అందరికీ వివరణలు ఇవ్వటం సాధ్యం కాదు- ఏ కవికైనా!

కవులు ఓ కవిత రాయటం వెనక అనేక రకాల ప్రభావాలు వుంటాయి. మనసులో ఓ బీజం పడాలి. అది రెండు ఆకులు తొడగాలి అక్కడ నుండి మథనం జరగాలి. వాతావరణం సహకరించాలి.

ఇంకెన్నో నిన్నటి, నేటి సంఘటనలు, రేపటి ఊహలు ఆ కవితను రూపొందించే క్రమంలో పని చేస్తాయి. అంతిమంగా తనకు తాను చదువుకున్నాక, మార్పులు చేసుకున్నాక, కనీసం కొంతమందికైనా చదివి వినిపించాక, ఆ కవిత పాఠకుల ముందుకు వస్తుంది. మనం రాసే కవితలన్నీ గొప్పగా వుండవు. వాటి పరిమితులు వాటికుంటాయి.

ఈ ప్రపంచంలో కొన్ని సమస్యలు అన్ని ప్రాంతాల వారికి, అన్ని దేశాల వారికి ఒకే రకంగా వుంటాయి. అందుకే ఒకే సమస్య మీద అనేకమంది కవులు కవిత్వం రాస్తారు. కథలు రాస్తారు. కవులు మిగతా కవుల కంటే భిన్నంగా వుండాలని కోరుకుంటారు. అందుకు నిరంతరం తపిస్తారు. అధ్యయనం చేస్తారు. మనుషుల్ని దగ్గరగా చూడటానికి ప్రయత్నం చేస్తారు. నిన్న-నేడు-రేపు కూడా మనం కవులుగా నిలబడాలంటే వ్యక్తీకరణలో, ముగింపులో, ధ్వనిలో, ప్రారంభంలోనూ కొత్తదనం వుండాలి. వీటి అన్నింటి కంటే ముఖ్యం కవి హృదయం.

కవిత్వాన్ని కవులు వేదికల మీద చదువుతారు. నిజానికి మన చిరునామా మన కవిత్వం, మన ప్రయాణం మన కవిత్వం. కొన్ని దశాబ్దాలుగా మనం కవిగా వుండటం వెనకాల మనలో వచ్చిన మార్పులు, మనలో, మన వ్యక్తీకరణలో వస్తున్న మార్పులు మనకు అర్థంకాక పోయినా ఆ పదాలు చెబుతాయి. మన కవిత అక్షరాల మధ్య నుండి గొంతెత్తుతుంది. కవిత్వం ఇంకొకరి అవసరం లేకుండా నినదిస్తుంది. ఇవన్నీ మనకు తెలుసు. కానీ ఈ కవిత్వపు హోరులో, నిరంతర విశ్లేషణ



జీవన 'మంజూ'ష

నేస్తం,

వేడుక అంటే ఒకప్పుడు సంతోషకర సమయం. మరి ఇప్పుడో..! మన పరపతి, పలుకుబడి, సంపదలను చూపే అవకాశం. వేసుకునే దుస్తులకు, అలంకరణలకు, దర్పం, డాబు ప్రదర్శించడానికి మాత్రమే సంతోషాన్ని ఖర్చు చేసుకోవడం ఇప్పటి సంప్రదాయంగా మారిపోయింది. పెళ్లిళ్లు, పేరంటాలంటే ఇదంతా సహజమేనని తీసుకోవచ్చు ఇప్పటి పరిస్థితిని బట్టి.

సాహిత్య సంబరాలు ఈ కోవలోనే సాగడమన్నది బాధాకరం. వేదికలెక్కడం, ఉపన్యాసాలివ్వడం అందరికి రాని విద్యేనని మనమూ ఒప్పుకుంటాం, కాని వేదికనెక్కిన వక్తలకు మాట్లాడాల్సిన విషయం ఏమిటన్నది తెలిసి కూడా తమ స్వోత్కర్ష వెళ్లబోసుకోవడం, తమకు భజన చేసేవారి రచనలను పదే పదే పొగడటం, అదే కాకుండా ఇచ్చిన సమయాన్ని మించి అనవసర విషయాలు మాట్లాడటమన్నది శ్రోతల ఓరిమికి పరీక్షే.

పురస్కారాలు, బిరుదులు వచ్చిన రచనలు, ఆ రచయితలు మాత్రమే సమాజానికి ఆచరణీయం, ఆదర్శవంతులు కారు. బాధల నుండో, కష్టాల నుండో వచ్చిన రచనలు మాత్రమే గొప్ప రచనలని ఎలా చెప్పగలరు? రచన మాండలీకంలో రాసినంత మాత్రాన అది పురస్కారాలకు అర్హత సంపాదించుకుంటుందా! సరే అలాంటి రచనలకు పురస్కారం అందించి రచనలను ప్రోత్సహించడం మంచిదే. అంత మాత్రాన అందరిని ఆ పురస్కార రచనలను, రచయితలను అనుసరించమనడం సబబు కాదు.

అక్షరానికి కులమతాలు, జాతీయత, ప్రాంతీయత వగైరాలు తెలియవు. నువ్వు బాధను పంచావా, సంతోషాన్ని పంచుకున్నావా అని కూడా తెలియదు. కొన్ని రచనలు కష్టాల కాష్ఠం నుండి వెలుగు చూస్తే, మరి కొన్ని మనసు విరజిమ్మిన పారిజాతాల వలె భావాలను వెదజల్లుతాయి. అలా అని మనం కన్నీటి నుండి వచ్చినవి మాత్రమే అమోఘమైన రచనలని ఎలా చెప్పగలం. జనరంజకమైన రచనలు సజీవంగా మిగిలిపోతాయి తరాలు గడిచినా.

విషయ పరిజ్ఞానం ఈ ప్రపంచంలో మనకు మాత్రమే ఉందని, మిగతా వారంతా మూర్ఖులని అనుకోవడంలో మనం మాత్రమే సంతోషపడగలం. విమర్శ సహేతుకంగా ఉండాలి కాని మనల్ని మనం కుదించుకునేలా ఉండకూడదు. ఈ కువిమర్శల వలన మనకు ఒరిగేదేమి వుండదు. ఆ విషయం మనకూ తెలుసు. అయినా అలా విమర్శించడంలో మనకో తుత్తి. ప్రపంచాన్ని జ్ఞానవంతం చేయాలన్న ఆలోచన మంచిదే. కాకపోతే మనకున్న అర్హత మేరకు మనముంటే మనకు, మిగతా ఆ నలుగురికి మంచిది. ఎవరి విజ్ఞానం ఏమిటన్నది ఈరోజు కాకపోయినా రేపయినా అందరికి తెలుస్తుంది. అందుకని ముందు మన జ్ఞానానికి మనం మెరుగులు దిద్దుకుందాం. ఇది ఆరోగ్యకరం కూడానూ!!

-మంజు, 94907 69585

లతో, విమర్శలతో, అనేక రకాల సంబంధాల మధ్య ఇరుక్కుని వుండటంతో పట్టించుకోం. కొన్నింటిని బలవంతంగా మనం చూడ నిరాకరిస్తాం. మన మనసు నుండి నెట్టివేస్తాం.

కవుల్లో ఇంకో బలహీనత కూడా వుంది. మనం ఎలాంటి కవిత్వం రాస్తే అచ్చవుతుందో, అలాంటి కవిత్వం రాస్తాం. ఏ కవికో పేరు వస్తుంది. అనుకరించాలనుకుంటాం. మనల్ని కాలం చెల్లిన కవులు అంటారు. ఆధునిక కవులు మేం కాలానికంటే ముందున్నాం అని చెప్పటానికి కొత్త వ్యక్తీకరణలను ముందుకు తీసుకొస్తారు. మనకు అనివార్యంగా అభిమాన కవులు తయారవుతారు. వారికి మరికొందరు. ఇక్కడ కలయికలు, విడిపోవటాలు, మనసులో ఓ అభిప్రాయం, వేదికల మీద, ముందుమాటల్లో ఇంకోటి వుంటాయి. ఎవరినీ బాధపెట్టకూడదు



అని ఏ కవైనా అనుకుంటే ఆ బాధంతా కవి స్వయంగా అనుభవించాలి. అందుకే చాలా మంది ప్రముఖ కవులు ఆప్తవాక్యమో, ముందు మాటల్నో రాయటానికి అంగీకరించరు.

రైతులు, శ్రామికుల మధ్య ఇలాంటి ఊగిసలాటలు వుండవు. వారికేం కావాలో స్పష్టంగా తెలుసు. తమకు నష్టాన్ని కలిగించే వాటిని, వ్యక్తుల్ని భరించలేరు. ఇంకో మార్గం చూసుకుంటారు. నిజానికి ఈ రెండు రకాల వారినే అందరూ పీడిస్తుంటారు. లాభాలన్నీ చిన్న రైతుల నుండి, కూలీల నుండే వస్తాయి.

మన కవిత్వం గురించి ఎవరు ఏం అనుకున్నా అది ఎందుకు రాసామో కవికే తెలుస్తుంది. అయినా మనం మాట్లాడం. ఆఖరి ప్రకటన ఎప్పుడో వస్తుంది. అసలు మన ప్రయాణం గురించి, దాని ఫలితం గురించి ముందే తెలిసి సంచలనాలు సృష్టించే వారున్నారు. వారి గురించి మాట్లాడుకుందాం.

వచ్చే సంచికలో కలుద్దాం...

కథ

చిన్ని నారాయణరావు ఫౌండేషన్-మల్లెతీగ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

చెరపకే చెడేవు

పి.రాధామహేశ్వరి

"భవానీ శంకర్ మావయ్యా! అమ్మా నువ్వు ఎక్కడున్నారు? ఇక్కడ ఘోరం జరిగిపోయింది" ఫోనులో ఈశ్వర్ మాట విన పడగానే భవానీ శంకర్ బొటనవ్రేలు సెల్ రెడ్ బటన్ మీద పడింది. అది భయం వల్లో, టెన్షన్ వల్లో, బాధ వల్లో అతనికే తెలియకుండా ఆ రెడ్ బటన్ మీద పెట్టినవ్రేలు స్విచ్ ఆఫ్ అయ్యేవరకు తీయ లేకపోయాడు. మైండ్ మొద్దుబారి పోయింది.

ఈశ్వర్ ఘోరం జరిగిపోయింది అన్నాడు. అంటే అక్క అను కున్నది సాధించింది. గ్యాస్ లీక్ చేసి కోడల్ని చంపాలనుకున్న పథకం అమలు జరిగిపోయింది. అంటే కోడలు గాయత్రి ప్రమాదవశాత్తు అత్తగారి చేతిలో, అత్తగారు దరిదాపుల్లో లేకుండా హత్య చెయ్య బడింది. అక్క దుర్గాంబ. ఆ పేరే ఎదుటి వారిని బెదిరిస్తుంది, భయ పెడుతుంది, శాసిస్తుంది. వీటిన్నింటికి నిలువెత్తు నిదర్శనం తన అక్క. ఆమెకు ఇద్దరు పిల్లలు.

ఈశ్వర్ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఏ విషయంలోను అమ్మ మాట కాదనని ఈశ్వర్, తన కొలీగ్‌నే ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. పెండ్లి తనకిష్టం లేదు అనే విషయాన్ని ఎవరికి తెలియనివ్వలేదు దుర్గాంబ.. చివరకు ఈశ్వర్‌కి కూడా. ఒక మంచి కొడుకు, మంచి భర్త ఎలా ఉండాలంటే ఈశ్వర్‌ని చూయించి ఇలా ఉండాలని ఒక్క మాటలో ఈశ్వర్ గురించి చెప్పొచ్చు. కూతురు నందిని మంచి అమ్మాయి, డిగ్రీ చదివింది. ఈ మధ్యనే ప్రక్కవీధిలోని

చెరపకే చెడేవు

ప్రశాంత్‌కిచ్చి వివాహం చేశారు. అన్న, వదిన, భర్త ఉద్యోగస్తులు కావడంతో తరుచుగా అమ్మ దగ్గరకు వచ్చి టైంపాస్ చేస్తుంది.

“ఏరా ఫోన్ ఎవరు చేశారు? అలా విగ్రహంలా నిలబడి ఆలోచిస్తున్నావేంటి?” టెన్షన్‌గా అడిగింది దుర్గాంబ.

“ఈశ్వర్ చేశాడు. నువ్వనుకున్నట్లే జరిగింది” నిదానంగా కదలిక లేనట్లు చెప్పాడు శంకర్.

“హమ్మయ్య.. దాని పీడ నాకు వదిలింది చాలా సంతోషంగా వుంది. ఇప్పుడు ఈ సంతోషంతో ఇంటికి వెళ్ళలేను. మనం ముందుగా అనుకున్నట్లుగానే నువ్వు ఒక ఆటోని తీసుకునిరా! ఇక్కడి నుండి మార్కెట్‌కి వెళ్ళి, అక్కడొక రెండు గంటలు టైం పాస్ చేసి అప్పుడు ఇంటికి బయలుదేరుదాం. ఇప్పుడు ఆ చచ్చినదాని దగ్గరకు వెళ్ళి ఏడ్చు నటిస్తూ కూర్చోలేను”.

భవానీశంకర్‌కి గాయత్రి మొహమే మనస్సులో మెదులుతుంది. అక్క అహంకారానికి, అత్యాశకి, తెలివి తేటలకి బలైపోయిన మంచి అమ్మాయి. అందరినీ నవ్వుతూ పలుకరిస్తూ, ఓపిగ్గా ఇంటికి వచ్చిన అందరినీ ఆదరించే ముచ్చటైన మొహం. తరుచుగా వెళ్తున్నా కూడా తనని బాబాయి గారూ అంటూ ఎంతో ఆదరంగా చూస్తుంది. మర్యాదకు లోటు చేయదు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాని తన జీవితం, సంతోషం అంతా అక్క భిక్షే. చిన్నప్పుడే అమ్మా నాన్న చనిపోతే తనని పెద్ద కొడుకులా పెంచి, పెళ్ళి చేసి జీవితాన్ని ఇచ్చింది. తన వరకు అక్కే దైవం, అక్క ఏది చెప్పినా సరే తను చేస్తాడు. సాక్ష్యం కోసంగా పేరున్న ఒక నగలషాపులో జతగాజులు కొని ఆటోలో శంకర్, దుర్గాంబ మార్కెట్ చేరుకున్నారు. మార్కెట్‌లో ఒక సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

“అక్కా! ఈశ్వర్ ఫోను చేసి రెండు గంటలైంది. మనం బయలుదేరుదామా?” మెల్లగా అన్నాడు శంకర్.

“సరే ఆటో పిలువు. నీకు ముందే చెబుతున్నా, ఇంటి దగ్గర నేను గేటు వరకు వస్తాను. అందర్నీ నువ్వు ఎట్లా మేనేజ్ చేస్తావో నీ ఇష్టం. మళ్ళీ అదే ఆటోలో నేను హాస్పిటల్‌కి వెళ్ళాలి జాగ్రత్త. ఇప్పటి వరకు చేసింది వేరు, ఇప్పుడు చెయ్యబోయేది వేరు. రెండు రోజులు ఇది ప్రమాదవశాత్తు జరిగిందని అందరూ అనుకున్నారంటే ఇంక తర్వాత కూడా అదే ప్రచారం జరుగుతుంది. మనకింక భయం లేదు. రెండు రోజులు కొంచెం కాదు చాలా జాగ్రత్తగా యాక్షన్ చేయాలి. ఎవ్వరికి అనుమానం లేకుండా సహజంగా నటించాలి. ఆ దరిద్రపుదాని వల్ల ఇప్పటివరకు పిచ్చివాళ్ళలా తిరిగాము. త్వరగా హాస్పిటల్‌కు వెళ్ళి కాస్త తిండి తిని ప్రశాంతంగా నిద్రపోవాలి. ఈ రోజుతో నా శని దోషం వదిలిపోతుంది” అంది దుర్గాంబ.

శంకర్‌కి మాత్రం చాలా భయంగా ఉంది. మన ఇంట్లో మనిషిని చంపి అక్క ఇంత ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతోంది. తనకు గుండె ఆగేలా ఉంది కాని ఆ విషయం అక్కకు చెబితే తనను అక్కడే తూములో తొక్కేస్తుంది. అందుకే కన్నీటిని కంటి చివరివరకు కూడా రానివ్వకుండా నొక్కిపట్టి ఆటో పిలుచుకొచ్చాడు. ఆటో ఎక్కగానే అక్క తర్వాత పనులు, ప్రణాళికలు చెప్పవలిసిన డైలాగులు, భయపెడుతూ, బెదిరిస్తూ చెప్తుంటే శ్రద్ధగా విన్నాడు శంకర్. ఆటో ఇంటి గేటు ముందుకు వచ్చి ఆగింది. సమయం రాత్రి ఏడున్నర అయ్యింది. శంకర్‌కి శరీరమంతా చల్లబడిపోయినట్లుగా ఉంది. ఆటోరాడ్ మీద గట్టిగా చెయ్యివేసి దిగేముందు అక్క మొహంలోకి చూశాడు. శ్రీకృష్ణుడి నోటిలో లోకాలన్నీ తను చూడలేదు గాని అక్క మొహంలో మాత్రం జాగ్రత్తలు, బెదిరింపులు, శాసనాలు కన్పించాయి. ఆటోకి దగ్గరగా ఎవరో వస్తున్నట్లుగా చప్పుడైంది. శంకర్‌కి ఎవరో ఊపిరి బిగబట్టేసినంత టెన్షన్‌గా ఉంది. దుర్గాంబ కూడా ఆ చప్పుడు విన్నదేమో ఆమె మొహంలోకి ఒక్కసారిగా బాధ, కళ్ళలోకి దీనత్వం క్షణంలో వచ్చి చేరాయి. శంకర్ తనూ అక్క స్థాయికి నటించగలనా అనుకుంటూ ఆటోలోంచి నిదానంగా దిగాడు. ఎదురుగా ఈశ్వర్. అంత తక్కువ టైంలోనే ఈశ్వర్ ఎంత దీనంగా తయారయ్యాడో జుట్టంతా రేగి, బట్టలు నలిగిపోయి, మొహం మీద, బట్టల మీద కాలిన శరీరం తాలూకూ ఆనవాళ్ళతో భుజాలు కుంగి, శరీరం వంగి పోయి అంతకు మించిన దుఃఖం లేదనే బాధతో శంకర్ దగ్గరకు వస్తూనే గట్టిగా శంకర్‌ని వాటేసుకుని బిగ్గరగా ఏడుస్తున్నాడు. శంకర్‌కి కూడా ఇప్పటి వరకు అదిమి పెట్టిన కన్నీరు బయటకు తన్నుకు వస్తుంది. ఎలా ఏడ్చినా అక్క నటనే అనుకుంటుందిలే అని తన బాధను కన్నీటి రూపంలో బయట పెట్టాడు. రెండు నిమిషాల తర్వాత తేరుకుని ‘అమ్మ ఎలా ఉంది? అమ్మ మొహం చూసే ధైర్యం నాకు లేదు. నేను తనను రక్షించలేక పోయాను మావయ్యా’ అంటూ శంకర్ చేతులు పట్టుకొని ఏడుస్తున్నాడు ఈశ్వర్.

మీ అమ్మ ఆటోలో ఉందిరా! అస్సలు ఆటో ఇంటికి వచ్చిన సంగతి కూడా గ్రహించే స్థితిలో లేదు. వినగానే షాకయ్యి రోడ్డు మీద కూర్చుండిపోయింది. అతి కష్టం మీద ఇప్పటికి తీసుకురాగలిగాను. తను దిగే పరిస్థితిలో లేదు.

‘నేను దించుతాను ఉండు’ అంటూ అక్క చెయ్యి పట్టుకుని ఆటోలోని దుర్గాంబను దించాడు శంకర్. దిగుతూనే



ఒక్క క్షణం కొడుకును చూసింది. ఆ క్షణం లోనే ఈశ్వర్ ఎంత బాధపడుతున్నాడో తనకు తెలిసిపోయింది. అబ్బ పెళ్ళాం చస్తే ఎంత బాధ పడిపోతున్నాడో రోడ్డు మీదని కూడా ఆలోచించకుండా ఏడుస్తున్నాడు. చచ్చినదాన్ని తలుచుకుంటే తనకు ఏడుపు కాదు ఆనందం తన్నుకు వస్తుంది. వాడు తన దుఃఖం కన్పించకుండా తలదించుకున్నాడు. తను కూడా తన ఆనందం కన్పించకుండా నేల చూపులు చూస్తూ ఆటోలోంచి తమ్ముడి సాయంతో గేటు వైపుకు అడుగులు వేసింది. చేతికి అందే దూరంలో గేటు ఉంది. గేటు గ్రిల్స్‌లోంచి ఇంటి ముందు వాతావరణం కొద్దిగా బయటకు కన్పిస్తోంది. షామియానా వేసి ఉంది ఎక్కడ పడుకోబెట్టారో కన్పించ ట్లేదు కాని చుట్టాలు కూడా కొంతమంది వచ్చి నట్లున్నారు. ఇద్దరు, ముగ్గురు గేటుకేసి చూస్తు న్నారు. కాని గేటు ఇంటికి కాస్త దూరంగా వుండటంతో తను వాళ్ళకు స్పష్టంగా కన్పిం చదు. గేటు మీద చెయ్యి వెయ్యబోతూ అమ్మా అంటూ రెండు చేతులు గుండె మీద వేసి, కళ్ళు మూసుకుని క్రిందకు పడబోయినట్టుగా బాధగా మూలిగింది దుర్గాంబ.

అమ్మా అంటూ ఈశ్వర్, అక్కా అంటూ శంకర్ చెరొక వైపున వచ్చి వెంటనే పట్టు కున్నారు. కాని క్రిందకు జారిపోతుంది దుర్గాంబ.

"సరే ఈశ్వర్! అమ్మకు అస్సలు బాగో లేదు, బి.పి బాగా పెరిగినట్లుంది. గుండె నొప్పి వచ్చినట్లుంది. నేను అమ్మను హాస్పిటల్‌కు తీసుకువెళతాను, నువ్వేమి కంగారుపడకు. నువ్వు ఇక్కడే ఉండి చూసుకో, అమ్మకు తోడుగా నేనుంటానులే. అవసరమైతే ఫోను చేస్తాను" అని నిదానంగా దుర్గాంబను ఆటోలో కూర్చోబెట్టాడు.

ఈశ్వర్! నువ్వు ధైర్యంగా ఉండు, ప్రాణం పోయిన తర్వాత మనం ఏమి చెయ్యి లేము కదా! ఏదీ మన చేతిలో ఉండదు. నిన్ను చూస్తుంటే నాకు చాలా బాధగా ఉందిరా ఈశ్వర్. నువ్వు అన్యాయం అయ్యిపోయా వురా బాధను దిగమింగుకో, నందినీ! అని ఇంకా ఏదో చెప్పబోతుంటే రమ్మన్నట్టుగా ఆటోలోంచి మూలిగింది దుర్గాంబ. ఇంకా మాట మధ్యలో ఆపేసి డాక్టరుతో మాట్లాడాక

ఫోను చేస్తాను అని ఈశ్వర్ రెండు చేతులు తన చేతుల్లోకి తీసుకొని నొక్కి జాలిగా వది లేశాడు శంకర్.

'ఇటు అమ్మ, అటు తను నేనేం చేయను మావయ్యా!' అంటూ మళ్ళీ ఏడ్చాడు ఈశ్వర్. అమ్మ గురించి నువ్వేం బాధ పడకు, అమ్మ బాధ్యత పూర్తిగా నాది. అమ్మకు ఏంకాదు దుఃఖం గుండెకు తన్ని అలా అయ్యింది. వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను, అవును మీ అత్తగారు, మావగారు వచ్చారా?'

'వచ్చారు...నీకు తోడు ఎవరినైనా పంపించ మంటావా మావయ్యా!'

'వద్దురా నేను చూసుకుంటాను' వెంటనే ఆటో ఎక్కి కూర్చున్నాడు శంకర్.

తల్లి ఆరోగ్యం గురించిన బాధ కూడా తోడవ్వడంతో ఈశ్వర్ కళ్ళు రెండు కన్నీటితో నిండి పోవడంతో తడుముకుంటూ గేటు తీసు కుని లోపలికి వెళ్ళాడు. తను విషయం పూర్తిగా ఫోనులో చెప్పలేదు కదా! మరి వీళ్ళకు ఎలా తెలిసింది అనే అనుమానం ఆ బాధలో ఈశ్వ ర్‌కి రాలేదు. ఒక వేళ వస్తే (ఈశ్వర్‌కే కాదు, దుర్గాంబ కోరుకున్నట్లు ఎవ్వరికి అనుమానం రాలేదు ఎందుకో మరి) ఆటో స్టార్టయ్యింది.

"విజయ హాస్పిటల్‌కి పోనివ్వు" చెప్పాడు డ్రైవర్‌కి శంకర్.

'అక్కడి డాక్టర్ నాకు బాగా తెలుసు. పేరు చక్రవర్తి. అతనితో మాట్లాడదాం' అంది దుర్గాంబ.

'అదేంటిరా మనం ఈశ్వర్‌ని నందిని గురించి అడగలేదు'.

'అదే నేను అడగబోతుంటే నువ్వు పిలి చావు, సరే హాస్పిటల్‌కి వెళ్ళాక ఫోన్ చేద్దాంలే అన్నాడు శంకర్.

'ఏమో అది ఉత్త పిచ్చిది (ఇది చచ్చి నా కూతురుని ఎంత బాధ పెడుతుందో) అస్సలే వదినంటే నందినికి చాలా ఇష్టం. ఎంత ఏడు స్తుందో' అంటూ వెనక్కి వాలి కళ్ళు మూసు కుంది (శంకర్ కూడా ఏం మాట్లాడకుండా ఆలోచిస్తున్నాడు. హఠాత్తుగా దుర్గాంబ కళ్ళు తెరిచి నంబర్ చెబుతాను డాక్టర్‌కి ఫోన్ చేసి నాకివ్వు మాట్లాడతాను అంది.

అప్పుడు జేబులోంచి ఫోన్ తీశాడు శంకర్. తన ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉంది. అదేమిటా అని ఆలోచిస్తూ నంబర్ చేసి అక్కకిస్తే రెండు నిమిషాలు మాట్లాడి పెట్టేసింది దుర్గాంబ.

ఇంక మన హాస్పిటల్‌లో కావలసిన విధంగా ఉండొచ్చు. హాస్పిటల్ ముందాగింది ఆటో. ఇద్దరూ దిగారు. శంకర్ రిసెప్షన్ లోకి వెళ్ళి డాక్టర్ చక్రవర్తికి ఫోన్ చేశాడు. పది నిమి షాల్లో ఆయన వచ్చి 'వీళ్ళని ఒక స్పెషల్ రూమ్ లోకి తీసుకు వెళ్ళి మీరు రెస్ట్ తీసుకోండి. నేను అటెండర్‌ను పంపిస్తా, తినడానికి మీకేం కావాలో చెప్పండి వెంటనే తెస్తాడు. నాకు అర్జెంట్ కేస్ ఉంది మళ్ళీ వస్తాను' అని వెళ్ళి పోయాడు.

టిఫిన్ తీసుకుని అటెండర్ వచ్చాడు. అస్సలే టెన్షన్‌తో ఏం తినలేదేమో గబగబా తినేసింది దుర్గాంబ. శంకర్ ఏమి తినలేక పోయాడు. బెడ్ మీద పడుకొని దుప్పటి కప్పేసి ఆలోచిస్తోంది దుర్గాంబ. శంకర్ ఆమె బెడ్ ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. నందినికి ఫోన్ చేద్దాం అస్సలు అక్కడి విష

యాలు ఏమి తెలియదు కదా అని నందిని నంబర్‌కి రింగ్ చేశాడు. కాని నందిని ఎంత సేపటికి లిఫ్ట్ చేయలేదు. సరే ఎక్కడుందోలే అనుకుని ఫోన్ ఆఫ్ చేశాడు శంకర్.

కళ్ళుమూసుకుంది దుర్గాంబ. కాని నిద్ర రావటం లేదు. రెండు, మూడు నెలలు ఊరు కుని తర్వాత ఈశ్వర్‌కి పెళ్ళి ప్రయత్నాలు చెయ్యాలి. ఈశ్వర్‌ని చూస్తే ఎలాంటి అమ్మాయి అయినా మనస్సు పారేసుకుంటుంది. అంత చక్కని రూపు, మనస్సు ఉన్న వాడు ఈశ్వర్. వాటికి తోడు తన తెలివితేటలు ఉపయోగించిందంటే ఎంతటి సంబంధ మైనా తన కాళ్ళ దగ్గరకు రావలిసిందే. తను రేపుదయం దాని శవం బయటకు వెళ్ళేవరకు వెళ్ళకూడదు. అలా ఆలోచిస్తూ నిద్రపోయింది.

రాత్రంతా చిందర వందర కలలు. అందరు కోటీశ్వరులు మా కూతురంటే మా కూతురని తనని బ్రతిమిలాడుతున్నారు. తను వారిని పరీక్షిస్తోంది. చివరగా నిలబడిన ఒకమ్మాయి మాత్రం గట్టిగా నవ్వుతోంది. ఎవరా అమ్మాయి అని చూసింది దుర్గాంబ. ఆమె గాయత్రి. వెంటనే మెలకువ వచ్చేసింది. ఇది నా కలలోకి వస్తే ఏడ్వాల్సిందే. అది నా కొడుకుని నా నుండి లాక్కుంది. అందుకే దాని జీవితాన్నే తను లాక్కుని తగిన శిక్ష వేసింది. ఆలోచిస్తూ టైం చూసింది. ఏడు గంటలు అయ్యింది దుర్గాంబ, శంకర్ స్నానాలు చేసి టిఫిన్ తిన్నారు.

'అక్కా! నేను ఈశ్వర్‌కి ఫోన్ చేశాను. శవాన్ని పదిగంటలకు తీసుకు వెళ్తున్నారట. నువ్వింకా స్పృహలోకి రాలేదని చెప్పాను. వాళ్ళు తీసుకెళ్ళిపోతాం అన్నారు... సరే అన్నాను'.

'ఐతే మనం కరెక్టుగా పదిగంటలకే బయలుదేరుదాం. అది బయటికి, నేను లోపలికి' గట్టిగా నవ్వింది దుర్గాంబ.

కరెక్టుగా పదిగంటలకు దుర్గాంబ, ఈశ్వర్ ఆటో ఎక్కారు. అర్థగంటలో ఆటో ఇంటి ముందు ఆగింది. శంకర్, దుర్గాంబ చెయ్యి పట్టుకుని క్రిందకు దించాడు. చాలామంది గేటు బయటే ఉన్నారు.

'అయ్యో ఇప్పుడే మీరు లేకుండా అమ్మాయిని సాగనంపాం వదినగారూ!' అంటూ ఏడుస్తూ వచ్చి దుర్గాంబ చెయ్యిపట్టుకుంది నందిని అత్తగారు.

'దేనికైనా ప్రాప్తం ఉండాలి' అంది ఒక ముసలావిడ.

తొక్కలో ప్రాప్తం, ఏదైనా నేననుకున్నదే జరగాలి..జరుగుతుంది. లేకపోతే ఈ దుర్గాంబ అంటే ఏమనుకుంటుంది. నా ఇష్టం లేకుండా నా కొడుకు జీవితంలోకి వచ్చి జీవించగలదా అనుకుంటూ శంకర్ ఎవరితోనో మాట్లాడుతుంటే తనే గేటు తీసుకుని లోపలికి నడిచింది దుర్గాంబ. ఆలోచిస్తూ ప్రక్కవారి మాటలు వినకుండా, వింటున్నట్లు నటిస్తూ పోర్టికో దగ్గరకు వెళ్ళిపోయింది. చెప్పులు విడిచి పోర్టికోలో కాలు పెట్టింది. ఎదురుగా పెద్ద ఫోటో, ఫోటోకి దండ, ముందర దీపం, చక్కటి పట్టు చీర, పెద్ద కుంకుమబొట్టు, తల నిండా పూలు, పెదవుల మీద కల్మషం లేని చిరునవ్వు... ఇవన్నీ ఉన్న ఫోటోలో ఉంది గాయత్రి కాదు, నందిని.. కళ్ళు తెరిచే ఉన్నాయ్ కాని చుట్టూ చీకటై పోయింది. చెవులు తెరిచే ఉన్నాయ్, కాని అణుబాంబు పేలిన శబ్దం కూడా విన బడేస్థితిలో లేదు. గుండె కొట్టుకుంటుంది కాని ప్రాణం ఉన్నట్టుగా లేదు దుర్గాంబకు. ఈసారి నిజంగానే పడిపోబోయింది. ఇంతలోకి లోపలి నుండి పరిగెడుతున్నంత వేగంగా వచ్చిపట్టుకుంది గాయత్రి.

'నేనే పాపిష్టి దాన్ని అత్తయ్యా! మీరు ఈ రోజు షాపింగుకు వెళ్తున్నాము. పర్మిషన్ తీసుకుని ఆఫీసు నుండి మధ్యాహ్నమే వచ్చి వంట చెయ్యమన్నారు. ఈ రోజు ఆఫీసులో మీటింగ్ ఉండటం వల్ల మీ అబ్బాయి నందినికి ఫోన్ చేసి వంట చెయ్యమన్నారు. నందిని వచ్చి స్టవ్ వెలిగించేసరికి సిలిండర్‌లో గ్యాస్ లీకవుతుందేమో పేలిపోయిందట మన ప్రక్కనవారు ఈశ్వర్‌కి ఫోన్ చేస్తే ఇద్దరం పరిగెట్టుకుంటూ వచ్చాం. అప్పటికే నందిని ప్రాణం పోయింది. అయ్యో నేనొచ్చినా బావుండేది బంగారు తల్లిని పోగొట్టుకున్నాం అత్తయ్యగారు అంటూ దుర్గాంబను పట్టుకుని ఏడుస్తుంది గాయత్రి.

'అయ్యో ఆవిడకు అస్సలు బాగోలేదు లోపలికి మంచం మీదకు తీసుకుపదండి' అంది గాయత్రి తల్లి. లోపలికి తీసుకువెళ్ళి పడుకోబెట్టి బయటకు వచ్చారు కొందరు.

'అయ్యో ఆవిడకు చెమటలు పడుతున్నాయి. ఏసీ వేసుందో, లేదో చూడ కుండా వచ్చేశారేమిటి' అంటూ గాయత్రి గబగబా వెళ్ళి ఏసీ వేసి బయటకు వచ్చింది. ప్రాణం ఉందో లేదో చూడకుండా. ★

చంద్రబాబు సార్‌కు ప్రత్యర్థిగా పోటీ చేసే ఉద్దేశమే లేదు

'చంద్రబాబు సార్‌కు ప్రత్యర్థిగా పోటీ చేసే ఉద్దేశమే లేదు. అవన్నీ పుకార్లే. అయితే నేను రాజకీయాల్లోకి రావడం ఖాయం. నా రాజకీయ ప్రవేశం ఎప్పుడన్నది ఇప్పుడే చెప్పలేను. సమాజ సేవ చేసేందుకే రాజకీయాల్లోకి అడుగుపెడతా' ఇవి స్వయంగా ప్రముఖ హీరో విశాల్ చెప్పిన మాటలు. ఈ మాటలు చెప్పడానికి కారణం కూడా లేకపోలేదు. కుప్పంలో చంద్రబాబుకు ప్రత్యర్థిగా విశాల్ పోటీ చేస్తున్నాడు. చంద్రబాబును అసెంబ్లీలోకి అడుగుపెట్టకుండా చేసేందుకు వైసీపీనే ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విశాల్‌ను కుప్పం అభ్యర్థిగా ఎంపిక చేసింది పార్టీ అంటూ జరిగిన ప్రచారానికి సమాధానంగా విశాల్ పై విధంగా స్పందించారు.

నేను గాంధీ.. నాలో అంబేద్కర్

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గాంధీ యాత్ర చేస్తున్న 'గాంధీ దేశం సోషల్ వెల్‌ఫేర్ ట్రస్టు' వ్యవస్థాపకులు

ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్

అంతరంగం 5



మహాత్ముని అహింసా యాత్రలో స్త్రీలు చేసిన త్యాగాలను మనం గుర్తించాలి. వారు గర్వించేలా వారి జీవితాలలో అపురూపమైన మార్పుకోసం ఆనాడు మహాత్మాగాంధీ కన్న కలలు నిజం చేసేందుకు, స్త్రీ స్వాతంత్ర్యం పొందుటకు మనం చేసే అతిపెద్ద ప్రయత్నమే ఈ 'గాంధీయాత్ర' ప్రధమ కర్తవ్యం.

అహింసా పాలన.. ఇది ఆడ.పడుచులకే సాధ్యం. 75 సంవత్సరాల పురుషుల పాలనలో మనం చూసిందేమిటి? మధ్యపానం, గంజాయి, గుట్కాలు సిగరెట్లు, ఖైనీల వంటి మత్తు పదార్థాల విచ్చలవిడితనం. రౌడియిజం, ఫ్యాక్షనిజం, కిడ్నాపులు, దోపిడిలు, దొంగతనాలు, మానభంగాలు, ఆడపిల్లలపై అత్యాచారాలు.. ఇలాంటి వికృతాల నుండి విముక్తి పొందటమే అహింస పాలన యొక్క ముఖ్య ఉద్దేశం.

మన ప్రియతమ నాయకుడు అంబేద్కర్ - హిందు కోడ్ బిల్లులోని ఒక ముఖ్య అంశం ఏమిటంటే-పురుషుడితో సమానంగా స్త్రీలు హక్కులను పొందాలి. మరి 75 సం॥ల పురుషుల పరిపాలనలో ఇంతవరకు ఆయన కలల్ని నిజంచేసే గొప్ప రాజకీయ నేతగా ముందడుగు వేసిన నాయకుడు ఎవరు? భారతదేశ రాజ్యాంగ పరంగా స్త్రీలకు, వారి జీవితాలకు స్వేచ్ఛా భావాలను, సమాన హక్కులను పొందుటకు పోరాడిన నాయకుడు ఎవరు? ఎవరూ ఏం చేయలేదని మనం బాధపడుతుంటామో, అది మన మెందుకు చేయకూడదనే ఉద్వేశంతోనే నా ఈ ప్రయత్నం. గాంధీదీక్షతో చేసే ఈ గాంధీ యాత్ర నేను చేయబోవు దండియాత్ర -2.

ఈ యాత్రను వివిధ రూపాల్లో ప్రజలతో మమేకమై చేస్తున్నానని సగర్వంగా చెప్పుకుంటున్నాను. దేశ గౌరవాన్ని కాపాడటంలో నా పాత్ర కీలకం కావాలని ఆశిస్తున్నాను. స్త్రీ రక్షణ లేని స్వాతంత్ర్యం స్వాతంత్ర్యం కానే కాదు. స్త్రీ రక్షణే స్వాతంత్ర్య లక్ష్యం. అందుకే స్త్రీలకు పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు పాస్ చేయాలని ఎంతో కాలంగా అందరూ చర్చించుకుంటున్న విషయమే. అయినా పుణ్య పురుషుల సహకారం లేనందున బిల్లు ఓటమి పాలైనది. ప్రస్తుతం ఈ విషయం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. అది మాటగా ఉండిపోకుండా రాతగా మిగిలి పోకుండా రాజ్యాంగ మార్పుకోసం పోరాటం చేయాల్సిన అవసరం వుంది. ప్రత్యేక హోదా ఆంధ్ర ప్రదేశ్‌కు, ఆంధ్రుల ఎదుగుదలకు చాలా ముఖ్యమైనది. అలాగే కొత్తగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవనానికి మహాత్మాగాంధీ, బి.ఆర్.అంబేద్కర్ల పేర్లు పెట్టాలని, వారి శిలా విగ్రహాలను నిర్మించాలని కోరుతున్నాను.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత వరకు సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఒక్క స్త్రీ మూర్తి కూడా ఎంపిక కాకపోవడం విచారకరం. స్త్రీల గురించి, వారి జీవిత విధానం గురించి, బానిస జీవితాల గురించి, ఏళ్ళ తరపడి అంచెలంచెలుగా వారి ఎదుగుదల గురించీ వింటూనే వున్నాం.. అయినా ఇంకా ఎన్నాళ్ళు ఇలా బ్రతకాలి! అని ఆలోచించినప్పుడు నాలో అంతులేని ఆవేదన కలిగింది. ఆ ఆవేదన మహాగ్నిజ్వాలగా మారి ఈనాడు నాలో వున్న కొద్దో గొప్పో స్వార్థానికి సమాధి కట్టి లక్ష్యానికి గోపురం కట్టింది. అందుకే 'నేను గాంధీ.. నాలో అంబేద్కర్'గా నన్ను నేను చిత్రీకరించుకున్నాను.



2022 డిసెంబరు 6న జరిగిన పార్లమెంటు సమావేశాల్లో నేను సుమారు 25 మంది ఎంపీలను, కేంద్ర మంత్రిని కలసి స్త్రీలకు 33% రిజర్వేషన్లు మరియు ఆంధ్రులకు ప్రత్యేక హోదా ప్రాధాన్యతను గురించి వివరించాను. అంతేకాదు అక్కడ మన ప్రదాని మోడి గారిని కలవాలనే డిమాండును పోరాట రూపంలోను, వినతి పత్రంగాను సి.ఎమ్. అరవింద్ కేజ్రీవాల్ కార్యాలయంలో ఇచ్చాను.

2022 డిసెంబరు 5న విజయవాడలో విలేకరుల సమావేశంలో ఢిల్లీకి వెళుతున్న విషయాన్ని చెప్పి వెళ్ళాను. కాని ఇంకా ప్రధాని కార్యాలయం నుండి ఏ విధమైన సమాచారం రాలేదు. నేను ప్రతి రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట 21 రోజుల నిరాహార దీక్ష (రిలే) చేయాలని సంకల్పించాను. శాంతియుతంగా చేయతలపెట్టిన ఈ అహింసా పోరాటంలో నేను మరణాన్నయినా ఇష్టంగా ఆహ్వానిస్తాను.. ప్రేమిస్తాను. నా లక్ష్యం మాత్రం ప్రజాస్వామ్య పరిరక్షణ. ఇది నేను గర్వంగా చెప్పుకుంటాను.

రాజకీయ నాయకుల్లారా! ఆడబిడ్డలకు దేశంలో అత్యున్నత పదవులు కట్టబెట్టాలి. అప్పుడే చట్టాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులొస్తాయి. దేశం మరింత ఉన్నతస్థాయికి తప్పక చేరుతుంది. ఆ దిశగానే నా ప్రయాణం.. నా ఉద్యమం..నా ప్రతి అడుగు కూడా. ★

ఉత్తరం

-డా॥ ఎన్.గోపి

చప్పుడు చెయ్యకండి
ఉత్తరం చదువుతున్నాను.
మీట నొక్కితే
ఉబికిన నీడల పంక్తి కాదిది
స్వయంగా చేత్తో రాసింది.

గుండెలోంచి
రక్త సముద్రాలు పొంగి
వేళ్లలోకి చేరి
అలలు గీసిన హృదయ రేఖ
ఈ లేఖ.

మడిచిన కాగితం
విప్పుతున్నప్పుడే తెలిసింది
గుప్పున లేచిన పరిమళం
హృదయపుష్పం లోంచి వచ్చిందని.
కవరు చేతిలో పడ్డప్పుడే
అనుమానమొచ్చింది
లోపల పచ్చి ముత్యాలున్నాయని.

కాస్త ఆగండి
ఇది సిరా నదుల్లోంచి తేలిన
చిరు పాయ.
అక్షర విన్యాసాలు
సృష్టించిన దృశ్యలయ
ఆస్వాదించనివ్వండి.



దిద్దీ దిద్దీ
అక్షరాలుగా రూపొందిన
కాలాతీత శాసన సంస్కృతి యిది
వ్యక్తి స్పందనల భావుక కృతి
చెవి యొగ్గి వింటున్నాను
కొంచెం ఆగండి.

ఉత్తరం రాగానే
గుండెల కద్దుకున్నాను
ఇది స్పర్శను మోసుకొచ్చిన
ఆత్మీయ కపోతం కదా!

చేతిరాత ఉత్తరం
మనసుకు దర్పణం
విడువకండి దానికి
చిట్టచివరి తర్పణం.

వరద

అబ్బో...!
బహు నంగనాచి ఈ నది
ఇవాళ సిగ్గుపడ్డ కన్నె ముత్తైదువులా
అలల కలహంస నడకలు నడుస్తుంది

నిన్నటికి నిన్న
గజ్జ కట్టకుండానే కథాకళినీ
భీభత్సంగా భరతనాట్యాన్ని
రౌద్రరసంలో ప్రదర్శించింది.
తోక తొక్కిన తాచులా
చిరుత తరిమిన లేడి కూనలా
అజా అయిపూ మరిచి
పల్లెల తలల్ని ఇళ్ళని గుల్ల చేసింది
హలాలు దున్నిన పొలాల పైన
దమ దమ దమ తాండవమాడింది

నదికి నడకొచ్చినప్పటి అందం
వరదలో ఏమైపోతుందో ఏమో
నీలాల నీలి దేహం
గౌర సముద్రమైపోతుంది
జన జీవితానికి వెన్నెముకై రవళించిన
కలకలనాదం కరాళ గర్జనై పోతుంది
శాంతిగీతం ఏకపక్ష సమరనాథమైపోతుంది
యుద్ధం ఎవరిపైన తల్లీ!
నీ ఒడ్డునే బొడ్డు కోసుకొని
బతుకు పాఠాలు నేర్చిన
మట్టి మనుషుల పైనా?
నీ ధారలో జీవనధారని ప్రవహింప చేసిన
తరతరాల మానవ ప్రవాహం పైనా?
చినుకుల్లో తడవగానే ఎందుకో
అల్లరి పిల్లవై పోతావు
కొమ్మల్లో కోతి మూకవవుతావు
కెరటాల కొండల్ని ఊళ్ళపై విసురుతూ
రౌడీ రంగేళి రాణివై రేగిపోతావు
తన మన మరిచిపోయి
మర్యాదల్ని తుంగలో తొక్కేస్తావు
మా నోటికాడి కోటి గింజలు లాగి
మమ్మల్ని కన్నీటి పాల్జేస్తూ పోతే
మా చెమట నీళ్లు నీకడ్డు కట్ట వేస్తాయి
పూజించిన చేతులే మెటికలు విరుస్తాయి,!

-ఈతకోట సుబ్బారావు
94405 29785

కాస్త ఆగవా..!

ఓ ఆలోచనా కాస్త ఆగవా!
నేను శ్వాస తీసుకోవాలి..

ఓ కాలమా కాస్త ఆగవా!
నన్ను నేను పరిశీలించుకోవాలి..

ఓ ఇంద్రియమా కాస్త ఆగవా!
నా మనసుకు దారి వెతుక్కోవాలి..

ఓ ఉదయమా కాస్త ఆగవా!
నాలో కల్మషాన్ని కడిగివేయాలి..

ఓ ఋతువా కాస్త ఆగవా!
నేను రంగు మూలాల్ని కనుక్కోవాలి..



ఓ ఆకాలా కాస్త ఆగవా!
నేను అమ్మతత్వం అర్థం చేసుకోవాలి..

ఓ దాహమా కాస్త ఆగవా!
నేను అమృతత్వం తోడుకావాలి..

ఓ అసహనమా కాస్త ఆగవా!
నేను గురు చరణాల్ని సేవించుకోవాలి..

ఓ కర్తృత్వమా కాస్త ఆగవా!
నేను అభయహస్తాన్ని ఆశ్రయించాలి..

ఓ ద్వంద్వమా కాస్త ఆగవా!
నేను ఒక్కటిలో లీనమై పోవాలి..

-సాయి విస్సాప్రగడ

పంచతప్త మహాసాగరంలోకి

నిఖిలేశ్వర్, 9177881201



శరీర మహాసాగరంలో
నిత్య తరంగాల
కల్లోల హోరులో
ఎగసిపడే అద్భుత క్షణాల్లో
ఆరోహణ అవరోహణ పర్వంలో
మిగిలే అనుభవసారమెంత?
రక్తాణువుల
క్షణికానందంలో
చేరుకొనే విస్ఫోటనస్థాయి!
నూతన తరాల
ఉత్తేజితయాత్రలో
భూమార్గమంతా పయనించి
కొండలు కోనలు నింపే ప్రాణవాయువులు
ఆకాశమంతా అల్లుకునే
ఆవిరుల నడుమ
మరిగి కరిగి తిరిగి
పంచతప్త మహాసాగరంలోకి!! ★

ఎలిజీ...

మబ్బు తెరలను తెంచుకుంటూ
నా అడుగులు ముందుకు పడుతున్నాయి..
హాయ్ సార్ అచ్చం శివుడిలా ఉన్నారు
అవునా !
అన్నా! మీరు నడుస్తుంటే
ఉప్పెన కెరటాలు కనిపిస్తున్నాయి,
బడబాగ్ని దాచుకున్న సాగరంలా
కనిపిస్తున్నారు.
నేను వసంతుండన్నా!
ఆ మాట నిజమే,
మీ దరహాసాలపై నవ్వులు
చిగుర్లు వేస్తున్నాయి అంటూ
పొగిడేసిందా చిన్నది.
మీకో విషయం తెలుసా?
మీరెన్ని దాచినా మీ కళ్ళు
నిజమే చెప్పేస్తున్నాయి అంటూ
మంచులోకి పరిగెత్తిందా చిన్నది.
కుర్రాడా! ఇప్పుడు అర్థమైందా నీ సంగతి
నవ్వుతూ శూన్యంలో నిలిచి ఉంది తను.
ఉడుక్కోవద్దు నాకు తప్ప నువ్వు ఎవరికీ
అందగాడివిగా కనిపించవు బుజ్జీ అంటూ
గాలిలోకి ఎగిరిపోయింది ఆ దేవకన్య...
(ఇందిరా స్మృతుల్లో)

-విజయ్‌కుమార్ ఘంటా

అంతరాలు

పరిపూర్ణ జీవనమాధుర్యాన్ని గ్రోలి
కాలధర్మం చెందేవారు
కలవారు!

బాధ్యతల భారాన్ని సునాయాసంగా దింపుకొని
అనాయాసంగా అసువులు బాసేవారసామాన్యులు

ఎడతెరపిలేకుండా కుండపోతగా కురిసే
నిరాశల నిబిడాంధకారంలో నీరసిస్తూ
పదునైన కష్టాల కంటకాల బ్రతుకుబాటలో
పయనిస్తూ, పరితపిస్తూ, శోషిల్లుతూ
అపమృత్యువుకు చిక్కేవారభాగ్యులు!

'నిర్యాణం' ప్రాణికి నిర్ణీత అవస్థే అయినా
నిరుపేదలు విగతజీవులయ్యే
విధానం విషాదకరం

సిరిమూలంగా
బ్రతుకు స్థితి తారుమారు కావడమే కాకుండా
మరణం కూడా
రూపాన్ని మార్చుకోవడం
మిక్కిలి బాధాకరం!

సామాన్యుల దుర్మరణానికి
గొప్పోళ్ళ పరలోక పయనానికీ
మధ్యన తోచే
ఇంతటి ఈ న్యూనాధిక్యాల అంతరాలు
పరివేదించే అసమానతల ప్రహారాలు!

-ఎరుకలపూడి గోపీనాథరావు, 98482 93119

నానీలు

కల్లంలో రైతు
కలలు ఆరబెట్టాడు
వర్షం
కల్లలు చేసింది!

నేను నదిని
నువ్వు సాగరానివి
నా ప్రస్థానం
నిన్ను చేరేదాకా!

కష్టాన్ని ఇష్టంగా
మార్చుకున్నావా
ఇక విజయమే
నీ గమ్యం

అతడు
చేపల వ్యాపారి
వర్షాలు పడక
ఒడ్డున పడ్డ చేపయ్యాడు

పక్కన నువ్వుంటే
సముద్రం ఈదుతా
లేకుంటే
కన్నీటి సాగరమౌతా

-ఎన్.లహరి
98855 35506

కథ

ప్రియమైన మీకు...!

డా॥ కనుపూరు శ్రీనివాసులు రెడ్డి

ఆరోగ్యం బాగా లేదని తెలిసి ఎలా ఉన్నారు అని అడగటం కూడా మిమ్మల్ని బాధ పెట్టినట్లు అవుతుంది. ఇంతటి మనః క్లేశానికి, క్షోభకు కారణం నేనే!! మన కొద్దికాల పరిచయంలో మీకు కాస్తయినా ఆనందాన్ని, ప్రశాంతతను యిచ్చానని అనుకున్నాను.

కానీ దాన్ని మరిపించే క్షోభకు గురిచేస్తానని అనుకోలేదు. మీ మాటల్లోని భారం, భావం నన్ను ఏదోగా చేశాయి. దాన్ని చెప్పడానికి భాష తెలియదు. రాత్రంతా నిద్ర రాలేదు.

అంతకు ముందు సంతోషంతో మైమరచి నిదురపోతున్నాను అని కాదు. మనస్సులో ఏదో తెలియని ఒక లాంటి శూన్యతే, గందరగోళంగా వుంది. ఇలాంటి పరిస్థితిని నా జీవితంలో ఎప్పుడూ ఎదుర్కోలేదు.

ప్రకృతి వికృతి ప్రలోభానికి లొంగిపోయి వయస్సులో సరిదిద్దుకోలేని తప్పటడుగు వేస్తుంది స్త్రీ. రాత్రి వచ్చిందని పగటిని మరిచి పోతుంది వయసు. తెగించినదానికయినా, తెంచుకున్న దానికయినా తొందరపడిన ప్రతి వారికి చివరిలో మిగిలేది మత్తుకు లొంగని అంతులేని సంఘర్షణతో నిండిన త్రిశంకు స్వర్గం మాత్రమే. ఇప్పుడు తెలుసుకున్న జీవన సత్యమిది. ఆలస్యమైపోయిందా? విచ్చలివిడితనం లెక్కలేనితనం ఆడతనానికే మరణ మృదంగాలు. కోరి కొరివిని తెచ్చుకుని, బంగారు జీవితాల్ని తగల పెట్టుకోవడం నేటి యువతకు ఆదర్శం అయిపోయింది. ఈ రోజే నిజం అనుభవించు ఆనందించు అనే నానుడి తప్పు అని చేతులు పూర్తిగా కాలిన తరువాత తెలుస్తుంది. రేపు తప్పక ఉంటుందనే నగ్న సత్యాన్ని యవ్వనంలో జ్ఞాపకం ఉంచుకోరు.. ఉరకలు వేసే వయస్సులో, పరుగులుపెట్టే జీవితంలో ఈ నిజాన్ని ఎవ్వరు అశ్రద్ధ చేసినా కాలాగ్నిలో మిడతల్లాగా ఘన ఘన మండే మంటలలో పడి బూడిద కావాల్సిందే! క్షమించండి! నేనేవిటి ఇలా నీతులు అని అనుకోకండి. ప్రేమకోసం తపిస్తున్న దానిని క్షణిక కలయిక దుర్గంధం తెలిసిన దానిని. థ్రిల్ కోసం తమాషా కోసం అడగకనే శరీరాన్ని ఇచ్చే ఆదర్శ యువతులు చాలా మంది ఉన్నారట. విడ్డూరం కదా!!

శీలం అంటే ఏమిటి? దయ, సానుభూతి, క్షమ ప్రేమతో నిండిన ఆడతనం కాదా? శీలం, మానం, ఒక్క స్త్రీకేనా పురుషులకు లేదా? వ్యక్తిత్వానికి అదేమన్నా సర్టిఫికేటా ? స్త్రీలు మాత్రమే శారీరకంగా చెడిపోకుండా

ఉంటే చాలా ? ఈర్ష్య, ద్వేషం పగ, కుచ్ఛితం, కుతంత్రాలతో ఎదుటి వాళ్ళను నాశనం చేసి, మానసికంగా, శారీరకంగా, అంతులేని యాతనలకు గురిచేసే స్త్రీలు శీలవంతులా ? ఇదేనా ధర్మ శాస్త్రం ? విధిలేని పరిస్థితుల్లో శరీరాన్ని తెలిసి ఇచ్చినా, తెలియక ఇచ్చినా స్త్రీదే తప్పా? మృగత్వానికి బలి అయిన వారు సంసారానికి అంటరానివారా? వాడుకోవటానికి మాత్రం అభ్యంతరం ఉండదు. ఏం న్యాయం ? ఎవరు ఇచ్చిన తీర్పు? కురు సభలో, నన్నోడి తానోడెనా...తానోడి నన్నోడెనా అని అడిగిన ద్రౌపదికి సమాధానం ఇచ్చారా? నేను అడుగుతున్నాను, 'నేను చెడి మిమ్మల్ని చెరిచానా. మీరు చెడి నన్ను చెరిచారా?'

నా గతం గురించి చెప్పమని మీరు అడగలేదు. రెండు రకాలుగా చెప్పి మిమ్మల్ని గందరగోళంలో ఉంచాను. అసలు ఈ ప్రస్తావన మన మధ్య రాకుండా ఉంటే ఎంత బాగుండేది !? ఈ ఉత్తరం మీలో ఏదయినా గందరగోళం, విసుగును సృష్టిస్తే, సహనంతో అర్థం చేసుకోండి. అసలు గతంతో అవసరం ఏమిటి? నిన్నటిని మరిచిపో, నేటిని సద్వినియోగం చేసుకోమనే కదా చెప్పారు. ఎంతో మంది ఉన్నతులు అనబడే వారు కూడా పరిస్థితులవలన చేయరాని తప్పులు చేసి నలుగుతున్నారు. స్త్రీ ఎత్తులు పల్లాలకేనా విలువ.. మనసుకు కాదా? సమర్థించుకోవడం లేదు. ఇవన్నీ నాలో నేను తర్కించు కుంటున్నాను.

అసలు నా గతాన్ని గురించి ఎందుకు చెప్పాలి ? ఎందుకు మీకు రాయాలి? రాస్తే ఏమయిపోతుంది?

రాయాలి.. ఎందుకంటే జీవితాంతం మీరు తోడుగా ఉండాలి. మన స్నేహంలో అనుమానాలకు అపార్థాలకు తావు ఉండకూడదు. ప్రేమ... ప్రేమ అదే నా జపం తపం; ఇది వ్యామోహం కాదు. అర్పణ. దూరంకాకూడదనే ఆరాటం. మిమ్మల్ని దక్కించుకోవాలి, అదే నా జీవిత గమ్యం. ప్రేమ అడిక్షన్‌లోని పర్వర్షన్ ఒక విధంగా మానసిక ఉన్మాదం. ఈ కోరిక అనే కొరివి, సభ్యత సంస్కారాలను మరుగుకుతోసి విశృంఖలతగా మారిపోతుంది. స్త్రీలపై మరో అపవాదు కూడా ఉంది..ఒక చేయి మారిన తరువాత ఎన్ని చేతులలో నలగడానికైనా అభ్యంతరం వుండదని !!

ఎంత చిన్నచూపు స్త్రీ అంటే. ఇదేనా మగనీతి, సంస్కారం? వ్యక్తిత్వం, ఆత్మాభిమానం లేనిది కాదు స్త్రీ. ఇది నేటి యువతలో ఎవరో కొందరి జీవితంతో ఆడుకుంటే అందరినీ ఒకే గాటికి కట్టేస్తే ఎలా? ఎంత చెడిపోయిన దానికయినా హృదయపు లోగుడిలో ప్రేమ అనే పవిత్ర గృహం ఉంటుందని మాంసమే కావాలనుకునే మృగాలకు ఎలా తెలుస్తుంది?

అజ్ఞానం, అహంకారం ఆడదాని తప్పులకు మొదటి కారణం అని నా నమ్మకం. అందం, వయసు, స్త్రీకి వజ్రాయుధాలు. అవే పతనానికి మారణాయుధాలు. అవి నేను వుపయోగించుకోలేదు. అలా అని తెలియదు. కానీ మీ పరిచయం కోసం వాటిని వాడాను.

మనది ఎలాంటి సంబంధమో ఆలోచించే అవసరం, మీరు విముఖత చూపించే వరకు గుర్తు రాలేదు. ఈ కాలంలో వివాహేతర సంబంధం తప్పు అని నాలుక చివరి నించే అంటారని నా ఉద్దేశ్యం. అలా ఉండటమే ప్రతిష్టగా భావించి తమ అందానికి లొంగని గాడిద కొడుకులు లేరని అహంకార జాడ్యమున్న స్త్రీలే సమాజం చేత గౌరవింపబడుతున్నారు. ఇప్పుడు ఏకంగా ఇంటర్‌నెట్లో ఈ ఎక్స్‌ట్రా మారీటల్ వెబ్ సైట్లు కొల్లలుగా ఉన్నాయి. సహజీవనం సంగతి ఇక చెప్పనవసరం లేదు. రెండు రోజులకు మగాడ్ని మార్చే వాళ్ళు ఆత్మాభిమానం, వక్తిత్వమున్నవారా? మిమ్మల్ని మాత్రమే ప్రేమిస్తున్న నేను చెడి



మీరు పురుగును చూసినట్లు చూశారు. దండం పెట్టేశాను. అంతులేని మానసిక సంఘర్షణ, పిల్లలు కూడా దగ్గర లేకపోవడం, ముఖ్యంగా ఆనందించడానికి ఎన్నో అవకాశాలు ఉండి కూడా ప్రలోభాలకు లొంగని మీ వ్యక్తిత్వానికి జోహార్లు అర్పించి...కానీ వదలలేదు. ప్రేమ రాహిత్యపు ఎడారిలో, మానసిక వ్యధతో, అనుభూతులకోసం ఎగురుతున్న అందమైన చేప పిల్ల అమాయకత్వానికి చలించిపోయి, వల లేకనే చేతిలోకి అవలీలగా తీసుకున్నారు. లేదు నేనే మీ నవనీతమైన జాలిని అదునుగా తీసుకుని ఎగిరి మీ చేతిలోగాక ఏకంగా హృదయంలోకే చొచ్చుకుపోయాను. సానుభూతి అనే మీ ఆదర్శం నాకు అవకాశాన్ని తోడునిచ్చింది. పెన్నిధి దొరికినట్లు సంబర పడిపోయాను. కానీ అది ఎంతోకాలం లేదు.

పోయినదానా? ఎందుకు దూరం చేస్తున్నారు? నాలో తప్పు ఏమిటి? విధికి బలి కావడమేనా?

కలయిక శారీరక పొంగును తగ్గించే అలసట మాత్రమే. మానసికి తృప్తి ఎలా అవుతుంది? ప్రేమ కానేకాదు!! మనసుకు తగలనిది, నిలవనిది, క్షణిక మైనది మలినం ఎలా అవుతుంది ? నలిగిన చీరను అలా విదిలించి ఇలా సరిచేసుకోవటంతో సమానమది. ఏమో నాకెప్పుడూ శారీరక మానసిక ప్రశాంతత ఎవ్వరి దగ్గర ఎలాంటి హంగులున్నా కలగలేదు.. మీ దగ్గర తప్ప. అదే అనురాగానికి అర్థం అని నమ్మాను.

ఆనందానుభూతిని పరాకాష్టకు చేర్చే ప్రేమ మైకంలో తమకంతో వణికిపోయే శరీరాన్ని జారనివ్వక నన్ను ఐక్యం చేసుకునే ఉద్వృత

మైన మీ బిగికౌగిలిలోనే తెలిసింది స్త్రీ పురుషుల సంగమానికి అర్థం. అంతర్గతంగా అంత ర్లీనమై ఉన్న అనూహ్యమైన పరాకాష్ఠత ప్రేమకు అర్థం, ప్రేమలోని దైవత్వం. కలయిక లోని హైహిక స్వర్గం. అది, మానం, శీలం పోగొట్టుకోవడం కానే కాదు. పవిత్రమైన ఆత్మోన్నతి. మీ పరిచయం నాకిచ్చిన వరం. అది ఎప్పటికీ దూరం చేసుకోలేను. మనది ఆత్మానుబంధం. ఆత్మకు చావు లేదంటారు. అందుకే నా ప్రేమ యుగ యుగాలు శాశ్వతం. ఒకవేళ జరిగితే ఆ రోజు నా ఆత్మ చచ్చి తీరుతుంది. హైందవ నమ్మకాలు తగలపడు తాయి. భారతీయ సంస్కృతి అర్థం తెలియక విలవిలలాడుతుంది. నా ప్రేమ చావకూడదు. బంధానుబంధాలను మానవాతీతమైన విశ్వ శక్తి కల్పిస్తుంది. దేవుడు కాదు అని మీరం టారు. కానీ పూర్వజన్మ బంధం నిజం, దాన్ని బట్టే దేవుడు మన కలయికలు, విడిపోవడాలు రాస్తాడంటే మీరు నా నోరు మూసేసేవారు. నా నమ్మకం నిస్సందేహంగా మనది జన్మ జన్మల బంధమే!! మరి మీ నుంచి నన్ను ఎవరు దూరం చేస్తారు?

ఇదంతా మిమ్మల్ని మభ్యపెట్టాలి అనే తపన కాదు. నా అమాయకత్వాన్ని నిరూ పించుకోవడానికి కూడా కాదు. రాతను మార్చ లేను. ఎవరు రాసినా మార్చగలిగేది మీరు మాత్రమే! మీతో సహచర్యం ఒక్కటే !! అందుకే చెప్పేస్తాను. నాలో నిజాయితీ వుందో ఈ సమాజ వ్యక్తీకరణలో వుందో తేల్చి చెప్పాల్సింది మీరే!

ప్రియమైన మీకు...

నా జీవితంలో మిగిలిన ఒకే ఒక రహ స్యాన్ని గురించి మీకు ఎందుకు చెప్పాలను కున్నానంటే అబద్ధం చెప్పడానికి మనస్క రించక. మీతోనే నా బ్రతుకు అనుకుంటు న్నాను గనుక. నిజానికి నేను మీకు దేని లోనూ సమానం కాదు, అసలు దగ్గరకు కూడా చేరలేని అర్హతగల దాన్ని. ఇతరుల దృష్టిలో నాకు వ్యక్తిత్వం లేదు, అందరి దృష్టిలో చెడిపోయినదానిని, మంచి వంశమూ లేదు. అయినా నన్ను దగ్గర చేరనిచ్చారు. ఇతరుల కర్మలు, కల్మషాలన్నీ తనలో కలుపు కుని పాప ప్రక్షాళనగావించి మోక్షాన్ని ప్రసా దించే పవిత్రమూర్తి గంగమ్మ తల్లితో పోల్చి, ఎన్ని దోషాలనయినా దుష్ట శక్తులయినా హరించగల శక్తీ, ధైర్యం, ఆదర్శం, స్వచ్ఛత నాలోనే ఉందని, 'గంగా' అని పిలిచారు. ఈ జన్మకు అది చాలు. కానీ నా నిలకడ లేదనే మీ అపనమ్మకాన్ని అనుమానాన్ని పోగొట్టి తీరాలి. అదే నా జీవిత పరమార్థం.

ఎలాంటి అర్హతలుంటే ప్రేమించాలో నాకు తెలియదు. నాకు మీ సరసనే మన శ్శాంతి, ప్రశాంతత, మైమరపు కలుగుతుంది. దాన్ని ప్రేమ అనరా?

మీరు తమాషాకో చతురతతో, నన్ను నా జన్మను ఎగతాళి చేసినా చాలా తేలిగ్గా తీసుకునేదానిని. కానీ కొన్ని సమయాలలో మీ మాటలు మనసును చిందర వందర చేసి ముక్కలు ముక్కలుగా తగలబెట్టేవి. ఈ మధ్య నాలో వచ్చిన మార్పుకు ఇవే కారణాలు. అందుకే మీ దగ్గరకు రాలేక, దూరంగా వుండ లేక చస్తున్నాను. మానంకన్నా పదును మాట. గాయం మానిపోవడానికి శరీరం కాదు; ఇది మనసు; తగిలింది గుండె గుడిలో.

ఏ అర్హతా లేని నన్ను ప్రక్కన కూర్చో బెట్టుకుని లాలించి, పాలించి అన్నం పెట్టారు, బుజ్జగించారు. ఎప్పుడూ నవ్వని నవ్వులు సొంతం చేశారు. అది చాలు ఈ జన్మకు. ఈ ఉత్తరం రాసేటప్పుడు ఏడుపును ఆపుకో లేక పోతున్నాను. మీ కౌగిలిలో ఇమిడిపోయి భోరున ఏడవాలని ఉంది. చచ్చిపోవాలని వుంది. చనిపోతే ఎలా? మిమ్మల్ని దూరం నుంచి కూడా చూడలేను కదా? మీ మాట వినలేను కదా? మీ మీద కష్టంతోకాదు. మీకు దగ్గరకాలేని నా ఘన చరిత్రకు సిగ్గుపడి నన్ను నేనే దూరం చేసుకోవాలనుకున్నాను. అది నా వలన కావడం లేదు. మీరు నాకు కావాలి. అది ఎందుకు నిజం చేసుకోకూడదు అనే నా మొండి పట్టుదల.

ఒక్కటి మాత్రం నిజం.. మీ ప్రేమతో నాలో ఎంతో మార్పు తెచ్చారు. ప్రేమ, అను బంధం గొప్పతనాన్ని, పవిత్రత విలువను గ్రహించేసేటట్లు ఆలోచింప చేశారు. నా జీవి తంలో ఒక నూతన అధ్యాయానికి తెర తీశారు.

ఏమీ తెలియని నంగనాచినికాదు. కానీ మీ స్పర్శతో లోకాన్ని మరిచిపోయేదాన్ని. ప్రణ యంలో ఉన్న ప్రతి స్పందనను తనివితీరా అనుభవించి సంతృప్తి చెంది స్త్రీ అనే పదానికి అర్థం తెలుసుకున్న దానిని. ఒక ముద్దుతో కలిగే పులకరింత స్వర్గాన్ని మరిపించే ఆ మై మరపు, ఏనాడూ అనుభవంలోకి రానివి. ముద్దంటే అంత అనూహ్యమైన పరాకాష్ఠతను కలిగిస్తుందా అనిపించింది కూడా మీ చెంతనే. కలయికలో ఇంత అనుభూతి ఉంటుందా అని అనిపించించింది కూడా మీ దగ్గరే. అవి ఈ జన్మకు కోటి వరాలు, స్త్రీగా ఫలించిన నా జీవిత మోక్షార్థాలు!!

నేను మీ దగ్గర అల్లరిగా ప్రవర్తించినా, మామా అని ఆటలు పట్టించినా అది మీ మీద ఉన్న అంతులేని ప్రేమ, ఇష్టం, అరమరికలు లేని చొరవ, నాది నావాడు అనే పూర్తి విశ్వాసం. మీ దగ్గర ఉన్నప్పుడు నా ప్రవర్తన నిజంగా



స్వచ్ఛమైన నిజం. కానీ దేనికయినా అదృష్టం ఒకటి వుండాలి కదా!?

కోరినది ఏనాడూ లభించలేదు. ప్రతిది నా ఇష్టానికి వ్యతిరేకంగానే జరిగింది. అడుగు ముందుకు వేస్తే లోతయిన అగడ్తలు. దాటి పోదామంటే కారు చీకట్లు కమ్మిన కీకార ణ్యాలు, దారి మార్చి నడుస్తామంటే చీల్చుకు పోయే ముళ్ళు, మండుతున్న కాఠిన్య శిలలు, కర్కశంగా కాటు వేసే కాలనాగులు. మిమ్మల్ని చూడటానికి దగ్గర చేరడానికి వీటిని లెక్క చెయ్యలేదు.

రాస్తుంటే తల తిరిగి పోతుంది, పిచ్చి ముదిరిపోయింది. అందుకే ఎప్పుడయినా మీ తలపుల మైమరుపులో మరిచిపోతే, మీ ఆలో చనల్లో మునిగిపోయి మీ దగ్గరకు రావడం ఆలస్యం అయితే అలిగి నన్ను నిరసించే వారు. 'నిన్ను ప్రేమించి, అభిమానించే వాళ్ళను ఏడిపించడం అలవాటు నీకు' అని. అది ఎడబాటు ఆలస్యపు కుళ్ళు అని, ఎంత ప్రేముందో మీకు అని నవ్వుకుని, సంతో షంతో పొంగిపోయేదాన్ని. అయినా అదేం సరదా నాకు ? మనుషులను దూరం చేసు కోవడం మానసిక క్రూరత్వం. అంత శాడి స్టును కాను. మీరు అన్నట్టు నాకు సిగ్గు లజ్జ లేవు కదా వస్తూనే ఉంటాను, ఐనా ప్రేమించే వారిని క్షమించక పోతే అపార్థం చేసుకునే ప్రేమ అదేం ప్రేమ? చావయినా రేవయినా మీ కనుసన్నలలోనే, మీ కాళ్ళ దగ్గరే. దగ్గర లేకపోయినా, దరి చేరలేక పోయినా ప్రతి స్త్రీకి గాని, పురుషునకుగాని అంతర్గతంగా ఒక ప్రత్యేకమైన వ్యక్తి తప్పక వుంటారు. అపార్థం చేసుకోకండి. నా సోల్మేట్ మీరే - ఆత్మసహ చరులు మీరు. అందుకే సర్వకాల సర్వావస్థ లందు మీ తలపు రూపు నా మదిలో ప్రత్యక్షం గానే ఉంటుంది. ఇది అబ్సెషన్ కాదు. డివైన్ అడ్మిరేషన్... దైవత్వపు అర్పణ.

మన మధ్య ఈ అపోహ రాకుండా వుంటే ఎంత బావుండేది. ఎప్పటిలా మామా అంటూ ఆట పట్టిస్తూ మీ బిగి కౌగిలిలో ఐక్యమై, లోకాన్ని మరిచిపోయి ఈ పదు నాలుగు లోకాలను శాసిస్తూ, పాలించి ఉండే దాన్ని. కానీ ఇప్పుడు అంత చనువు తీసుకో గలనా? పరుగెత్తుకు వచ్చి మీ ఒడిలో వాలి ఈ లోకాన్ని మరిచి పోవాలని ఉంది. కానీ



కాళ్ళూ చేతులు బలవంతంగా కట్టేసుకుని, అన్నీ కోల్పోయినట్లుగా దిగులుతో ముడు చుకుపోయి మూల కూర్చొనున్నాను.

మీరు మెచ్చుకునే ఈ శ్రీగంధపు పాల బొమ్మ స్నానం చేయకపోయినా సువాసనలు వెదచల్లుతుంది గాని దుర్గంధం వేయదు అని, అదీ మీ చెంతనుంటే. కానీ ఇప్పుడు మీరు లేరు. భరించలేని కంపు కొడుతున్నాను. ఇప్పుడు స్నానం చేయాలని మనసులేదు. తల దువ్వుకొని మూడు రోజులయ్యింది. భోజనం వండాలని, తినాలని లేదు. కానీ తప్పదు చెయ్యాలి. దేని మీద ఇష్టం లేదు. మన అను

ప్రేమ లేకుండా ప్రపంచమే లేదు. అదొక అద్భుతమైన భావోద్వేగం. అలాంటప్పుడు ప్రేమ కథలు లేకపోతే ఎలా? నా దగ్గరకు తరచూ ప్రేమకథలు వస్తూనే వుంటాయి. ఏదో ఒకటి చేస్తూనే వుంటా. ప్రేమకథలు తెరకెక్కుతూనే వుండాలనేది నా అభిమతం.
-అనుపమ పరమేశ్వరన్

బంధం ఏమవుతుందో, నన్ను దూరం చేస్తా రేమో అనే విపరీతమైన భయం అణుచుకో లేని ఆత్రుత. ఇదంతా మీ మీద ఉన్న పిచ్చి ప్రేమ. మతి భ్రమించి వీధుల్లోకి పరుగెత్తి జుట్టు పీక్కోవాలని, ఈ ప్రేమ అనే దైవాంశా నికి కలయిక అనే వికృతమైన వ్యామోహపు స్పందన కలిగించే ఆ దేవుడ్ని గొంతు పిసికి చంపాలని, వెర్రిగా అరవాలని అణుచుకోలేని కోరికగా ఉంది.

ప్రేమకు నిర్వచనం సెగలు పొగలు ఎగచిమ్మే శారీరక కోరిక కానే కాదు, అదొక వరం, ప్రలోభాలకు లోబడి మీ పరమ పవిత్ర మైన శరీరాన్ని కామందులకు, సొల్లుకుక్క లకు ఇవ్వకండి. దైవత్వంతో నిండి, సహనం, అనురాగ, ఆప్యాయతలను అందించే ఈ అక్షయపాత్రను అపవిత్రం చేయకండి. అనుభవించు, ఆనందించు,ఈ రోజే నిజం అనే అజ్ఞానులకు అవకాశ వాదులకు, పోరం బోకులకు బలిపసువులు కాకండి. ఆడతనం, యుక్త వయస్సు, మన వరాలు ఇది వేయి జన్మల పుణ్యఫలం అని చెప్పుతోకొట్టి చెప్పా లని ఉంది. రాత అనే మాట స్త్రీ నడవడికలో బంధించబడి ఉంది. ఆకర్షణ, ప్రలోభాల నాట్యాలకు మోసపోయి కళ్ళు మూసుకుని మంటలలో ఎగిరి దూకకండి !! నాలో రగులు తున్న అగ్ని ద్రావకం ఇది.

చెప్పాలని ఉంది. చెప్పనా...వద్దా? చెపితే ఎలా చెప్పాలి.? ఇదివరకు ఎన్నిసార్లో అని పించినా ఎందుకు చెప్పలేదు? ఇక దాచ కూడదు. చెప్పి తీరాలి.

-ఇంకావుంది

లోకాభి'రచ్చా'యణం

■ సాంబ

అది ఆంధ్రప్రదేశ్‌లో ఓ కుగ్రామం. మెయిన్‌రోడ్‌లో కాంతయ్యగారి గుడిసెంటర్. రోడ్డుకాపక్క బజ్జీల బద్రయ్య బడ్డీకొట్టు. రోడ్డుకీపక్క ఇడ్లీల ఈరయ్య బడ్డీకొట్టు. అదే సెంటర్‌లో ఎలిమెంటరీ స్కూల్ కూడా వుంది. ఆ స్కూల్ గేటు పక్కకి గోడకానుకుని నాపరాళ్ళతో కట్టిన అరుగులుంటై. వాటిపై దాదాపు ఏడెనిమిదిమంది కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకోవడానికి వీలుంటుంది. ఉదయం **5** గంటల నుండి ఎనిమిది గంటల్లోపే ఇడ్లీల ఈరయ్య ఇడ్లీల వ్యాపారం పూర్తవుతుంది. సాయంత్రం **3** గంటల నుండి **6** గంటల్లోపు బజ్జీల బద్రయ్య బజ్జీల వ్యాపారం పూర్తవుతుంది. ఇక ఆరు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల దాకా నాపరాళ్ళ అరుగులపై 'లోకాభిరచ్చాయణం' మొదలవుతుంది. ముందుగా ఇడ్లీల ఈరయ్య అరుగులపై ఆశీనుడవుతాడు. ఈరయ్యను చూసిన బద్రయ్య చేబ్రోలు పొగాకుతో చుట్టిన ఆరంగుళాల చుట్టను నోట్లో పెట్టుకుని అరుగుమీదెక్కి ఈరయ్య పక్కనే కూర్చుంటాడు. వీళ్ళిద్దరి మధ్యలో దర్జాగా వచ్చి కూర్చుంటాడు రామకోటయ్య. రామకోటయ్య ఆ గ్రామంలోని హైస్కూల్లో సోషల్ సబ్జెక్టు చెప్పే ఉపాధ్యాయుడు. కాస్త జనరల్ నాలెడ్జి వున్న టీచర్. దానికి తోడు సోషల్ మీడియా, ఇతర మీడియాలపై అవగాహన వున్నవాడు.

"ఏరా ఈరిగా..నాకంటే ముందే వొచ్చి కూసున్నాం..అప్పుడే పొద్దుగూకిపోయిందేంట్రా నీకు.." అంటూ వచ్చి, అప్పటికే నాపరాయి బండపై కూర్చున్న ఇడ్లీల ఈరయ్య పక్కన కూర్చున్నాడు బజ్జీల బద్రయ్య. నాపరాయి బండంటే ఆ ఊరికి ఒక విధమైన రచ్చబండ లాంటిది.

"నీదంటే సాయంత్రం యాపారం.. నాదేమో ఉదయప్పూట యాపారమే కదా..ఆ తర్వాతంతా ఖాళీయేగా.." అంటూ వివరణ ఇచ్చాడు ఇడ్లీల ఈరయ్య.

"ఓహో..అట్టంటావా.. సర్లే గానీ రామకోటయ్య మాస్టారేంట్రా ఇవాళింకా రాలేదు..." అడిగాడు బద్రయ్య.

"వస్తార్లేరా బద్రిగా..నీకూ నాకూ పని లేకపోతే మేస్టారిక్కూడా పన్లేదనుకున్నావా ఏంది?" అన్నాడు ఈరయ్య.

"అదిగో మేస్టారు మాటల్లోనే వచ్చారు..." అక్కడికి వస్తున్న రామకోటయ్య మాస్టార్ని చూసి ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"నా కోసమే మీరిద్దరూ ఎదురు చూస్తున్నట్టున్నారు.." అన్నాడు రామకోటయ్య, వచ్చి వాళ్ళ పక్కన కూర్చుంటూ.

"అవునండీ మేస్టారూ..ఈ టైమ్‌లో మీ కోసమే కదా చూస్తాం..యాపారం టైమ్‌లో అయితే కష్టమర్లకోసం ఎదురుచూస్తాం.. కదరా" అంటూ ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ఈరయ్య, బద్రయ్య.

"సర్లే..ఏంటి కబుర్లు..ఎలా వున్నారు?" అడిగాడు రామకోటయ్య.

"ఏముందండీ మేస్టారూ..రాజకీయం నా నూనెబాండీలో బజ్జీల్లా కుతకుతలాడిపోతోంది.." అన్నాడు బజ్జీల బద్రయ్య బాధపడ్తూ.

"ఓహో..నువు చెబుతోంది కందుకూరు, గుంటూరు సంఘటనల గురించేనా?" అడిగాడు రామకోటయ్య.

"అవును మేస్టారూ" అన్నాడు బద్రయ్య.

"బద్రిగాడెప్పుడూ ఇలాంటి వాటి గురించే బాధపడ్తాడు..ఇంతకంటే గోరమైన సంఘటనలు జరిగినప్పుడేం మాట్లాడడు..వాడు ఎవరిమీదో అభిమానంతో మాట్లాడతాడు మేస్టారూ!" అంటూ ఏదో సర్ది చెప్పబోయాడు ఈరయ్య.

"ఆగాగు ఈరయ్యా! మనిషన్నాక అన్నిటి గురించీ స్పందించాలి..తప్పేం లేదులే..బద్రయ్య చెప్పింది నిజమే ఈరయ్యా! ఒకసారి తప్పు జరిగితే పర్వాలేదు..రెండోసారి కూడా అదే తప్పు జరగకూడదు..జాగ్రత్త పడాలి కదా! పైగా ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయం.." చెప్పుకుపోతున్నాడు రామకోటయ్య.

"అసలెందుకు జరిగిందంటారు ఈ దుర్ఘటన మేస్టారూ!" అడిగాడు ఈరయ్య.

"ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీలైనా ప్రజల దగ్గరకు వెళ్ళొచ్చు..ప్రచారం చేసుకోవచ్చు. తప్పులేదు ఈరయ్యా! పైగా ఇది బహిరంగ సభలు కాబట్టి...ఎంతమంది జనమొస్తారు? వారికి ఏర్పాట్లేమిటి? వచ్చే జనానికి సభా ప్రాంగణం సరిపోతుందా లేదా? ఒకవేళ అంచనాలకు మించి జనమొస్తే ఏంచేయాలి? అనే అంశాలపై నాయకులకు పూర్తిగా అవగాహన వుండాలి. సభలంటే కేవలం నాయకుడిమీద నమ్మకంతో ఆయన చెప్పే సందేశం వినాలనే ఆశతోనే వస్తారు. అక్కడ మంచి జరిగినా, చెడు జరిగినా ఆ బాధ్యత ఆ నాయకుడిదే అవుతుంది.." చెప్పుకుపోతున్న రామకోటయ్య మాటకు అడ్డు తగులుతూ-

"బాధ్యతంతా పోలీసులది..ప్రభుత్వానిదే అంటున్నారు కదా మేస్టారూ ప్రతిపక్షం వాళ్ళు" అన్నాడు బద్రయ్య.

"అవును బద్రయ్యా! ప్రభుత్వానికీ బాధ్యతుంటుంది..పోలీసులు ఇక్కడే కాదు..ఎక్కడా ఇలాంటి సంఘటనలు జరక్కుండా చూడాల్సిన అవసరం వుంది. శాంతి భద్రతలు కాపాడటమే కదా పోలీసుల ఉద్యోగ ధర్మం. అందుకే కదా

ప్రభుత్వం వారికి జీతాలిస్తుంది..రాజకీయాలకు అతీతంగా వాళ్ళు పనిచేయాల్సిన అవసరం వుంది"

"అట్టా శెప్పండి బద్రిగాడికి..ఓ తెగ ఎనకేసు కొస్తాడు ప్రభుత్వాన్ని" అన్నాడు ఈరయ్య.

"ఈరయ్యా! పోలీసులు, ప్రభుత్వం చెప్పిన విషయాల్ని, పెట్టిన నిబంధనల్ని సభా నిర్వాహకులు కూడా తప్పక పాటించాలి. వాటిని వ్యక్తిగత ద్వేషంతో తిరస్కరించి సభలు నిర్వహిస్తే ఇలాంటి సంఘటనలే జరుగుతాయి. ఉదాహరణకి సభ నిర్వహించే మైదానం కెపాసిటీ గురించి పోలీసులు ముందుగా హెచ్చరించాలి. హెచ్చరించక పోతే పోలీసుల తప్పు. హెచ్చిరించినా వినకపోతే సభా నిర్వాహకుల తప్పు. పోలీసులు చెప్పామని అంటున్నారు.." చెబుతున్నాడు రామకోటయ్య.

"ప్రభుత్వం తప్పయినా ప్రతిపక్ష నాయకుడు పశ్చాత్తాపం చెంది, చేయని తప్పుకు తనకు తానుగా జరీమానా విధించుకున్నాడు కదా మేస్టారూ!" అన్నాడు ఈరయ్య.

"తనకు తానుగా జరీమానా విధించుకోవడ మేంటి ఈరయ్యా! నాకర్థం కాలేదు.."

"అదే మేస్టారూ! సచ్చిపోయినోళ్ళకి తలా పది లక్షలు తన సొంత డబ్బులిచ్చాడు..ఆ పార్టీ నాయకులంతా తలా యాభైవేలు. పాతికవేలు చొప్పున విరాళాలు ప్రకటించారటగా"

"ఓరి ఈరయ్యా! పోయింది ప్రాణాలు.. నిండు జీవితాలు...లక్షలు ఇస్తున్నాంగా మేం చంపేస్తాం అన్నట్లుగా మాట్లాడుతున్నావు..తప్పు అలా మాట్లాడకూడదు. పేదల ప్రాణాల్ని డబ్బుతో కొంటారా ఈరయ్యా!" అడిగాడు రామకోటయ్య.

"మరి ప్రభుత్వం వాళ్ళు పథకాలు పెట్టి డబ్బులు పంచుతుంటే ఈ బద్రిగాడు తెగ పొగుడుతున్నాడుగా...అది తప్పు కాదా?"

"అవి సంక్షేమ పథకాలు..ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని చూడాలి. వారి జీవనోపాధికి సహాయం చెయ్యాలి. అది ప్రభుత్వాల బాధ్యత. అది ఏ ప్రభుత్వమైనా కావచ్చు.. గతంలో ఇప్పటి ప్రతిపక్ష నాయకుడు కూడా ఆ పథకాల్ని అమలు చేశాడు కదా!"

"కరెక్టుగా చెప్పారు మేస్టారూ! పేదలకు ప్రభుత్వం సంక్షేమాలు అందిస్తుంటే...వాటి మీద కూడా కోర్టులకెళ్లి అడ్డుకుంటున్నారు. ప్రజలకు దోచిపెడ్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు" టక్కున అందుకుని అన్నాడు బద్రయ్య.

"అంటే మీరు ప్రజలకు డబ్బులిస్తే మంచి, ప్రతిపక్షం డబ్బులు పంచితే చెడా?" కస్సుమని లేచాడు ఈరయ్య.

"ఈరయ్యా! ఆవేశపడకు. డబ్బున్న వాళ్ళు గానీ, రాజకీయ నాయకులు గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ పేదల అవసరాలకు డబ్బివ్వడం నేరమేం కాదు. కానీ ఇచ్చే సందర్భాల్ని అది ఆధార పడుతుంది. ఉదాహరణకి ఎన్నికలప్పుడు డబ్బివ్వడం నేరం. ఇప్పుడు ప్రాణాలు కోల్పోయినం దుకు ఇస్తున్నారు..సందర్భం కొంచెం ఇబ్బంది కరమే. రేపొద్దున ఇంకో నాయకుడు కూడా ప్రాణాలు తీసి లక్షల డబ్బిస్తానంటే ఏమిటి పరి స్థితి? పేదల ప్రాణాలు డబ్బుతో ముడిపడ్డాయా? ఆలోచించు వీరయ్యా! దీన్ని ప్రజాస్వామ్యవాదులెవ్వరూ అంగీకరించరు."

"సరే కానీ మేస్టారూ! ఇందాక మైదానాలు అన్నారు కదా! ఆ మైదానంలో ఎంతమంది జనం పడతారో ఎలా లెక్కిస్తారు?" అడిగాడు ఈరయ్య.

"ఒక మనిషి నిలబడే స్థలాన్ని, లేకపోతే కూర్చున్న స్థలాన్ని లెక్కిస్తారు. దానితో ఆ స్థలం విస్తీర్ణాన్ని పోల్చి కౌంట్ చేస్తారు. దాంతో కుడి ఎడంగా ఆ మైదానంలో ఎంతమంది జనం పడతారో అంచనా వేస్తారు. దీన్ని పోలీసులు, నిపుణులు కలిసి చేసే పని.."

"ఓ..అలాగా..రోజూ నేను పేపర్లలో చూస్తుంటాను కదా... ఆ మీటింగుకి ఇన్ని వేలమంది వచ్చారు... ఈ మీటింగుకి ఇన్ని లక్షల మంది వచ్చారు అని రాస్తుంటారు.. విలేకరులేమన్నా వెళ్ళి మన కాంతయ్య గారి గుడిలో పూజారి భక్తుల్ని లెక్కేసినట్లు లెక్కేసి రాస్తారేమో అనుకునేవాణ్ని.. ఇప్పుడు వివరంగా తెలిసింది" అన్నాడు ఈరయ్య.

"అలా ఏముండదు ఈరయ్యా..ఇడ్లీలకు ఏ పిండి ఎంత కలపాలి? ఎంతసేపు ఇడ్లీలు ఉడికించాలి అనే విషయాలపై నీకు అవగాహన వున్నట్లే వాళ్లకి ఆ విషయాలపై పూర్తి అవగాహన వుంటుంది.. వుండాలి కూడా" అన్నాడు.

"మరి అంత అవగాహన వుండి కూడా ఎందుకిలా జరిగింది మేస్టారూ" అడిగాడు ఈరయ్య.

"ఎందుకేమిటి? జనాన్ని ఎక్కువగా చూపించడానికి సభా మైదానాల్ని మార్చి సందుల్లోకి జనాన్ని తీసుకెళ్ళారు. మరి జరగదేంట్రా ఈరిగా..." ప్రతిపక్షం ప్రచార ఆర్భాటాలకు అమాయక జనం బలయ్యారు.." టక్కున అన్నాడు బద్రయ్య.

"అలా ఏం కాదు గానీ బద్రయ్యా! సంఘటన జరిగిన వెంటనే స్పందించి బాధ్యత తీసుకున్నారు ప్రతిపక్ష నేత..అందుకు మెచ్చుకోవాలి..."

"సర్లేగానీ మేస్టారూ! ప్రతి చిన్న విషయానికీ రాష్ట్రం నాశనమౌతోందంటూ ఏదో కొంపలు మునిగినట్లు ఊగిపోయే మరో నేత ఇంత పెద్ద దుర్ఘటనల్ని టేకిట్ ఈజీగా తీసుకున్నారా ఏంటి మాస్టారూ..ఏం స్పందించట్లేదు? దానిక్కూడా ఏవ్వాల్నా!" అడిగాడు బద్రయ్య.

"ఆయన పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారు..ఒక్క ప్రభుత్వ తప్పులపైనే వెంటనే స్పందిస్తారు..మిగతా పార్టీల తప్పులపై ఆచి తూచి మాట్లాడతారు.. ఆయన తీరు ఆయనది... ఆయన మార్గంలో ఆయన వెళుతున్నారు.. వెళ్ళనీ..నచ్చినోళ్ళు ఓటేస్తారు..నచ్చనోళ్ళు వదిలేస్తారు.." చెప్పాడు రామకోటయ్య.

"మేస్టారూ! ప్రతిపక్ష నాయకుడికి నలభై ఏళ్ళ అనుభవముంది. ఇన్నాళ్ళుగా పెట్టిన సభల్లో జరగనిది ఇప్పుడే ఇలా ఎందుకు జరిగిద్ది...ఇందులో ప్రభుత్వం కుట్ర వుండేమోనన్న అనుమానం వుందంటున్నారుగా ప్రతిపక్షం వాళ్ళు" చెప్పాడు ఈరయ్య తడుముకోకుండా.

"ఈరయ్యా! తప్పు జరిగినప్పుడు ఒప్పుకుంటే అది తప్పు చేసిన వారికి ప్లస్సే అవుతుంది. అలా కాకుండా దాన్ని ఇంకొకరికి రుద్దాలని చూస్తే అది ఎవరైనా భవిష్యత్తులో వారికే నష్టం. ప్రజలు కూడా ఇంతకు ముందులా లేరు.. ఎడ్యుకేట్ అవుతున్నారు..వారు అన్నీ గమనిస్తారు. బుకాయిస్తే ఏ పార్టీనైనా తప్పక ఇంటి మార్గం పట్టిస్తారు.." చెప్పాడు రామకోటయ్య.

"అసలు ఇలాంటి సభలు పెట్టుకుంటానికి విశాలమైన మైదానాలు ఏర్పాటు చేసుకుంటే ఎవరికీ ఇబ్బంది వుండదు కదా మేస్టారూ!" అన్నాడు బద్రయ్య.

"కరెక్టుగా చెప్పావు బద్రయ్యా! ఈ విషయంలో మన తెలుగువాళ్ళకి సరైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదు. ఏవేవో వున్నాయి కానీ వాటిలో అరకొర సదుపాయాలే వున్నాయి..దాంతో ఈ ఇబ్బందులు తప్పటం లేదు"

"అసలు మనకి ఎక్కడెక్కడ మైదానాలున్నాయి మేస్టారూ" అడిగాడు ఈరయ్య ఆసక్తిగా.

"మన తెలుగువాళ్ళకి సభల కోసం మంచి మైదానాలెక్కడ తగలడ్డాయి...చలం మైదానం తప్ప.." అన్నాడు రామకోటయ్య.

అర్థంకాక ఇద్దరూ తలలు పట్టుకున్నారు.

★

మన సంతోషాన్ని నలుగురితో పంచుకోవడమే సంక్రాంతి

మన సంప్రదాయాల్ని గుర్తుచేస్తూ ప్రకృతికి, మానవునికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని సూచిస్తూ తెలుగుదనం ఉట్టిపడేలా జరుపుకునే సంక్రాంతి పండుగ. అలాగే మన తెలుగు సంస్కృతీ ప్రతిబింబాలను ప్రతీకలుగా విలసిల్లే పండుగల్లో విశిష్టమైనది సంక్రాంతి. మన పండుగలన్నింటిలోకి అటు సాంస్కృతీపరంగానూ, ఇటు ఉత్సాహపరంగాను జరుపుకునే మూడురోజుల పండుగ. మొదటి రోజు భోగి పండుగ నాడు యువకులు భోగిమంటలు వేయడం కోసం కలప సిద్ధం చేసే హడావుడిలో ఉంటారు. మంచు కురిసే శీతాకాలం ఉషోదయపు వెలుగులో, తెలుగువారి వాకిట్లో తళుక్కుమని మెరిసే భోగిమంటలు సందడి, భోగభాగ్యాల సవ్వడి. ఆరోజే పిల్లలకు భోగి పండ్లు పోస్తారు.

ఇక రెండోరోజు మకర సంక్రాంతి, సూర్యభగవానుని పరిభ్రమణం ఆధారంగా ఏర్పరచుకున్న పర్వదినం ఈ సంక్రాంతి. అవిశ్రాంతంగా పరిభ్రమించే సూర్యుడు, దక్షిణ ఆయనం పూర్తి చేసుకొని ఉత్తర ఆయనానికి నాందిగా జనవరిలో మకర రాశిలోకి సంక్రమించే పుణ్యకాలమే మనకు గర్వమైన సంక్రాంతి పర్వదినంగా రూపొందింది. ఆ రోజునుంచి హైందవ సంప్రదాయం ప్రకారం అత్యంత శుభదాయకరమైన సమయమని చెబుతారు. పితృదేవతలకు పిండి వంటలు, కొత్త బట్టలు నైవేద్యంగా సమర్పిస్తారు. ఇలా చేయడం వలన పితృదేవతలు తృప్తి పడతారని గట్టి విశ్వాసం. ఈ విధంగా పెద్దలకు భక్తి ప్రపత్తులతో నైవేద్యం సమర్పించుకోవటం సంక్రాంతి ప్రత్యేకత.

మూడో రోజు కనుమ పండుగను పశువుల పండుగ అని కూడా పిలుస్తారు. ఏడాదిపాటు తమకు పాడి పంటలకు సహకరించిన పశువులకు రైతులు కృతజ్ఞతలు తెలియజేసే పండుగ. ఈ పండుగను గ్రామాలలో చాలా సందడిగా చేస్తారు. వ్యవసాయానికి తమకు ఎంతో చేదోడు, వాదోడుగా ఉన్న ఆరోజు పశువులను బాగా శుభ్రంగా కడిగి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజించడం ఆనవాయితీ. పశువుల మెడకు గంటలు, కాళ్ళకి గజ్జలు కట్టి పందెంలో పాల్గొంటారు. అలంకరించిన పశువులను వీధుల్లో ఊరేగిస్తారు.

సంక్రాంతి నెలంతా స్త్రీలు ఇంటి ముందు పేడతో కళ్లాపుజల్లి, రకరకాల రంగవల్లులు తీర్చి దిద్దడం గ్రామాల్లో సందడికి అంతే వుండదు. ప్రతిరోజూ కొత్తకొత్త ముగ్గుల్ని నేర్చుకొని వేస్తారు. ఎంతో శ్రద్ధగా, దీక్షగా చుక్కలు పెట్టి ఏమాత్రం వంకరలు లేకుండా జాగ్రత్తగా కలుపుతారు. ముగ్గు మధ్యలో ఆవు పేడతొ గొబ్బెళ్ళు పెట్టి పసుపు, కుంకుమ అద్ది గుమ్మడి పువ్వు గుచ్చి మురిసిపోతారు మహిళలు. ధనుర్మాసం ఆరంభం నుంచి పండుగ వెళ్ళేదాకా ముచ్చటైన ముగ్గులు కనువిందు చేస్తాయి. కాలంలో ఎన్ని మార్పులొచ్చినా, ముంగిళ్ళలో ముగ్గుల సంస్కృతి మాత్రం చెక్కు చెదరలేదు. 'డూడూ బసవన్న' అంటూ గంగిరెద్దులాడించే వాళ్ళు, "హరిలో రంగ హరి" అంటూ హరిదాసులు పాడే పాటలతోనూ ఈ పండుగ ఎంతో సందడిగా వుంటుంది. ప్రజాహృదయాలను స్పందించేజేసే అనేక కళారూపాలు, ప్రదర్శనలు ఈ పర్వదినాలలో చోటు చేసుకుంటూ ఉంటాయి. పిల్లలు ఎగిరేసే గాలి పతంగాల కేరింతలు, గంగిరెద్దుల ఆటలు, గొబ్బెళ్ల పాటలు, కోడిపందాలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతాయి. సంక్రాంతి అంటే మన సంప్రదాయాన్ని మరచిపోకుండా గుర్తు చేసుకోవడం. మన సంతోషాన్ని నలుగురితో పంచుకోవడం.

-కాయల నాగేంద్ర, 85002 86697

● సీరియల్

6వ భాగం

ఏదో ఒకనాడు

డా॥నందమూరి లక్ష్మీపార్వతి



(గత సంచిక తరువాయి)

ఆమె కళ్ళల్లో దయ-జాలి కన్పిస్తున్నాయి - నా కళ్ళల్లో ఏం కన్పిస్తున్నదో ఆమె చెబితే బాగుండును. ఇంతవరకు నా ముఖంలో ఫీలింగ్స్ ఎలా వుంటాయో ఎవ్వరూ చెప్పలేదు- అసలు భావాలు పలుకుతున్నయ్యా? లేదా? ముఖ్యంగా నా కళ్ళల్లో.

ఒకవేళ అటువంటి వేవైనా కనపడతాయని ఎవరైనా చెబితే నా ఫీలింగ్స్ ద్వారా నా పనులు జరిపించుకోవచ్చు- ఆ నల్ల వెధవ మాట విననప్పుడు కోపంగా చూడవచ్చు- మరో అవసరానికి మరో ఫీలింగ్. సగం పనులు నెరవేరతాయి- ఈమె అలాగే చూస్తున్నది. పెద్ద గుడ్ల నుండి తెల్లగా శనగగింజంత కన్నీటి బొట్లు రాలుతున్నాయి- సందేహం లేదు. ఈమె నా కోసమే ఏడుస్తున్నది- అలా అనుకుంటే గుండెల్లోకి కొత్త భావమేదో వచ్చి చేరినట్లనిపిస్తున్నది- అది గుండె అంతా పర్చుకుని ఓదారుస్తున్నది- అలాగే చూస్తున్నాను- బహుశా నాకంటి వెంట కూడా నీళ్ళు వచ్చాయనుకుంటా - ఆమె తన చీరె చెంగుతో తుడిచింది- అంతేకాదు నల్ల కుర్రాడికి పురమాయించి స్టవ్‌మీద వేడినీళ్ళు కాయించి అందులో కొంచెం సబ్బునురగ కలిపి తన చెంగును ముంచి నా ముఖం మెడలు- గుండె- చేతులు శుభ్రంగా తుడిచింది. వెచ్చటి నీటి స్పర్శతోపాటు మంచి వాసన వస్తున్న సబ్బునురగ- ఎన్నాళ్ళ తర్వాతో స్వర్గం అంచులు చేరుకున్నట్ట నిపించింది- నీటి వల్లా లేక ఆమె కొంగువల్లా తనకింత హాయి కలుగుతున్నది. లేక దానివెనక అమృతం నిండిన ఆమె హృదయ స్పందనా? ఏది ఏమైనా ఈ నరకంలో స్వర్గాన్ని చూపించింది- ఎవరు తల్లీ- నువ్వు- ఎన్ని జన్మల నుండి నా కోసం ప్రయాణిస్తున్నావో కాని ఈ అంత్యదశలో ఇప్పుడు చేరుకున్నావు- ఇలాగే నా దగ్గర వుండిపోకూడదూ- నా హృదయం మూగగా ఆమెను అర్థిస్తున్నది- ఆమె అదేమీ పట్టించుకోకుండా తన హాండ్‌బ్యాగ్‌లో నుండి ఒక స్టీలు డబ్బా బయటకు తీసింది- అది మూత విప్పగానే ఆ పదార్థం సువాసనలు గదంతా వ్యాపించాయి- ఏదో స్వీట్‌లాగుంది- దాన్నిండా జీడిపప్పు- కిస్‌మిస్ కన్పిస్తున్నాయి- నోరూరింది- స్వర్గం చేరుకోవటమే కాదు అమృతం కూడా ఆరగించాలని ఈరోజు నా నుదుటిన రాసినట్లున్నది-

ఆమె స్పూన్‌తో బయటకు తీయగానే అర్థమైంది. అది గాజర్ హల్వా అని - నాకు ఎంతో ఇష్టమైన స్వీట్ - ఆమె ప్రేమగా తిన్పిస్తుంటే ఎంత తిన్నానో నాకే తెలియలా- డబ్బా అంతా ఖాళీ అయ్యాక తెల్సింది- వెంటనే నీళ్ళలో మూతి కడిగి తన కొంగుతోనే తుడిచింది- అది కొంగు కాదు- నా ఆనందాలకు విందు అన్పించింది-

ఆమె మళ్ళీ బ్యాగులో నుండి ఒక చిన్న పోలిథిన్ కవరు బయటకు తీసింది. దానిలో కూడా హల్వానే వుంది- అది నల్ల కుర్రాడిని పిలిచి వాడి చేతిలో పెట్టింది- వాడు పళ్ళన్నీ కన్పించేటట్లు ఒక్క నవ్వు నవ్వాడు- ఆ మసక చీకట్లో కూడా వాడి పళ్ళు తెల్లగా మెరుస్తూ కన్పించాయి-

ఒక్కసారి ఆమె కళ్ళు గదినంతా పరిశీలించాయి. బాధతో ఆమె ముఖం ముడుచుకుంది- ఏదో చిన్నగా గొణుక్కుంది- తరువాత నా వైపు తిరిగి - నాకు అంతా తెలుసు- భగవంతుడు మిమ్మల్ని శిక్షించాడో లేక పాపం నుండి రక్షిస్తున్నాడో నాకు తెలియదు కానీ ఇలా మాత్రం కాకూడదు. విధిని నేను మనస్ఫూర్తిగా నమ్ముతాను- అది చేసే పనులకు నా జీవితం కూడా ఎలా బలయ్యిందో- నీది కూడా అంతే. ఆ రోజుల్లో నీ మీద చాలా కోపం వుండేది- నిజానికి నీ స్వార్థం వల్లనే నా కుటుంబమంతా బలైపోయింది- నా భర్త మరణించాడు. నేను ఎన్నిసార్లు వచ్చినా నీ మనుషుల్తో గెంటించావు- నీ అభివృద్ధి సోపానంలో పైకి ఎదగటానికి నేను అడుగున వుండిపోవాల్సి వచ్చినా నిన్ను ద్వేషించలేదు- నువ్వు సొంతం పైకి ఎక్కిపొయ్యావు- నేను మాత్రం నీ కాలిదెబ్బలు తినితిని పూర్తిగా పగిలిపోయాను- నా కుటుంబమనే పాలకుండ నా కళ్ళముందే బద్దలైపోయింది- నా పిల్లల్ని చదివించుకోవటానికి చివరికి నువ్వు చూపిన దారే నాకు అఖరకొచ్చింది- ఇల్లాలిగా చచ్చిపోయి వేశ్యగా అవతారమెత్తాను- నీ దగ్గరున్నప్పుడు ఖరీదైన మనిషిని- గౌరవం వున్న ఇంటి ఇల్లాలిని కూడా- నీ వ్యాపారం పెరిగింది- నా వ్యక్తిత్వం తరిగింది - చివరకు బజారులో...

ఆమె ఆపుకోలేక ఒక్కసారి పెద్దపెట్టున ఏడ్చింది-

అప్పటిగ్గానీ నా జబ్బు బుర్రకు ఆమె ఎవరో అర్థంకాలా- ఆమె... లలితా చౌదరి కదూ- అరె- ఆమె అందమంతా ఏమయింది-

ఆంధ్రప్రదేశే నాకు ముఖ్యం.
మరో రాష్ట్రం, మరో పార్టీ అంటూ
చంద్రబాబులా నేను పక్క చూపులు
చూడను. నేను ఇక్కడే వుంటాను.
5 కోట్ల మంది ప్రజలే నాకు ముఖ్యం.
-ఏపీ ముఖ్యమంత్రి
వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి

పాపం అందరూ దోచేసి వుంటారు- కుక్కలు పీకేసిన ఎంగిలి విస్తరిలా కన్పించింది- ఆమె అన్న మాటల్లో ఒక్క అసత్యం లేదు- అన్నీ నిజమే- తన వల్ల ఆనందంగా పరువుగా బ్రతుకుతున్న ఆమె జీవితం ఇలా అయింది- ఏభై ఏళ్ళకే ముసలితనం వచ్చింది- అసలు మనిషి గుర్తించనంతగా ఎలా మారిపోయింది - పిచ్చిది. ఇంకా విధి చేసిన పొరపాటు అని సరిపెట్టుకుంటున్నది - ఈమె జీవితానికి విధి నేనే -నేను రాసిన పిచ్చిరాత ఆమెను ఉన్నత శిఖరాల నుండి ముళ్ళ కంపలోకి త్రోసింది- వంటి నిండా గాయాలే- జీవితం నిండా మరకలే- తను మాత్రం పెద్ద మనిషిలా చెలామణి అయ్యాడు- తన కుటుంబం మాత్రం పెద్ద పెద్ద వ్యక్తులకు ఆతిధ్యమిచ్చే స్థాయికి ఎదిగింది- తనతో వియ్యమందటానికి కోటీశ్వరులు పోటీ పడ్డారు- పరువు అనే బురఖా కప్పుకున్న పెద్ద క్రిమినల్ తను - తన మూలంగా ఆరిపోయిన కుటుంబాలు-ఉద్యోగాలు పోగొట్టుకుని ఉరేసుకున్న వ్యక్తులు- తన కుట్రవలన నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డ ఫైనాన్స్ కంపెనీల యజమానులు- తన పేపర్లో రాసిన రాతల వల్ల ఎంతమంది ఆడపడుచులు- రాజకీయ నాయకులు అన్యాయంగా చనిపోయారో. వినగలిగితే వాళ్ళ ఆత్మలన్నీ ఈ గదిలో తన మంచం చుట్టూ ఘోష పెడుతున్నాయి. అన్నింటినీ మించి ధనంజయరావు మరణానికి కారకుడు తాను కాదా- ఇలా మంచివాళ్ళందరి వుసురు పోసుకుని పెంచుకున్న తన పరపతి ఏమయ్యింది- కొడిగట్టిన దీపంలా రేపోమాపో అంటున్నది- పరపతిని నిర్ణయించిన తన అంతస్తు మురికి కాలవలో పడి దొర్లాడుతున్నది అందర్ని నాశనం చేసిన తనా గౌరవనీయుడు- ప్రేమకోసం జీవితాన్ని పోగొట్టుకుని కూడా మళ్ళీ ఆదరించటానికొచ్చిన ఈ మహనీయురాలా గౌరవనీయురాలు- సమాజం ఏ కళ్ళతో ఈ గౌరవాలను గుర్తిస్తున్నదో ఇప్పటికి అర్థంకాదు- వేమన చెప్పినట్లు- మేడిపండు పైకి బాగా ఎర్రగా అందంగా కన్పిస్తుంది- కానీ లోపల- అన్నీ పురుగులే- మా గొప్పోళ్ళ జీవితాలు కూడా చాలవరకు అంతే- మా డబ్బు మాటున- మేం వేసుకున్న దుస్తుల మాటున, తిరిగే కార్ల వల్ల చాలా గొప్పగా కీర్తించబడతాం - ఆ పరదా విప్పితే తెలుస్తుంది- మా నీచమైన జీవితాలు ఎలా పురుగులు పట్టి లుకలుకలాడుతుంటాయో- ఛీ...ఛీ...

ఆమె చెయ్యి చల్లగా నా నుదుటిని తాకటంతో గొప్పోళ్ళను అసహ్యించుకుంటున్న నా మనస్సు డ్యూటీలో కొచ్చినట్టు ఆమె ముందు కొచ్చి నిలబడింది - అన్నానని బాధపడుతున్నారా? మరి ఎవరికి చెప్పుకోను- సమాజంలో అందరూ నన్ను వెలేసారు. నా పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యటం కూడా కష్టమై పోయింది- వున్నత కులంలో పుట్టి కూడా సాటి కులస్థులు ముందుకు రాలేదు-చివరకు నా కొడుకు ఒక మాలమ్మాయిని- నా కూతురు ఒక ముస్లిం కుర్రాడిని ప్రేమించి చేసుకున్నారు- ఆ కులాలు గౌరవించినట్టు కూడా మన కులం గౌరవించలేదు- అసలు మనిషిగానే చూడలేదు- తప్పంతా నా తల మీదకు ఎత్తారు- దానికి కారకుడైన నిన్ను వాళ్ళ తలమీద పెట్టుకున్నారు- అసలు స్త్రీ అంటే ఈ సమాజానికి నీవంటి వాళ్ళకు ఎందుకంత చులకన? బహుశా ఇందులో నా తప్పు కూడా వుంది- వయస్సు మదంతో జర్నలిజంపై మోజుతో నిన్ను ప్రేమించాను-పాతాళంలోకి దిగజారిపోయాను- నన్ను సరే పడుపు వృత్తిలోకి దించి నాశనం చేసావు- మరి శారద తప్పేంటి? ఆమె ధనంజయరావును పెళ్ళి చేసుకోగూడదా- ఆయనకు అండగా నిలబడటమేనా ఆమె చేసిన తప్పు- ఆ నీచుడితో చేతులు కలిపి ఆమె బ్రతుకును బండలు చేసావు- కష్టపడి సాధించుకున్న వాళ్ళ అధికారాన్ని లాక్కున్నారు. ఆయన మరణానికి కారకుడివయ్యావు - చివరకు ఇదంతా ఆమె తప్పేనని ఆమె మీదకు తోసేసారు. ఏమిటీ అన్యాయం? ఇతరుల జీవితాలతో ఆడుకునే అధికారం మీకెవరిచ్చారు? మీ కంటె పురాణకాలంలో రాక్షసులు నయం కదూ - ఛీ...ఛీ... ఎంత పాడు మనుష్యులు- చివరకు ఈ కులం, సమాజం మీదే అసహ్యాత వచ్చేటట్లు చేసారు- అయినా... ఎక్కడో స్త్రీ కోణంలో నుండి ఆవిర్భావమవుతున్న ప్రేమ అనే మూల భావం ఇప్పటికీ నిన్ను పూర్తిగా ద్వేషించలేకపోతున్నది- బహుశా అంత ప్రేమించానేమో? లేక మీవంటి వాళ్ళను అసహ్యించుకోవటం లేదంటే కారణం ఏమిటి? ఒకటే అనుకున్నాను- మీలాంటి వాళ్ళను ఈ సమాజం ఎప్పుడూ శిక్షించదు- దాని బలహీనతలు దానివి- పరస్పరాశ్రయాలు మీ జీవితాలు- అందుకే ఒకళ్ళకొకళ్ళు కావాలి- మాలాంటి డబ్బులేని- అండలేని- అందునా స్త్రీలమై వున్న మాకెవరిస్తారు గౌరవాల్ని- అయినా అన్నిటిని మించిన సూపర్ పవర్ ఆ దైవశక్తి- అది మీకు పూర్తిగా పనిష్మెంట్ ఇస్తుందనే నమ్మకంతో బ్రతికా - నా నమ్మకం వృధా కాలేదు- మీరు శిక్షించబడ్డారు- వూహించనంత ఎక్కువగా హీన జీవితం గడుపుతున్నారు- ఏ సమాజమూ ఇవ్వలేని ఈ శిక్ష ఆ విధి ఇచ్చింది- దాని జడ్జిమెంట్ చాలా గొప్పది- ఏ ప్రలోభాలకు లొంగనిది కదా- అందుకే అంత బాగుంది- ఇప్పుడు నా మనస్సు ప్రశాంతంగా వుంది- కోపం స్థానంలో మీ మీద సానుభూతి వచ్చింది- అందుకే వచ్చాను- ఇక మీదట కూడా వస్తాను- మీరు అనుమతిస్తే ఇక్కడే వుండి మీకు సేవ చేయాలని వుంది- మీ కొడుకులు అంగీకరించరు- మురికి జీవితంలో వున్నా వాళ్ళు గొప్పవాళ్ళే. సమాజం వెలివేయని వాళ్ళే- అందువలన ఇప్పటికీ నా స్థాయి సరిపోదు- నన్ను చూస్తే గజ్జి కుక్కను తరిమినట్టు తరుముతారు- నేను ఈ కుర్రాడి ఫోను నంబరు తీసుకున్నా- ఎప్పుడైనా

రావాలంటే ఫోన్ చేసి వస్తా- ఆమె నా నుదుటితో పాటు చెంపలు నిమిరింది- గుండెమీద చెయ్యి వేసి సరిచేసింది- ఆ పైన లేచి నిలబడింది.

అయ్యో- వెళ్ళిపోతున్నావా- నా ఆనందాన్ని హాయిని తీసుకుని వెళతావా- ఎవరిచ్చారీ అధికారం- చీకట్లో చిన్న దీపంలా వచ్చి మళ్ళీ అంధకారాన్ని మిగులుస్తానంటున్నావు- వద్దు లలితా వెళ్ళొద్దు- నిజమే నేను పాపాత్ముణ్ణి, దుర్మార్గుణ్ణి- నన్ను కొట్టు- చంపు- నువ్వు మాత్రం వెళ్ళొద్దు- ఈ చివరి దశలో నీ తోడు చాలా అవసరం- అలా నీ మాటలు వింటూ- నీ స్పర్శను అనుభవిస్తూ ఈ నాలుగు రోజులు గడపనీ- లలితా నువ్వు చెడ్డదానివి కాదు- మంచిదానవు- నా కంటె- ఈ సమాజం కంటె గొప్పదానివి- ప్రేమ మూర్తివి-

ఎంత మనస్సు ఆక్రోశించినా ఆమె వుండలేదు- వెళ్ళిపోయింది. తన మూగభాష అందించే సాధనమే తన దగ్గర లేదా? తనకు తాను చెప్పుకున్నట్లు ఎన్నాళ్ళీ అంతరంగ శోధనం- భగవంతుడా- ఎటువంటి శిక్ష విధించావో ఇప్పుడర్థమవుతున్నది. నాకూ బయటి ప్రపంచానికి అనుబంధం తెగిపోయినట్లే- ఆశ్చర్యంగా వాళ్ళ మాటలు వినబడుతున్నాయి- మనస్సు గ్రహిస్తున్నది- లోపల దానికి తగినట్లుగా ఫీలవుతున్నది- కాని ఏ విధంగానూ నా ఆలోచనల్ని బయటికి అందించలేక పోతున్నాను- అందుకే నా బాధ ఎవ్వరికీ అర్థం కావటం లేదు- దీని కంటె చావు నయం కదూ- బహుశా ఈ మాట ఇప్పటికి లక్షోసారి అనుకుని వుంటాను- కానీ అది కూడా చాతకాని నిస్సహాయ స్థితి- మనిషి అహంకారాన్ని- తప్పుల్ని రోగాలు ఇలా అదుపులో పెడతాయనుకుంటా- లేకపోతే వీడు మొత్తం సృష్టినే ఈ పాటికి నాశనం చేసి వుండేవాడు- మనిషిని ఆడిస్తున్నది డబ్బే కదూ- తన వునికి కోసం ఏ కొంచెమో ఆధారంగా వుండాల్సిన ధనం తనే సర్వస్వమై అతని ఉనికి అల్పమై ఏ సంబంధాలతో పోలిక లేని విధంగా దిగజార్చేసింది- కాదు. తనకు తనే దిగజారాడు- ఒక చిత్తు కాగితంకున్న విలువ తల్లిదండ్రులకు లేదు. అన్నదమ్ములు- అక్కచెల్లెళ్ళు- ఎవ్వరికీ లేదు- నా కొడుకుల్ని- ధనంజయరావు కొడుకుల్ని చూస్తే బాగా అర్థమవుతున్నది- అసలు అంత డబ్బు సంపాదించి ఇవ్వటం తప్పేమో- గొప్ప పేరు సంపాదించుకున్న వాళ్ళంతా తింటానిక్కూడా లేని పేద కుటుంబాల నుండి వచ్చిన వాళ్ళే-శారద ఏ ధనవంతుల ఇంట్లో పుట్టింది? చాల పేదవారుకదూ- వాళ్ళ నాన్న ఏదో పని చేస్తుండే వాడనుకుంటా. అదేంటో గుర్తు

రావటం లేదు- ఏదో పనిలే- ప్రతిదీ గుర్తు పెట్టుకోవటానికి నేను కంప్యూటర్నా. దానిక్కూడా లోడ్ చేసిన విషయాలే వుంటాయి అంతకంటె మనిషి బ్రెయినే గొప్ప కదూ- ఏ అరకా అర సిస్టమాటిగ్గా పని చేస్తుంటుంది- ఎన్నో విషయాలు డౌన్‌లోడ్ చేసుకుంటుంది- తనకు కంప్యూటర్ టెక్నాలజీ అంటే ఇష్టం- అందుకే రాంబాబు ముఖ్యమంత్రి కాగానే ఐ.టి. రంగానికి ఎక్కువ ప్రోత్సాహమివ్వమని చెప్పాను- దాంతో వాడు మరీ రెచ్చిపోయాడు- రాష్ట్రంలో కంప్యూటర్ తప్ప మరో రంగం లేకుండా చేసాడు- పర్యవసానం వేలమంది రైతులు- నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మామూలు డిగ్రీ చదివిన వాళ్ళంతా వుద్యోగాలు లేక రోడ్లమ్మట తిరిగారు- వీడేదో అమెరికాలో పుట్టినట్టు వ్యవసాయాన్ని దూరం పెట్టాడు- దానికితోడు ఒక్క చుక్క వాన కురవలా.. శాపం పెట్టినట్టే వాడు వున్నన్నాళ్ళు వాన దేవుడు పారిపోయాడు- అప్పుడెప్పుడో రాముడున్నప్పుడు నెలకు మూడు వానలు కురిసాయట. నిజంగా ధనంజయరావు పాలనే పాలన- అతని హయాములో పేద వర్గాల కాలే కడుపులకింత అన్నం పెట్టాడు- అదేంటో మంచి పనికి తోడుంటామని ఒకటే వర్షాలు కురిసి పంటలు బాగా పండాయి- ఆ దరిద్రపు రాంబాబు పోగానే రాయలరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు- మళ్ళీ వరుణ దేవుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. ప్రకృతి ఎవరి మీద కోపగించిందో- ఎవరిని ఆశీర్వదించిందో ఇంతకంటె సాక్ష్యం ఏం కావాలి- మంచి పనుల్ని ప్రజలే కాదు ప్రకృతి కూడ

రచయిత్రి
ఆంధ్రప్రదేశ్ తెలుగు & సంస్కృత అకాడమీ అధ్యక్షులు

ఏదో ఒకనాడు

మెచ్చుకుంటుంది- తెలుగు జాతి వున్నంత కాలం వాళ్ళిద్దరిని మర్చిపోరు- వీడు అన్నాళ్ళు వుండి సాధించిందేమిటి? వాడు సంపాదించుకోవటం తప్ప- చేసింది ఇంత, చెప్పుకునేది అంత- ఏం చేసినా చెయ్యకపోయినా మీడియాను బాగా మానేజ్ చేసాడు-

ఒక నిట్టూర్పు గొంతులో నుండి వచ్చినట్లుంది- నల్ల కుర్రాడు నేలమీద చాప పర్చుకుంటున్నాడు- వాడు నోట్లో నుండి ఏదో పాట విన్పిస్తున్నది- వాడికి సినిమాల పిచ్చి బాగా వుంది- తనను చూడటానికి వచ్చిన వాళ్ళంతా వాడి చేతిలో పదో పరకో పెడుతుంటారు- ఇక వీడు సెకండ్ షోలకు చెక్కేస్తుంటాడు- అప్పుడప్పుడు ఆ సినిమా కథ నాగ్గూడా విన్పిస్తుంటాడు- పాటలు పాడుతుంటాడు- పాపం వాడి జీవితం తల్చుకున్నా జాలేస్తున్నది- ఇటువంటి పనికి ఒప్పుకున్నాడంటె వాడి పరిస్థితేమిటో అర్థమవుతూనే వుంది- వాడు కూనిరాగం తీస్తూనే వున్నాడు- వాడు పాడేపాట ఏమిటో బహుశా వాడిక్కూడా అర్థంకాదు- ఎందుకంటె ఏ పాటా సరిగా పాడలేడు- ఒక్కోసారి రెండు మూడు పాటలు కలిపి పాడేస్తుంటాడు- దానికి తోడు శ్రుతీ మతీ లేని గొంతు- పాడొద్దురా అని చెప్పాలనిపిస్తుంది కానీ ఆ అపశ్రుతి పాట కూడా రానురానూ తనకు ఇష్టమే అయ్యింది- తన నడక లేని జీవితంకంటె అదే బాగుంటుందనిపిస్తుంది- ఏ మాత్రం కదలికలేని జీవన చాలనత్వానికి అతని గొంతులోని చలనం కొంచెం వుత్సాహాన్నిస్తుంటుంది- గమ్యం గమనం ఏదీ లేని తన బాటలో అతని గొంతు శ్రావ్యంగానే అనిపిస్తుంది- ఈ రోజు ఏదో పాత పాట పాడుతున్నాడు- 'ఏటిలోని కెరటాలు ఏరు విడిచిపోవు, ఎద లోపలి మమకారం ఎక్కడికీ పోదు...' చాలా బాగుందనిపించింది. మనసు ఆస్వాదిస్తున్నది- అతని గొంతు పరిధి దాటి భావాన్ని మనసు ఆస్వాదిస్తున్నది. ఇది యన్టీఆర్ సినిమా లోదా? ఏయన్నార్ సినిమానా? గుర్తు రాలేదు- ఘంటసాలా- బాలూనా- వూహు... తన మెదడులో ఇంకా ఆ అర తెలుచు కున్నట్టు లేదు- తనకు ఎన్టీఆర్ సినిమాలంటే ఇష్టం. చిన్నతనంలో వరసపెట్టి చూసేవాడు- ఎంతందంగా వుండేవాడు-

ఒకసారి తన ఇంట్లో ఫంక్షన్‌కు ఆహ్వానిస్తే వచ్చాడు- దగ్గరగా అప్పుడే చూసాడు- మగవాళ్ళకే మతిపోయేంత అందం- దేనికయినా పెట్టిపుట్టాలి- అందమూ- నటనా ఆయనకే సొంతం-

-ఇంకావుంది



హాస్యబా(హో)ణం

అవునా?

47

జంధ్యాల రఘుబాబు

మొబైల్ : 9849753298

నీ వెన్నంటే ఉంటా... ఎక్కడికీ పోను, ఎప్పుడూ విడిపోను, కలలో కూడా నీ వెంటే ఉంటా.. ఈ డైలాగు చూస్తే ఏదైనా ప్రేమకథ చదూతున్నామా అని ఎవరికైనా అనుమానం రావచ్చు. ఎందుకంటే రాసిన విషయం, పద్ధతి అలాగుంది మరి. లేదా ఇద్దరు స్నేహితుల మధ్య ఉండొచ్చునని ఈ మాటలని కొంత వయసు మీదపడ్డవారు అనుకోవచ్చు. మనమేమీ ఎన్టీ రామారావో, ఏయన్నారో కాదు లేటు వయసులో కూడా పైన చెప్పిన మాటలు, అలాంటి పాటలు పాడుకోడానికి. కఅకది కవేకరే కవికషకయం అంటే అది వేరే విషయం అని మా చిన్నప్పటి క భాషలోనన్నమాట. అలాగే గ భాష కూడా ఉండేది. ఇప్పుడు తెలుగుకే గతిలేదు మళ్ళీ అందుల్లో క, గ భాషలంటూ తల తింటావెందుకని పిల్లలు అనుకోవచ్చు లేదా డైరెక్టుగా అనొచ్చు. మళ్ళీ వెన్నంటికొద్దాం!!

చిన్నప్పుడు మిత్రులందరం ఒకరి వెన్నంటి ఒకరం ఉంటాం. చుక్ చుక్ రైలు వచ్చింది అందరు పక్కకు జరగండీ అని ఒకరి అంగీ ఒకరు పట్టుకొని ఆడేవాళ్ళం. ఇప్పుడా ఆటలన్నీ సెల్లు వెన్నంటి స్మార్టు ఫోనులోనికి పోయాయి. అలా మనం వెన్ను లేని వాళ్ళుగా మారి సెల్లును అంటిపెట్టుకొని ఉన్నామని నా మిత్రుడంటూ ఉంటాడు!!

వెన్నంటి ఉండేవాళ్ళతో పాటు వెన్నుపోటు పొడిచే వారినీ నిజ జీవితంలో చూస్తాం. వాళ్ళని కనిపెట్టడం కష్టం. ఎందుకంటే వెన్నంటి ఉండేవాళ్ళలాగే ఉంటారు వీరు, వాళ్ళుండే చోటే ఉంటారు. తేడా తెలుసుకోలేం. ఎప్పుడు తెలుస్తుందంటే వెన్నులోకి బాకు దిగినప్పుడే. అప్పుడు కట్టప్పా ఎందుకిలా చేశావని బాహుబలిలా అన్నా, బ్రూటస్ నువ్వు కూడానా అని షేక్స్పియర్ సృష్టించిన జూలియస్ సీజరులా అన్నా ఫలితం ఉండదు.

ఈ వెన్నంటిలోనే వెన్నుదన్నుగా నిలబడ్డమూ ఉంది. ఫలానా వాడు వెన్నెముక లేనివాడూ అనడమూ ఉంది. అసలు జంతువులను వెన్నెముకగల జంతువులుగా, వెన్నెముక లేని జంతువులుగా విభజించారు. ఆ విభజనలోనే మానవులు వెన్నెముక ఉన్న లిస్టులో పడ్డారు. అందుకే అందరూ ప్రతి ఉదయం లేస్తూనే వెన్నెముకగల నేను అని మంత్రివర్గ ప్రమాణ సమయంలోలాగ రోజూ ప్రమాణం చేయాలి. వెన్నెముక గల మానవుల్లా ప్రవర్తిస్తామని. అప్పుడు కానీ ఆ వెన్నెముకకు మర్యాద ఇచ్చినట్టు కాదు. నన్ను వెన్నంటి ఉండేవాళ్ళే లేరు అని ఓ మిత్రుడు బాధ పడితే, నీకు వెన్నెముకే లేదురా ఇక వెన్నంటి ఉండేవాళ్ళు ఎలా ఉంటారు అని ఇంకో మిత్రుడి జోక్. కాబట్టి వెన్నెపూసలాంటి మాటలు నీకొచ్చినా మొదట నీకు వెన్నుపూసలు ఉండి తీరాలి అన్నది అనుభవంలోకి వస్తుంది. మొదట నీవు నిలబడాలి, అప్పుడు నీ వెనుకగా అందరూ వస్తారు.

ఎన్నికలముందు ప్రజలకూ వాగ్దానాలు అందుతాయి. జీవితాంతం మీ వెన్నంటి ఉంటామని, ఎటువంటి కష్టమూ రానీమనీ చెప్తారు. ఎవరి జీవితాంతం? నీదా నాదా? అన్న ప్రశ్న వేస్తే సమాధానం రాదు. ముక్కు మీద చేయి వేసుకొని అవునా అనుకోవాలి. జీవితమంటే అక్కడ కుర్చీలో కూచున్నన్ని రోజులని అంతర్లీనంగా ఉండే అర్థం. వెన్నంటి ఉంటే మరో ఐదేళ్ళు తన జీవితం పొడిగింపు పొందినట్టే. మాట నిలబెట్టుకుంటే వెన్నంటి ఉన్నట్టే లెక్క. అలా కాకుండా లెక్క ఎక్కడుంటుంది అని దానివెంట పడితే లెక్క తప్పినట్టే. లెక్కల సబ్జెక్టులో రకరకాల లెక్కలు ఉన్నట్టే ఈ వెన్నంటివుండే లెక్కలు,

వెన్నంటి ఉండేవాళ్ళతో పాటు వెన్ను పోటు పొడిచే వారినీ నిజ జీవితంలో చూస్తాం. వాళ్ళని కనిపెట్టడం కష్టం.

వెన్నుపోటు లెక్కలు వేరువేరుగా ఉంటాయి. అందుకే ప్రజలకు దగ్గరగా ఉంటేనే వాళ్ళూ వెన్నంటి ఉండేదని చాణక్యుడు చెప్పాడు. నిజంగానే ఆయన చెప్పాడా లేదా అని ఎవరికైనా అనుమానం వస్తే, మా చాణక్యుడనే మిత్రుడొకడున్నాడు ఇది వాడు చెప్పిందే అనంటాను. నిజంగా ఇది మా మిత్రుడు చెప్పిందే. నిజమైన చాణక్యుడు చెప్పి ఉంటే చెప్పి ఉండవచ్చు గాక.

వెన్నంటి ఉండేవాళ్ళ కోసం ఆ విధంగా ముందుకు పోతున్నామని ఒక అన్న అనొచ్చు. నేను చెబుతా ఉన్నా, ప్రజలు మా వెనుకే

వెన్నంటి ఉంటా...

ఉన్నారు అని ఇంకో తమ్ముడు ఉటంకించ వచ్చు. సారీ దేశ్ జనతా హమారా పీఛే హై అని ఓ పెద్దాయన చెబితే, వైసా క్యా... హమారా మీటింగ్ మే సారీ జనతా హమారే సామ్నే హై అని ఇంకో యువనేత అనొచ్చు కూడా. ఏమైనా ప్రజలకు ఎప్పుడు నేతల చెవి పట్టుకోవాలో, ఎప్పుడు చప్పట్లు కొట్టాలో, ఎప్పుడు వెన్నుదన్నుగా నిలబడాలో, ఎప్పుడు వెన్నెముక విరగ్గొట్టాలో బాగా తెలుసునని మా చాణక్యుడు చెబుతూనే ఉంటాడు. ఏమన్నా అంటే సమయం రావాలి బ్రో అనీ అంటాడు.

అసలు గడచిన సంవత్సరం నీకు నీవు వెన్నంటి ఉన్నావా అన్నది నాకు నేను వేసుకున్న అసలైన ప్రశ్న. లేకపోతే ఈసారైనా ప్రయత్నం చేయాలన్నది ముందరున్న సమాధానం.

పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలతో, మీరుండబట్టే, మీరు చదివి వెన్నుదన్నుగా నిలవబట్టే మేము రాయగలుగు తున్నామనీ అందరు రచయితల తరపునా వకాల్తా పుచ్చుకుంటూ నవమల్లెతీగలా మీ జీవితాలు కళకళలాడాలని కోరుకుంటున్నాను. ★

కిటికీ

-జాన్‌సన్ చోరగుడి

రెస్టారెంట్ టేబుల్ వద్ద పేపర్ న్యాప్కిన్‌తో చేతివేళ్ళను తుడుచుకున్నంత తేలిగ్గా రెండేళ్లను 'ఫినిష్' చేయడం అయితే చేసేశాం! 'న్యూ ఇయర్'లో ఆర్డర్ ఇచ్చిన కొత్త 'డిష్' రుచి చూడబోతూ... అది ఎలా ఉంటుందో? అని టేబుల్ వద్ద నాలుక కోసం 'మైండ్' చేస్తున్న కసరత్తు కూడా పసందుగానే ఉంటుంది. అయితే తుడిచేసిన రెండేళ్ల కాలం, నుదిటి మీద విడిచి వెళ్లిన మడతల్ని ఎంత పెద్ద 'టర్కీ టవల్'తో తుడిస్తే మాత్రం అద్దంలో వాటిని కనిపించకుండా చేయగలం?! అయినా, వాడాక అవతల పడేసిన 'న్యాప్కిన్స్' మళ్ళీ చేతిలోకి తీసుకుని, తుడిచేసిన మరకల సమీక్ష కోసం వెతికేంత ఓపిక మనకెక్కడిది? ఉదయం రాసింది సాయంత్రం 'డిలీట్' చేసే రోజుల్లో, నిన్నటి డైరీలో పాత పేజీలు ఇంకా ఇప్పుడు ఎక్కడివి?!

మరి... 'ఎడిటింగ్' ఎవరు చేయాలి?

నిజమే అప్పట్లో అంతా కొత్త. పైగా 'ఉందిలే మంచి కాలం ముందు ముందునా...' అంటూ 'విజన్- 2020' పాట అప్పటికే చాన్నాళ్లుగా పాడుతూ ఉన్నామేమో, ఏముంది ఎప్పటిలా 2019 డిసెంబర్ నుంచి 2020 జనవరిలోకి వెళ్లడమే కదా అనుకున్నాం. కానీ... ఏమైంది? ఝుడుసుకునేట్టుగా గడచిన రెండేళ్ల జ్ఞాపకాలు మిగిలాయి. కొందరిని 'కోవిడ్'లో పోగొట్టుకుని, ఏదో మనం ఇలా మిగిలాము. అది మళ్ళీ వచ్చిందా? వస్తుందా? అనేది పక్కన పెట్టి; దాటొచ్చిన 'కరోనా' కాలంతో పాటుగా మనం వదిలేసింది ఏమిటి? అనేది కదా మనం మాట్లాడుకోవలసింది. ఇప్పుడు ఏమైంది? భయం భయంగా మంచి రోజులు చూసి, ముహుర్తాలు పెట్టడంతో మొదలెట్టి, క్రమంగా జలుబు దగ్గు జ్వరాలు భయం మర్చిపోయి, శ్రావణమాసంలో వేకువజామున చన్నీళ్ళ స్నానంతో పూజల వరకు మనం ముందుకొస్తే; 'మార్కెట్' మరో నాలుగు అడుగులు ముందుకేసి, సంక్రాంతి కోసం 'న్యూ ఇయర్' నాటికి సినీతారలతో కొత్త షాపింగ్ మాల్స్ ప్రారంభించింది. 'మాస్క్' పెట్టినా లేకున్నా వాటినిప్పుడు ఖాళీ లేకుండా క్రిక్కిరిసేట్టుగా చేయడం ఒక్కటే మనం చేయాలిసింది.

ఇటీవల నలుగురు కలిసిన చోట- 'ఏంటి ఏమైంది ఇలా అయిపోయావ్?' అంటే, బదులుగా నిర్వేదపు జవాబులు. నిజానికి ఈ 'కరోనా' కంటే చాలా ముందే మనం ఆరోగ్య స్పృహలోకి బదిలీ అయ్యాము. 'కరోనా'కు ముందు ఉదయం నడక మైదానాల్లో- 'గ్లో గోపాళాలు' కొందరు మీకు కూడా తారసపడే ఉంటారు. ఏమి చేస్తే, అరవైలో కూడా యాభైల్లా 'గ్లో'(మెరుపు)తో కనిపించవచ్చో మతం వేసుకుని మరీ వీరు పాఠాలు చెప్పేవారు. ఇక పుస్తకాల షాపుల వాళ్ళను- 'ఏమిటి సంగతి అంటే?' ఏముంది ఆరోగ్యం, భక్తి ఈ రెండు 'కేటగిరీ'ల్లోనే సేల్స్ అనేవారు. కొందరు పసర్లు అంటే మరి కొందరు పచ్చివి అనేవారు, ఇక పస్తులు సరేసరి. ప్రకృతి వైద్యం అయితే పరాకాష్టకు చేరింది. అడిగేవాళ్ళు లేకగానీ, ఇప్పుడు కొత్తగా ఇలా జీవిత కాలం పెంచేసి, ఇంకా మనం చేయాల్సింది ఏమిటి? అనే ప్రశ్నకు మాత్రం వీరివద్ద సమాధానం ఉండదు. ఇంకా మనమే ఉందాము సరే, మరి మన వెనక వచ్చే తరానికి సరిపడినంత 'ఆపరేషనల్' జాగా మనం వదలాలి కదా? అనే ప్రశ్నకు జవాబు లేకపోగా, పైగా ఏంటి ఈ 'ఓల్డ్ ఏజ్ హోమ్స్' సంస్కృతి అంటూ స్వీయ సంతాపాలు!

"కరోనా వచ్చిందో లేదో నాకు తెలియదు, కానీ ఆరోగ్యంలో ఏదో తేడా మాత్రం కనిపిస్తున్నది పరిస్థితి మునుపటిలా లేదు" కొందరి నిట్టూర్పు. పాపం డాక్టర్లు "మీరు అవుటాఫ్ వారెంటీ పీరియడ్లో ఉన్నారు..." అని ముఖాన చెప్పలేరు. మనం అరడజను సమస్యలు చెబితే, ఓపిగ్గా విని, ఆయన ఏదో ఒకదానికి మందు రాస్తారు. మన



పరిస్థితి ఇలా ఉంటే, పిల్లలేమో తేలిగ్గా 'బై...' చెప్పేసి ఏదో ఒక దేశం ఎగిరి వెళ్లిపోతున్నారు. వాళ్ళ 'ఎడిటింగ్ స్కిల్స్' చూసాక అయినా, మనల్ని మనం ఏమైనా 'ఎడిటింగ్' చేసుకుంటున్నామా అంటే, అందుకు సరైన జవాబు దొరకదు. అందరు మనల్ని నిజంగానే వి.ఐ.పి. అనుకుంటున్న తర్వాత అయినా మనం సోది మాట్లాడ్డం ఆపుతామా? అంటే అదీ లేదు. స్వంత డబ్బా 'డెసిబిల్స్' (శబ్దతరంగాలు) కొంచెం కూడా తగ్గకూడదు.

కాస్త ఆగుదాం, మన ముందే కాదు వెనక వైపుకు కూడా ఇప్పుడు జనాలు చూస్తున్నారు. వున్నవి కదా అనో, లేదా వాళ్ళు అడిగారు కదా అనో, ఏదో ఒక 'ప్లాట్‌ఫార్మ్' మీద మనకు మనమే ఇచ్చుకుంటున్న అవసరాన్ని మించిన 'ఎక్స్‌పోజర్' కారణంగా- '360 డిగ్రీల రాడార్ సెన్సర్' పరిధిలోకి మనం వస్తున్న విషయం మనకు తెలియడం లేదు. 'ఫోటో షాప్'లో మనం చెరుపుకున్న పుట్టుమచ్చలే కాదు; పైకి కనిపించని లోపలివి కూడా వెతికి మరి 'రికార్డు' చేస్తున్నారు. మనం చెప్పేదే కాదు, రాసేది కూడా చదివేవాళ్ళు లేరు, అని తెలిసాక అయినా, మనల్ని మనమే 'సెల్ఫ్ ఎడిటింగ్' చేసుకోవద్దూ?!

★





దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన యువతి

ఈ పోటీ ప్రపంచంలో నేటి యువత బాగా చదవాలి, ఉన్నత స్థాయి ఉద్యోగాలు చెయ్యాలి. అబ్బాయిలైతే మంచి అందగత్తె, అమ్మాయిలైతే మంచి అందగాడు మంచి గుణవంతుడిని పెళ్లాడాలని కలలు కంటుంటారు. దానికి భిన్నంగా దేశం కోసం, రాష్ట్రం కోసం ఏదో చెయ్యాలనే తపనతో అన్ని కోరికల్నీ, జీవితాన్ని త్యాగం చేసిన బంగారు భారతి ఎందరికో ఆదర్శంగా మారుతున్న చరిత్ర ఇది.

వివరాల్లోకి వెళితే.. విజయవాడ ఊర్మిళానగర్‌కి చెందిన భాపతి భారతి బి.టెక్ చదివి రెండేళ్లు అయ్యింది. ఐతే అదే ప్రాంతంలో గాంధీ ట్రస్ట్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నేటి గాంధీ ఆర్ఆర్ నాగరాజన్ ఉపన్యాసాలతో ప్రేరణ చెందిన భాపతి భారతి (23) తాను దేశం కోసం, రాష్ట్రం కోసం తనవంతుగా నిస్వార్థంగా సేవలు చెయ్యాలి నిర్ణయించుకుంది. తన భావాలను తండ్రిలేని ఆమె తల్లితో సోదరునితో చెప్పింది. వారు పెద్ద మనసుతో అంగీకారాన్ని తెలిపారు. ఇక అంతే...నేటి గాంధీని తన తండ్రిలా భావించింది. ఆయన అడుగుజాడల్లో నడుస్తుంది. దేశ రాజధాని ఢిల్లీలో 21 రోజుల పాటు నేటి గాంధీ ఆర్ఆర్ నాగరాజన్‌తో కలిసి 25 మంది ఎంపీలకు వినతిపత్రాలు అందించింది. దేశంలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ వారు అందించిన వినతిపత్రాలు ఎందరో ఎంపీలను ఆలోచింప జేశాయి.

అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదాపై కూడా వినతి పత్రాలు అందించారు. దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో అన్ని రాష్ట్రాల్లో 21 రోజులు పాటుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడానికి వీరిద్దరూ సిద్ధమయ్యారు. ఐతే నేడు ప్రతి మనిషి లోను నేను...నా కుటుంబం...అనే స్వార్థం నరనరానా జీర్ణించుకు పోయింది. తాను ఎదగాలంటే తన పక్కవారిని అణగదొక్కాలనే కుత్సిత ఆలోచనలున్న నేటి సమాజంలో... ఇలా ఓ యువతి ముందుకు రావడం నిజంగా హర్షించదగ్గ విషయమే. ఆమె భావాలను గౌరవిస్తూ ఆమె నిర్ణయాన్ని ఆమోదించడానికి వెనుకాడని భారతి కుటుంబ సభ్యుల సాహసాన్ని పలువురు మెచ్చుకుంటున్నారు.

ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకన్న భారతికి నేటి గాంధీ నాగరాజన్ 'బంగారు భారతి' అని నామకరణం చేశారు. ఈ బంగారు భారతి లక్ష్యం నెరవేరాలని అందరం మనస్ఫూర్తిగా దీవిద్దాం. ★

కలం యోధుడు



ఓ జర్నలిస్ట్ జ్ఞాపకాల పలవరింత

అన్నవరపు బ్రహ్మయ్య

ఈనాడు దినపత్రికలో అనేక మంచి పద్ధతులు వున్నాయి. జిల్లా ఇన్‌చార్జ్‌గా వుండే సబ్ ఎడిటర్ ప్రతి నెల జిల్లా విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి విలేకరులకు దిశా నిర్దేశం చేసేవారు. స్పెషల్ స్టోరీలు ఏ విధంగా రాయాలి, అధికారుల నుంచి ఏ విధంగా సమాచారం రాబట్టాలని తరహా అంశాలపై అవగాహన కల్పించేవారు. నేను నందిగామలో విలేకరిగా పనిచేస్తున్న సమయంలో జరిగిన ఒక సమావేశంలో చల్లపల్లిలో విలేకరిగా పని చేసే నా సహచరుడు నాతో మాట్లాడుతూ విలేకరులలో కొందరికి ప్రమోషన్ ఇచ్చి సబ్ ఎడిటర్లుగా తీసుకుంటాన్నారని, నీకు ఆసక్తి వుంటే డైరెక్టర్‌గారికి లెటర్ ఇవ్వమని చెప్పాడు. నాకు అప్పటికే విలేకరిగా డెస్క్‌లో మంచి పేరు వుండటం వల్ల నేను లెటర్ ఇచ్చిన నెల రోజుల వ్యవధిలో డైరెక్టర్ మోటూరి వెంకటేశ్వరరావు నుంచి పిలుపు వచ్చింది. ఆరు నెలల శిక్షణ అనంతరం ఏదైన జిల్లాకు స్టాఫ్ రిపోర్టర్‌గా పంపిస్తామని చెప్పారు. చాలా ఆనందం వేసింది. ఇంట్లో చెప్పి విజయవాడ వచ్చేశాను.

ఈనాడు వెనుక వుండే పటమటలంకలో రూమ్ తీసుకున్నాను. నేను చేరిన వారం రోజులకే నర్సరావుపేట నుంచి గౌస్ అనే యువకుడు, దర్శి నుంచి మల్లి అనే యువకులు కూడా ట్రైనీలుగా చేరాడు. వారు కూడా నా రూమ్ మేట్‌గా చేరారు.

సబ్ ఎడిటర్‌గా డెస్క్‌లో ప్రవేశించినప్పుడు చెప్పలేనంత ఆనందం కలిగింది. అప్పుడు నాకు సీనియర్లుగా, డెస్క్ ఇన్‌ఛార్జ్‌లు వెల్లంకి అరుణ్ కుమార్, కొమ్మినేని శ్రీనివాసరావులు వున్నారు.(క. శ్రీనివాసరావు తర్వాత కాలంలో హైదరాబాద్ హెడ్ ఆఫీసులో చేరి, ఈనాడు పత్రికలో కీలకంగా మారడంతోపాటు రామోజీరావుకు అత్యంత సన్నిహితునిగా మారారు. ఆ తర్వాత ఈనాడు నుంచి బయటకు వచ్చి ఎబిఎన్-ఆంధ్రజ్యోతిలో చేరారు. ఆ తర్వాత జ్యోతి నుంచి సాక్షి ఛానల్‌కు మారారు.) శ్రీనివాసరావు పనిలో ఎప్పుడూ బిజీగా వుండేవారు, అరుణ్‌కుమార్ మాత్రం సరదాగా

ఉప సంపాదకుడిగా..

వుండేవారు. పని ప్రారంభించడానికి ముందు ఆ రోజు పత్రికలో వచ్చిన వార్తలలో తప్పులు, ఇతర పత్రికలలో వచ్చి మా పత్రికలో రాని వార్తలపై చర్చించడానికి సమావేశం జరిగేది. విలేకరులుగా రెండు, మూడు సంవత్సరాల అనుభవం వుండటం వల్ల నేరుగా ఉప సంపాదకుని సీటులో కూర్చో పెట్టారు. సబ్ ఎడిటర్లు ఇతర ప్రాంతాల విలేకరులు పంపే వార్తలను చదివి అందులో తప్పొప్పులు సరిచేసి వాటిని డెస్క్ ఇన్‌ఛార్జ్‌లకు ఇవ్వాలి. ఆ విధంగా సరిచేసిన వార్తలలో తప్పులను డెస్క్ ఇన్‌ఛార్జ్ గమనించి, విలేకరులు పంపేవార్తలను ఏ విధంగా సరిచేయాల్లో చెప్పడం ద్వారా మాకు శిక్షణ ఇచ్చేవారు. నాకు తెలియని విషయాలు వివరించడంతోపాటు జర్నలిజానికి సంబంధించిన అనేక మెళకువలను వెల్లంకి అరుణ్‌కుమార్ అనే మా సీనియర్‌తోపాటు మా డైరెక్టర్ మోటూరి తెలియ చెప్పారు. అంటే నాకు జర్నలిజమ్‌లో నేను గురువుగా భావించినవారు ఈ ఇద్దరే.

జేబులు కొట్టడానికి....

ఈనాడు పత్రికకు ఆనాడు ప్రతి జిల్లా కేంద్రంలో కార్యాలయం వుండేది. అప్పటికి మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌లు, ఈ మెయిల్ వంటి సదుపాయాలు లేవు. జిల్లా కేంద్రం నుంచి విజయవాడలో వున్న ఎడిషన్ కేంద్రానికి టెలిప్రింటర్ సహాయంతో వార్తలు వచ్చేవి. తాలూకా కేంద్రాలలో పనిచేసే విలేకరులు పోస్టు ద్వారా లేదా బస్సుల ద్వారా పంపే వార్తలను జిల్లా కేంద్రంలో వున్న టెలిప్రింటర్ ఆపరేటర్ రోమన్ ఇంగ్లీషులో టైప్‌చేసే ఎడిషన్ కేంద్రానికి పంపేవారు. రోమన్ ఇంగ్లీషు అంటే...రోమ్ దేశస్థులు మాట్లాడే ఇంగ్లీషు కాదు...ప్రస్తుతం మొబైల్ ఫోన్‌లలో తెలుగును ఇంగ్లీషు అక్షరాలలో టైప్ చేసినట్టుగా ఆయా జిల్లాల్లో విలేకరులు పంపే వార్తలను ఆ విధంగా ఇంగ్లీషులో టైప్ చేసి పంపేవారు. ఎడిషన్ కేంద్రంలో ప్రతి జిల్లా కేంద్రానికి అనుబంధంగా వేరు వేరుగా టెలిప్రింటర్ల నుంచి వార్తలు వచ్చేవి. అక్కడ జిల్లా కేంద్రంలో టెలిప్రింటర్‌పై టైప్ చేస్తే, ఇక్కడ ఎడిషన్ కేంద్రంలోని టెలిప్రింటర్‌లో టైప్ అయ్యేది. ఆ విధంగా టైప్ అయిన పేపర్లను ఆపరేటర్లను తీసుకు వచ్చి డెస్క్‌లో ఇచ్చేవారు. ఒక్కొక్కసారి సబ్‌ఎడిటర్లే టెలిప్రింటర్ వద్దకు వెళ్లి టైప్ అయిన వార్తలను తెచ్చుకొనేవాళ్లం. జిల్లా రిపోర్టర్లు వార్తలతోపాటు ఇతరత్రా అంశాలు కూడా టెలిప్రింటర్లద్వారానే టైప్ చేసేవారు. నేను సబ్ ఎడిటర్‌గా చేరిన కొత్తలో ప్రకాశం జిల్లా ఒంగోలు కేంద్రం నుంచి పెద్దగా వార్తలు రాలేదు. దాంతో అక్కడ జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా వెంటనే వార్తలు పంపండి అని టైప్ చేశాను. ప్లీజ్ వెయిట్ నేను బస్టాండ్‌కు వెళ్లివస్తాను...అని సమాధానం ఇచ్చాడు.

నేను వార్తలు పంపమని మెసెజ్ పెడిగే బస్టాండ్‌కి వెళుతున్నానని సమాధానం ఇవ్వడం ఏమిటో నాకు అర్థం కాలేదు. "వార్తలు పంపమంటే బస్‌స్టాండ్‌కు వెళతానని చెప్పడం ఏమిటి? అంటూ మా డెస్క్ ఇన్‌ఛార్జ్ అరుణ్‌కుమార్‌కు కంప్లయింట్‌గా చెప్పాను. దాంతో ఆయన 'జేబులు కొట్టడానికి వెళుతున్నాడులే...'అని వ్యాఖ్యానించారు. నేను పంపిన మెసేజ్‌కు జిల్లా రిపోర్టర్ ఇచ్చిన సమాధానం అర్థం కాకుండా వుంటే అరుణ్ కుమార్ సమాధానంగా 'జేబులు కొట్టడానికి' అని అనడం మరింత ఆశ్చర్యం కలిగించింది.

నాకు ఆ తర్వాత తెలిసిన విషయం ఏమిటంటే ప్రతి జిల్లా కేంద్రంలోని ఆర్టీసి బస్టాండ్‌లలో ఈనాడు పత్రికకు చెందిన లెటర్‌బాక్స్‌లు ఏర్పాటు చేశారు. తాలూకా విలేకరులు పంపే వార్తలన్నీ ఆ బాక్స్‌లకు చేరతాయి. జిల్లా రిపోర్టర్ లేదా అక్కడి ఆపరేటర్ ప్రతి గంటకు బస్ స్టేషన్‌కు వెళ్లి లెటర్ బాక్స్‌లోని వార్తలు తీసుకు వచ్చి టైప్ చేస్తారు. ఈ విషయం పట్ల నాకు అవగాహన లేకపోవడం, డెస్క్ ఇన్‌ఛార్జ్ నాకు అసలు విషయం చెప్పకపోగా జేబులు కొట్టడానికి అని వ్యాఖ్యానించడం...ఆ తర్వాత నాకు అసలు విషయం తెలియడంతోఆనాటి సంఘటన నాకు నవ్వు తెప్పించడమే కాకుండా నేటికి గుర్తుండి పోయింది.

మరో సంఘటనతో
వచ్చే నెల కలుద్దాం ★

51

ప్రేమలేఖలు

-విడదల సాంబశివరావు

(గత సంచిక తరువాయి)

ప్రియసఖీ! "అపురూపమైన జ్ఞాపకాలు హృదయంలోతుల్లో చిరస్థాయిగా నిలిచివుంటాయి. అవేగా స్నేహానికి తీపిగుర్తులు!?" అని శ్రీదేవి పలికిన పలుకులు... మన అనుబంధం తాలూకు మధురానుభూతులను మరోసారి గుర్తు చేశాయి. మనం కలిసి తిరిగిన ప్రతి సందర్భంలో కూడా నా మనసుకు నచ్చే పదజాలంతో నన్ను అలరించేదానివి. నువ్వు మాట్లాడే తీరు నన్ను ఊహాలోకంలో ఊయలలూగించేది.

"లక్షరకాలుగా లోకం వారించినా... ఈతోడు విడిపోదు! నా కౌగిలిలో ఒదిగిపోయిన మన స్నేహబంధం ఎప్పటికీ తెగిపోదు!" నీ ఎదపై సేదదీరిన నా ముఖబింబాన్ని సున్నితంగా స్పృశిస్తూ భావోద్వేగంతో పలవరించావు.

ఇలా ఒక్కసారి కాదు...పలుమార్లు, ఉద్వేగభరితమైన వాగ్దానాలతో నాలో చెలరేగిన ఆశలను సుసంపన్నం చేశావు. కానీ, 'విధి' నిర్ణయాన్ని మాత్రం వ్యతిరేకించలేకపోయావు. ఈ సమాజం నిజంగా చిత్రమైనదే ప్రేయసీ! తాను విధించిన నియమాలన్నింటినీ విధిగా అనుసరిస్తే... మనతో అన్నిరకాలుగా సానుకూలంగా వుంటుంది. కానీ, మన మనసుకు నచ్చిన మార్గంలో పయనించాలని బలంగా నిర్ణయించుకొని ఆ నియమాలకు విరుద్ధంగా వెళితే...ఈ లోకం అనేకానేక అవరోధాలు కల్పిస్తుంది... మొండిగా ఎదురీది, ముందుకు సాగిపోగలిగితే ఎలాంటి ఇబ్బంది వుండదు. కాస్తంత ఏమరపాటుతోనో, బెరుకూ భయాలతోనో, కాస్త పట్టు సడలిస్తే... అదే అదనుగా అధఃపాతాళానికి తోసేస్తుంది! అలా ఒకసారి చేజారిపోయిన జీవితం మళ్ళీ మన చేతికి రావడం దాదాపు అసాధ్యమే కదా! అందుకు ఉదాహరణ మన ఇద్దరి ప్రేమకథే సుమా! అందుకే...ప్రేమికులు తమ బంధాన్నీ, అనుబంధాన్నీ నిలబెట్టుకోవడానికి అనుక్షణం ఆరాటపడుతుంటారు. అవతలివాళ్ళకు అది వింతగాను, సాంఘిక కట్టుబాట్లకు వ్యతిరేకతగాను అనిపించవచ్చు! కానీ, జీవితాంతం ఉండాలనుకున్నది మధ్యలోనే దూరమయ్యే పరిస్థితి వస్తే... ఆ వియోగాన్ని ఊహించుకోవడంలోనే ఆ ప్రేమ జంటకు భరించలేనంత బాధ అనిపిస్తుంది.

నీ ఎడబాటు మిగిల్చిన దుఃఖాన్ని భరించలేని నిస్సహాయ స్థితిలోనేగదా... నన్ను మరచిపోయి బ్రతకాలని 'ఢిల్లీ' నగరానికి చేరుకున్నది!?

అయితే... అక్కడ నువ్వు చేసిన గుండెగాయాలను తన 'ప్రేమలేపనం'తో పూర్తిగా మార్పించి, నన్ను తిరిగి మనిషిని చేసింది శ్రీదేవి. విఫలమైన మన ప్రేమ గాథ తెలిసి కూడా, అత్యంత అనురాగంతో నన్ను దగ్గరకు తీసుకుంది. ప్రేమతో తన మనసును నా హృదయంలోగిలిలో జారవిడిచి నన్ను తన కళ్ళల్లో దాచుకుంది. శ్రీదేవి తన కనురెప్పలను మూసుకొని విశ్రమించినవేళ, ఆమె హృదయనందనమే సువిశాల విశ్వమైహాయిగా నన్ను సేదదీర్చింది. నా చుట్టూ వున్న ప్రపంచంలో నన్ను మించిన అదృష్టవంతుడు వేరొకడు లేడని ఎంతగానో ఉప్పొంగిపోయాను.

"బిర్లామందిర్ చరిత్రవింటానని...ఎక్కడో ఊహల అలల్లో తేలియాడుతున్నారు! రండి నేస్తం ఈలోకంలోనికి... మీ నెచ్చెలి మీ చెంతనే వుందిగా!?"

శ్రీదేవి పలకరింపు కవితాత్మకంగా నా కర్ణపుటాలను తాకింది. నా తనువు పులకరించింది ఆమె పదజాలంతో! ఈలోకంలోకి వచ్చి హాయిగా నవ్వాను.

"చెప్పండి నేస్తం... వినడానికి నేను రెడీగా వున్నాను" బుద్ధిమంతుడైన విద్యార్థిలా అన్నాను. ఓ చిరునవ్వు అందంగా విసిరి, కొన్నిక్షణాలు గాలిపీల్చుకొని, చెప్పటం ప్రారంభించింది శ్రీదేవి.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే 'బిర్లామందిరం' నిర్మాణం ప్రారంభమైంది. శ్రీవైష్ణవులైన పారిశ్రామిక కుటుంబానికి చెందిన వారే 'బిర్లా' వంశీయులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలైన 'బిర్లా' వంశీయులు వైష్ణవ సాంప్రదాయాన్ని అనుసరించి మనదేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ముఖ్య నగరాలలో వైష్ణవాలయాలను నిర్మించారు. ఆ కోవలోనే ఢిల్లీ నగరంలో బిర్లా మందిరం రూపుదిద్దుకున్నది.

ఈ మందిరం నిర్మాణాన్ని బిర్లా వంశానికి చెందిన 'జుగలేకిశోర్‌బిర్లా' 1933వ సంవత్సరంలో ప్రారంభించాడు. దేవాలయ నిర్మాణాలలో ఓ ప్రత్యేకతను కలిగివుండాలని, దేశంలో విలువైన గుర్తింపును తామే సొంతం చేసుకోవాలని, బిర్లా కుటుంబాల ఆశయం. అందుకే ఖర్చుకు వెనకాడక... భారీ నిర్మాణాన్ని చేపట్టారు. దేవాలయాల నిర్మాణంలో ప్రముఖమైన గుర్తింపును కలిగివున్న 'ఆచార్యవిశ్వనాథశాస్త్రి' నేతృత్వంలో కాశీ నుండి వచ్చిన శిల్పులు ఈ నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ మందిర నిర్మాణానికి ప్రత్యేకంగా రాజస్థాన్‌లోని జైపూర్ నుండి తెప్పించిన పాలరాయిని మాత్రమే ఉపయోగించారు. ఏడున్నర ఎకరాల ప్రాంగణంలో... దాదాపు అర్థ ఎకరం విస్తీర్ణంలో గుడిని నిర్మించడం జరిగింది. మనోహరమైన మూడు అంతస్తుల నిర్మాణంలో... శివుడు, విఘ్నేశ్వరుడు, హనుమాన్, దుర్గాదేవి, శక్తిమాత, బుద్ధుడు విగ్రహాలను హైందవ సిద్ధాంతం ప్రకారం ప్రతిష్ఠించడం జరిగింది. మిగిలిన 7 ఎకరాల స్థలాన్ని భారతీయ శిల్పకళా వైభవం ప్రతిబింబించే విధంగా పలురకాల నిర్మాణాలతో తీర్చిదిద్దారు. మందిరం ప్రాంగణంలోని ఉద్యానవనం సహజసిద్ధమైన ప్రకృతి సౌందర్యంతో అలరారుతూ చూపరులను ఇట్టే ఆకర్షిస్తూ వుంటుంది. అంతేకాదు...ఈ ఉద్యానవనంలో కృత్రిమమైన జలపాతాలు నిర్మించబడి..."సహజసిద్ధమైన జలపాతాలే" అన్నట్లుగా భక్తులను, పర్యాటకులను ఆశ్చర్యాంబుధిలో ముంచేస్తాయి. అన్నింటినీ మించి, ఇక్కడ మరో అద్భుతం చోటు చేసుకుంది!" చెప్పటం ఆపి నావైపు చూసింది.

"ఏమిటా అద్భుతం!" ఉత్సాహంతో అడిగాను.

"అదిగో...అటు చూడండి...మందిరం శిఖరాగ్రం కనిపిస్తోందా?"

మందిరంవైపు చెయ్యి చూపుతూ ప్రశ్నించింది. మందిరం వైపు చూశాను. నాకేమీ కన్పించలేదు. ఆమాటే ఆమెతో అన్నాను.

"లేదు నేస్తం... నాకు శిఖరాగ్రం కన్పించడం లేదు!"

"నాక్కూడా కన్పించడంలేదు...రండి...చూద్దాం" నా చేయి పట్టి లేపింది. ఇద్దరమూ మందిరం ప్రాంగణంలో దాదాపు 50 గజాలు ముందుకెళ్ళి... ఆగి...అక్కడ నిల్చుని తలలు పైకెత్తి చూశాము. అప్పుడు కన్పించింది మందిరం శిఖరాగ్రం.

"ఏమిటీ వింత? ఇంతదూరం నుండి చూస్తే తప్ప దేవాలయ శిఖరం కన్పించక పోవడమేవిటి?" ఒకింత ఆశ్చర్యంతో అడిగాను.

"అదే కదా మందిరం ప్రత్యేకత! ఈ శిఖరం ఎత్తు 160 అడుగులు. ఆ రోజుల్లో ఉత్తరభారతంలో నిర్మించబడిన దేవాలయాలన్నింటిలో... ఈ దేవాలయ శిఖరమే అత్యంత ఎత్తయిన శిఖరంగా దేశంలోని ప్రజలు చెప్పుకునే వారట. ఈ వివరాలను మా నాన్నగారు చెప్పారు!"

ఉత్సాహంగా ముందుకు దారితీస్తూ చెప్పుకుపోతోంది శ్రీదేవి.

"మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... బిర్లా కుటుంబ సభ్యులతో కలిసి మహాత్మాగాంధి 1938వ సంవత్సరంలో ఈ మందిరానికి ప్రారంభోత్సవం చేశారు" ఆమెను అనుసరిస్తూ ఆమె చెబుతున్న విషయాలను ఆలకిస్తున్నాను.



తాపీగా నడుస్తోన్న శ్రీదేవి ఓ భవనం ముందు ఆగి... వివరాలను తెలియజేసింది.

"ఇది... శ్రీకృష్ణ పరమాత్మకు అంకితం చేసిన 'గీతాభవన్'. మందిరానికి ఉత్తర భాగంలో వున్న ఈ భవనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. జన్మాష్టమి, దీపావళి పండుగల సందర్భంలో జరిగే వేడుకలు కూడా ఈ భవనంలోనే నిర్వహించ బడతాయి. ఈ వేడుకలు జరిగే సమయాలలో భక్తుల తాకిడి వేల సంఖ్యలో వుంటుంది!"

చెబుతూనే ఆ భవనం లోపలకు దారితీసింది. మౌనంగా ఆమెను అనుసరించాను. గీతాభవన్‌లోని ప్రతి అంగుళములోనూ భారతీయ శిల్పకళా వైభవం కనిపిస్తోంది. అడుగడుగునా హైందవ సంస్కృతి కన్నులకింపుగా కనిపిస్తూ, మనసును ఆధ్యాత్మిక భావనతో పులకరింపజేస్తోంది.

మహత్తరమైన అలౌకిక ఆనందాన్ని అనుభూతిస్తూనే బిర్లామందిరం ప్రాంగణంలోని సుందర దృశ్యాలన్నింటినీ చూశాము. అద్భుతదేవతామూర్తులను, మనసును ఉల్లాసపరిచే కృత్రిమ జలపాతాలను, పలురకాల పుష్ప జాతులతోనిండిన రమణీయమైన...నందనవనాన్ని, హాయిగా, ఆనందంగా చూసి తరించాము.

ఎంతో అనుభవం గడించిన "గైడ్"లా విషయాన్ని తనదైన శైలిలో వివరించి చెప్పి నా హృదయాన్ని రంజింపజేసింది శ్రీదేవి. బిర్లామందిరం ప్రాంగణంలోని విశేషాలన్నింటిని చూసిన తర్వాత, తిరిగి మహావృక్షం వేప, రావి కలిసి పెరిగిన చెట్టు నీడన కూర్చుని సేదదీరాము.

"ఎలా వుంది నేస్తం మన బిర్లామందిరం యాత్ర?" నా చేతిని తన చేతితో నిమురుతూ అడిగింది శ్రీదేవి. ఆ సమయంలో ఆమె కళ్ళల్లో మెరుపులు కనిపించాయి.

"చాలా బాగుంది. మన ప్రేమయాత్రలో తొలిమజిలీ ఉల్లాసంగా గడిచిపోయింది. నేను చాలా ఆనందంగా వున్నాను. మరి మీరు...!?" ఆమె ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాను.

"మీరు, నేను ఒక్కటిగా కలసిపోవాలని నిర్ణయించుకున్నాం! మరి...మీ సంతోషం నా సంతోషమే కదా!" నా కుడి అరచేతిని తన గుండెలకు హత్తుకుంటూ తృప్తిగా సమాధానం చెప్పింది శ్రీదేవి. ఆమె పెదాలు ఈ పదాలను ఎంతో మార్దవంగా పలికాయి.

ఆశ్చర్యంతో ఆమె మోము వైపు తదేకంగా చూడసాగాను. ఓ చిన్న వాక్యంతో... తన మనసులో నాపై వున్న ప్రేమభావనను వ్యక్తం చేసింది శ్రీదేవి.

"నేనే నువ్వు... నువ్వే నేను! నీవు లేక నేను లేను... నేను లేక నువ్వూ లేవు! నా దృష్టిలో ప్రేమకు భాష్యం ఇదే సుమా!" అనే అర్థం శ్రీదేవి పలికిన పలుకుల్లో నిగూఢంగా దాగివుంది.

"ఏమిటి నేస్తం అలా చూస్తున్నారు?" నా కళ్ళల్లోకి చూస్తూ తాపీగా అడిగింది.

"మీ కళ్ళల్లో దాగివున్న నా అదృష్టాన్ని వెతుకుతున్నాను నేస్తం!" నా సమాధానం విని చిన్నగా నవ్వింది. కొన్ని క్షణాలు మౌనం దాల్చి... తర్వాత అడిగింది చిరుదరహాసంతో!

"కనిపించిందా!?"

"ఆఁ... కనిపించింది!" నా సమాధానం ముందుగానే ఊహించింది గాబోలు...

"అయితే... నాకు చూపించండి!" గోముగా అడిగింది.

"ఈ రాజకుమారి, చిరునామాలేని ఈ బాటసారిని ప్రేమించింది. ఇది నా అదృష్టం కాక మరేమిటి నేస్తం!?" ఒకింత ఉద్వేగం నా స్వరంలో ధ్వనించింది. అదేమిటో... నా ప్రమేయం లేకుండానే నా మదిలోయల నుండి భావోద్వేగతరంగాలు వెల్లువలా బైటికొచ్చాయి. మళ్ళీ నేనే మాట్లాడడం ప్రారంభించాను. మంచి శ్రోతలా శ్రీదేవి వింటోంది.

"నాకు భయంగా వుంది నేస్తం! ఓ మధ్య తరగతి రైతు కుటుంబంలో పుట్టిన సామాన్యుణ్ణి నేను. అంతేగాకుండా, తొలిసారి ప్రేమలో విఫలమై, బాధామయమైన ఆ గాథను మరచిపోవడానికి ఢిల్లీ నగరానికి వచ్చాను. అదేమి చిత్రమో... ఇక్కడ కూడా నాకు గతంలో మాదిరి ప్రేమదేవత సాక్షాత్కరించి, అనురాగంతో నన్ను తన హృదయంలో దాచుకుంది! అయితే...సంతోషంతో బాటు భయం కూడా నన్ను వెంటాడుతోంది!"

కొన్నిక్షణాలు చెప్పటం ఆపి ఆమె కళ్ళల్లోకి చూశాను. శ్రీదేవి నా మాటలను శ్రద్ధగా వింటోంది. నా మనసులోని భావాలను ఊహించగలిగే మేధస్సు ఆమెకే సొంతం. ఆ విషయం నాకు బాగా తెలుసు. అందుకే... నిండుకుండలా నిశ్చలంగా నా మాటలు వింటూ, నావైపే చూస్తూ వుండిపోయింది శ్రీదేవి.

ఆలోచనలకే అందని మలుపులతో ముందుకు సాగిన మా ప్రేమగాథతో మరో లేఖ రాస్తాను! ఉండనా మరి!! ★

ఎల్లప్పుడూ తినదగ్గది నల్ల ద్రాక్ష

* నల్ల ద్రాక్ష రుచిలో తీపిగా ఉంటుంది. వీటి వల్ల మన ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. నల్లటి ద్రాక్షలో సీ-విటమిన్, ఏ-విటమిన్, బీ6, ఫోలిక్ ఆమ్లం పుష్కలంగా ఉంటాయి. ద్రాక్ష పండ్లలో ఉండే గ్లూకోజ్, మెగ్నీషియం, సిట్రిక్ యాసిడ్ వంటి అనేక పోషకాలు మనల్ని అనేక వ్యాధుల నుంచి కాపాడతాయి.
* నల్ల ద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఊబకాయాన్ని నివారించడంలో సహాయపడటమే కాకుండా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, చర్మం, జుట్టుకు సంబంధించిన సమస్యలను అధిగమించవచ్చు.
* ద్రాక్షలో ఫ్లేవనాయిడ్స్‌లాంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయలను తొలగిస్తాయి. నిత్యయవ్వనులుగా ఉంచుతాయి. నల్లటి ద్రాక్షలు రక్తంలో నైట్రిన్ ఆక్సైడ్ మోతాదును పెంచుతాయి, నైట్రిక్ ఆక్సైడ్ రక్తం గడ్డలుగా ఏర్పడకుండా నివారిస్తాయి.
* నల్ల ద్రాక్షలో ఉండే కొన్ని రకాల పోషకాలు క్యాన్సర్ కారకాలతో పోరాడతాయి. నల్లద్రాక్షలో ఉండే ఫైటోకెమికల్స్ గుండెలో పేరుకొనే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి అక్కడి కండరాలకు మేలుచేస్తాయి. అలా హృద్రోగాలను దూరం చేస్తాయి.



* నల్ల ద్రాక్ష పండ్లను తినడం వల్ల శరీరం బరువును తగ్గించుకోవచ్చు. ఊబకాయంతో బాధపడుతున్నవారు నల్ల ద్రాక్షను తరచుగా తీసుకోవాలి. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ ఏర్పడటం ఆపడం ద్వారా ఊబకాయం వంటి ఇతర ఆరోగ్య సమస్యలను కూడా నివారిస్తుంది.
* జుట్టుకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే ఎక్కువగా నల్ల ద్రాక్ష పండ్లను తినాలి. వీటిలో లభించే విటమిన్ ఈ జుట్టు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. నల్ల ద్రాక్షలో ఉండే విటమిన్ ఈ చుండ్రు, జుట్టు రాలడం లేదా తెల్లగా మారడం వంటి జుట్టు సమస్యలను నయం చేస్తుంది. ✱

నవ్వుల చౌరస్తా

-జైదాస్, శాబా, రావెళ్ళ







వార పత్రికల కథా సాహిత్యంలో స్త్రీ పాత్ర



- డా॥ ఇండ్ల రాధారెడ్డి
ఎమ్.ఎ, పిహెచ్.డి

గతంలో కందుకూరి వీరేశలింగం వంటి వారు పత్రికల ద్వారా సారస్వత కృషి, సంఘ సంస్కరణ, దురాశా నిర్మూలన నవీనాంధ్ర పత్రికా రచన వంటి సేవలు చేయడం వలన ఈ కాలాన్ని 'వీరేశలింగం యుగం' అన్నారు. బాల్యవివాహాలు, వైధవ్యం, కన్యాశుల్కం, దేవ దాశీత్వం, వ్యభిచారం, బహుభార్యాత్వం వంటి రకరకాల స్త్రీ సామాజిక సమస్యలను తమ కథావస్తువులుగా గ్రహించి రచనలు చేస్తే అవి వార పత్రికలు ప్రచురిస్తూ వచ్చాయి.

ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన మొదటి కథ 'దిద్దుబాటు' లోనే తన భావాలను వ్యక్తీకరించిన గురజాడ స్త్రీకి ప్రాధాన్యతనిస్తూ స్త్రీలు తమ జీవితాలను దారిలోకి తెచ్చుకోవాలంటే తమ సమస్యలను తామే పరిష్కరించుకొనే దిశగా ఆలోచిస్తూ చైతన్యమూర్తులు కావాలనే నితిని ప్రబోధించారు. 1960-70ల మధ్య రచయిత్రులు రాసిన నవలలకు, కథలకు, కవితలకు విశేష ఆదరణ లభించింది. అలాగే స్త్రీలు రాసిన కథలనే కాక స్త్రీలు ఇష్టపడే రచనలను వారపత్రికలు ప్రచురించడం మొదలుపెట్టాయి, ఇది ఒక కొత్త ఒరవడి అనే చెప్పాలి. ఈ ధోరణి ప్రతి వారపత్రికలోనూ కన్పించడం మొదలైంది.

ఇక పురుషుల కంటే స్త్రీలే తమ సమస్యలను బాగా వ్యక్తీకరించ గలరని రచయిత్రులకు వారపత్రికలు పట్టం కట్టాయి. సర్క్యులేషన్ పందెంలో కథల పోటీలను నిర్వహించి మంచి కథలతో పాటూ మంచి రచయితలను వారపత్రికలు పరిచయం చేయసాగాయి. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారడం, వ్యక్తుల్లో వ్యాపారదృష్టి, వరకట్నం, ఆధునిక జీవితపు కష్టాలు, గ్రామ రాజకీయాలు, నీటి కరువు, ఆకలి, మధ్యతరగతి సమస్యలు, నిరుద్యోగం, దోపిడీ వ్యవస్థను చిత్రిస్తూ కథలు వచ్చాయి. 1970 నుండి ప్రారంభమై కొనసాగిన అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో స్త్రీవాదం బలమైన ధోరణిగా వేళ్ళూనుకొని తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలను కొన్ని మార్పు లకు లోను చేసింది. స్త్రీ పట్ల వివక్షను, అణిచివేతను వ్యతిరేకిస్తూ స్త్రీ విముక్తి సమానత్వం కోసం ఉద్యమిస్తూ స్త్రీవాదులు కథలు, కవి తలు, నవలలు, వ్యాసాలు రాయటం మొదలుపెట్టారు.

ఇక వార పత్రికల కథా సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణను రెండు రకాలుగా తీసుకోవచ్చు. కుటుంబ జీవితంలో స్త్రీపాత్ర చిత్రణ, సమాజ జీవితంలో స్త్రీ పాత్ర చిత్రణ, అలాగే శారీరకంగా స్త్రీ వర్ణన, మానసికంగా స్త్రీ వర్ణన ద్వారా స్త్రీని ఆధునిక సాహిత్యం ఎలా చిత్రిం చిందో అన్ని కోణాల నుండి చూడవచ్చు. కుటుంబ జీవితంలో స్త్రీ తల్లిగా, భార్యగా, కూతురుగా, కోడలుగా, అక్కగా, చెల్లిగా, వదినగా రకరకాల పాత్రలను పోషిస్తుంది. కుటుంబ జీవితానికి స్త్రీ వేరు లాంటింది. ఆదిమ సమాజంలో మాతృస్వామ్య వ్యవస్థ వుండేది. తర్వాత దాంపత్య వ్యవస్థ వల్ల స్త్రీ కుటుంబంలో బానిసగా మారింది. ప్రతి ఇంటిలో తాను ఉండలేక దేవుడు ఇంటికొక అమ్మని ఇచ్చారు అంటారు. ప్రేమమూర్తి, త్యాగమూర్తి, నిస్వార్ధ పరురాలు అయిన తల్లి ఇంటికోసం తన వారి కోసం తన శ్రమను ధారబోస్తే అవసాన దశలో భర్త, పిల్లల నిర్లక్ష్యం వల్ల దైన్యస్థితిలో ఉన్న తల్లి పాత్రలు ఎక్కువగా కన్పిస్తాయి. వృద్ధాప్యంలో తోడూనీడగా వుండవలసిన పిల్లలు తల్లిదండ్రుల ఆస్తిని, డబ్బును లాక్కుని వారిని వృద్ధాశ్ర మాలకు పంపితే ఆ తల్లి పడే వేదనను, బాధను చిత్రించిన కథల్లో అసహాయపు తల్లి పాత్ర కన్పిస్తుంది.

వివిధ రంగాల్లో ఎన్నో రకాల ఉద్యోగాలు, అందులో భాగంగా నైట్‌డ్యూటీలు చేస్తూ ధైర్యంగా ఒంటరిగా ఇంటికి చేరే మహిళా పాత్రలు..ఉద్యోగ దృష్ట్యా కుటుంబానికి దూరంగా రాష్ట్రేతర ప్రాంతా లకు, ఖండాంతర ప్రాంతాలకు వెళ్ళి కష్టపడే స్త్రీలు- భర్త ఒక దగ్గర, పిల్లలు ఒక దగ్గర, భార్య ఇంకో దగ్గర ఉన్నా ఆయా పరిస్థితు లను తమకు అనుకూలంగా మలుచుకొని తమదైన సామర్థ్యంతో కుటుంబానికి అండగా నిలవడం కన్పిస్తుంది. ఇక ఆర్థిక స్వాతంత్ర్యం పొందిన వీరు వివాహ బంధాన్ని తిరస్కరించి పురుషాధిపత్యం నుండి బయటపడిన వారు భర్తల ద్వారా మోసపోయినపుడో, లేదా విడాకులు పొందినపుడో తాను తిరిగి వివాహం చేసుకోవడానికి ఏ మాత్రం సంశయించని పాత్రలు అక్కడక్కడా కన్పిస్తాయి. ఇక సమాజమో, బంధువులో, స్నేహి తులో విమర్శిస్తారని భయపడకుండా తన భావాలను, అభి ప్రాయాలను, ఇష్టమైనవారితో పంచుకొని పురుషుడిని వదిలేయ డానికి ముందుకొస్తున్న మహిళలు ఎక్కువగా కన్పిస్తున్నారు. అవసరమైతే తమ హక్కులను తాము చట్టం ద్వారా పొందేం



దుకు వెనుకాడని స్త్రీలు ఎక్కువగా ఉన్నారు. అలాగే భర్తను వొదిలి ఒంటరి అయిన మహిళ తమ పిల్లల బరువు బాధ్యతలను సక్రమంగా ధైర్యంగా నిర్వర్తించడం, వారిని వృద్ధిలోకి తేవడం వంటి పాత్రల ద్వారా ఆధునిక స్త్రీ అబల కాదు అనే సందేశం సమాజానికి అందు తుంది.

ప్రేమకు కులం, మతం, ఆస్తి, అంతస్తులు, భాషలు, రాష్ట్రాలు, దేశాలు అడ్డురావని తను ఇష్టపడిన వారిని వివాహం చేసుకునేందుకు ధైర్యంగా ముందుకు వచ్చిన స్త్రీలు- అవసరమైతే తల్లిదండ్రులను ఎదిరించడానికో, ఒప్పించడానికో ప్రయత్నం చేసే తెగువ గల పాత్రలు ఈనాటి కథల్లో ఎక్కువగా ఉన్నాయి. అలాగే ఎన్నో సంవత్సరాలుగా ప్రేమిస్తున్నామని పెళ్ళిచేసుకున్న వీరు వివాహానంతరం త్వరగా విడిపోవడమూ కథల్లో చూస్తాం. ఇక ఫేస్‌బుక్ ద్వారానో, వాట్సప్, ఇన్‌స్ట్రాగ్రామ్ ద్వారా పరిచయమైన యువకుల వలలోపడి డబ్బును, పరువును, చివరికి ప్రాణాలనూ పోగొట్టుకున్న అమాయకమైన మహిళ పాత్రలు నేటి తరంలో అక్కడక్కడా కన్పిస్తున్నాయి. అలాగే తమ అందం ద్వారా, మాటల ద్వారా అబ్బాయిలనూ మోసం చేసి వారి నుండి డబ్బును లగ్జరీ వస్తువులనూ తీసుకొని వదిలేసిన నెరజాణలైన అమ్మాయిలు కూడా ఒకటీ అర కన్పిస్తారు.

ఇక స్త్రీని శారీరకంగా వర్ణించడంలో వారపత్రికల్లో వచ్చిన కథలు ప్రాచీన సాహిత్యానికి ఏమాత్రం తీసిపోలేదనే చెప్పవచ్చు. ఆనాటి నుండి ఈనాటి వరకూ ఆ వివక్ష వర్ణనల్లో కన్పిస్తుంది. ఆమె అవ యవాలను రకరకాల ఉపమానాలను ప్రయోగించి ఆ వర్ణనలను శృంగారంతో ఎలా ముడిపెట్టాయో చాలా పాత్రల్లో కనిపించింది. శృంగార కథలు, సెంటర్ సెన్సేషన్ కథలు, క్రైం-క్లూ కథలు, సరసమైన కథల్లో స్త్రీని వర్ణించిన తీరు ప్రబంధాలను తలదన్నేలా ఉంది. స్త్రీని నఖశిఖపర్యంతం ఏ అవయవాన్ని వదలకుండా రాసిన కథల్లో ఆయా రచయితలు ఆనవాయితీగా వచ్చిన సంప్రదాయాన్ని వదల లేదని పిస్తుంది. అక్కడక్కడా శరీర దృఢత్వాన్నీ చూపించారు.

ఇక స్త్రీని మానసికంగా పరిశీలించినపుడు ప్రాచీన సాహిత్య కారులు కల్పించిన స్వభావాలను ప్రేమత్యాగం, సౌశీల్యం, సహనం, అమాయకత్వం, ఈర్ష్య, ద్వేషం, కుళ్ళు, కుతంత్రం, దుర్మార్గం, దుర్గుణం లాంటి గుణాలను అంటగడుతూ స్త్రీని అబలని చేయడం మొదటి తరాల్లో ఎక్కువగా కన్పిస్తుంది. స్త్రీని పోషించేదీ, రక్షించేదీ పురుషుడేనని, ఆమెను మానసికంగా బలహీనురాలిని చేస్తూ ఆనాటి నుండి ఈనాటి వరకూ షరతు లతో కూడిన స్వాతంత్ర్యాన్ని ఇచ్చిన పాత్రలు కన్పిస్తాయి. అయితే వివేకంతో మేల్కొని మానసికంగా ఎదిగిన స్త్రీ మనో ధైర్యాన్ని తెచ్చుకుని తనని తాను ఆ అణిచివేత నుండి తప్పిం చుకునే ప్రయత్నంలో ఆమెలోని ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం సమాజంలో మార్పునకు నాందిగా కనిపిస్తుంది. పరాధీనగా ఉండకూడదని తమ బ్రతుకు తాము బ్రతకగలమని అవసర మైతే సమాజాన్ని, కుటుంబాన్ని ఎదిరించే స్థాయికి స్త్రీ మానసిక పరివర్తన ఎదిగింది. ఇది నూతనమైన పరిణామం. మాతృత్వం, పిల్లల పెంపకం, గర్భధారణ గురించి స్త్రీవాద ధోరణితో ఆలోచిస్తూ వాటిపై అధికారం తమదేనని ధైర్యంగా చెప్పగల పాత్రలు, వివాహవ్యవస్థ పట్ల ఇష్టంలేక ఆ చట్రంలో ఇరుక్కోవడం ఎందుకని సహజీవనాన్ని ఇష్టపడే మహిళా పాత్రలు అక్కడక్కడ కన్పిస్తాయి. ఒకరిపైన ఆధారపడాలన్న పాత సంప్రదాయాలకు స్వస్తి చెప్పి తనదైన వ్యక్తిత్వంతో మానసిక స్థిరత్వంతో ముందడుగు వేసింది. స్త్రీ జీవితం కేవలం తల్లిదండ్రుల కోసమో, భర్త, అత్తమామలకో, పిల్లల కోసమో కాదు కొన్ని అధికారాలు గౌరవాలూ తమకూ ఉండాలని కోరుకొనే పాత్రలతో పాటూ, వివాహ వ్యవస్థ కేవలం పురుషుల ప్రయోజనాలను కాపాడుతుందని ఆ వ్యవస్థ స్త్రీకి భద్రత కల్పిస్తుందనే విషయంలో సత్యం లేదని చెబుతూ ఆ బాధ్యత స్త్రీల ఆత్మవిశ్వాసంలో పోరాట పటిమలోనే ఉందని తెలియజేసే మహిళా పాత్రలు అక్కడక్కడా కన్పిస్తాయి.

ఆధునిక మహిళ తన కెరీర్‌కు అడ్డువచ్చే మాతృత్వాన్ని వద్దను కోవడం, సౌందర్యానికో ఆరోగ్యానికో హానికల్గుతుందని సరోగసీ విధానం ద్వారా పిల్లలను కనాలనుకుని, ధైర్యంగా స్థిరంగా తమ ఆలోచనలను కార్యరూపంలో పెట్టే పాత్రలు ఒకటి అర కన్పిస్తాయి. అలాగే పిల్లలు కావాలంటే వివాహమే అవసరం లేదని అనాథ పిల్లలను తన పిల్లలుగా పెంచుకోవడానికి ముందుకువచ్చే పాత్రల్లో స్త్రీలోని ఆదర్శం కనబడుతుంది.

రచయితలు స్త్రీల పట్లగల మంచి దృష్టి, దృక్పథం సమాజంలో మార్పుకోసం వారు తమవంతు కృషి చేయడం, ప్రయత్నించడం, వాస్తవికంగా జరిగే ప్రతి సంఘటననీ ఇతివృత్తంగా తీసుకుని మంచీ చెడులను తమ కథల్లో పాత్రలుగా సృష్టిస్తూ ఆమెని చైతన్యదిశగా తీసుకువెళ్తున్నారని చెప్పవచ్చు.

సామాజిక మాధ్యమాలు వచ్చిన తర్వాత పత్రికలను చదివే వారి సంఖ్య బాగా తగ్గిపోయిందని చెప్పవచ్చు. ఏ విషయాన్నైనా సోషల్ మీడియాలో తెలుసుకోవడం వలన పత్రికల సర్క్యులేషన్ పడిపోయి చాలా వారపత్రికలు మూసివేయబడ్డాయి. కానీ కొన్ని వెబ్ సిరీస్‌లలో స్త్రీలకు సంబంధించిన మంచి విషయాలను కథలుగా చూపిస్తూ పరి ష్కార మార్గాలనూ చూపించడం నేటి ట్రెండ్‌గా చెప్పవచ్చు. ★



అడవిపుత్రుల భూపోరాటం

మన దేశం ఎన్నో సాంప్రదాయాలకు, ఆచారాలకు పుట్టినిల్లు. వాటిని గురించిన ఆసక్తికరమైన కథతో వచ్చిన సినిమా...కాంతారా. మనిషి - ప్రకృతి- దేవతలు వీటి నేపథ్యంగా సాగే సినిమా ఇది. కాంతారా ఒక సంస్కృత పదం. రహస్య అడవి లేదా మాయావనం అని అర్థం. సినిమా టైటిల్ ఎంత మిస్టీరియస్‌గా ఉందో, కథనం కూడా అంతే మిస్టీరియస్‌గా ఉంది. పంజుర్లి, గుళిగ దేవతలు, భూతకోల నర్తనం, కరడి కంబ మహోత్సవం, ఆ ప్రాంత ప్రజల జీవన విధానం, నమ్మకాలు చిత్రీకరించడంలో దర్శకుడు రిషబ్ శెట్టి సఫలీకృతుడయ్యాడు. కథ సాధారణమైనదే. ప్రాథమికంగా కథ భూమి కోసం పోరాటం. కొంత భూమిని అడవిపుత్రులకు ఇచ్చి, వారి పంజుర్లి దేవతను తీసుకువెళ్తాడు రాజు. రాజు తర్వాతి తరాల వారికి ఆ పని మూర్ఖంగా తోస్తుంది. అడవిపుత్రుల నుండి ఆ భూమిని తిరిగి పొందాలనుకుంటారు. ఆ ప్రాంత వాసులకు జమీందార్లకు జరిగే సంఘర్షణే కాంతారా. ఈ కథతో దర్శకుడు, వరాహమూర్తి రూపంతో పంజుర్లి దేవతను, భయంకరమైన రూపం, ప్రవృత్తి గల గుళిగ దేవతను, భూతకోల నర్తనం, కరడి కంబ మహోత్సవం వంటి వాటిని సహజాతి సహజంగా జొప్పిస్తూ, కథ నడిపిన తీరు సినిమాను బ్లాక్ బస్టర్‌గా నిలబెట్టింది. ఈ దేవతల ప్రస్తావనను 'కథలో పాత్రలు' అన్నంత సహజంగా ఒదిగించాడు దర్శకుడు. సినిమాలో ఎన్నో చిక్కువిడని అంశాలున్నాయి. వాటికి ఎక్కడా దర్శకుడు వివరణ ఇవ్వడు.

సినిమా అంతా ఒక ఎత్తయితే... ప్రీక్లయిమాక్స్, క్లయిమాక్స్ మరొక ఎత్తు. దర్శకుడు, కథానాయకుడు రిషబ్ శెట్టి కథను ముగింపుకు తీసుకెళ్లిన తీరు, నటించిన తీరు, చివరకు కథానాయకుడు శివ అంతర్థానమవడం వంటి అంశాలు రకరకాల కథనాలకు, వివరణలకు, అభిప్రాయాలకు, చర్చలకు ఆస్కారాన్ని ఇచ్చింది. ఈ మధ్యకాలంలో గూగుల్లో ఎక్కువగా సెర్చ్ చేయబడిన పదాలు కాంతారాకు సంబంధించినవి అన్న వార్త కూడా ఉంది. అంత సంచలనం సృష్టించింది కాబట్టే కాంతారా సినిమా విశేష ప్రజాదరణ



పొందింది. అయితే సినిమా క్లయిమాక్స్ తప్ప ఏముంది ఇందులో? బోర్..అన్న శాతం కూడా ఎక్కువే. నిజమే... కథానాయకుడు శివ జైలు పాలవడం, జమీందారు గ్రామస్తులను మోసం చేసి, పొలం కాగితాలపై వేలిముద్రలు వేయించుకోవడం, శివ తమ్ముడు వరసైన గురవా దారుణంగా చంపబడడం వంటి సీరియస్ అంశాలతో కథ నడుస్తూ ఉంటే ఎంటర్‌టైన్‌మెంట్ ఎందుకు ఉంటుంది? సమస్యలు ఎప్పుడూ బోర్ కొడతాయి.

కాంతారా సినిమాలో ప్రధానంగా రెండు దేవతల పేర్లు వినబడతాయి. అవి.. పంజుర్లి, గుళిగ. ఇంకా భూత కోల అనే నర్తనం. సినిమాలో ఈ నర్తనం పంది నడకను పోలివుంటుంది. పంజుర్లి గురించిన కొన్ని గాథలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకటి.. అడవిలో తిరుగుతున్న ఒక పంది పిల్లను చూసి ముచ్చట పడిన పార్వతీదేవి దాన్ని కైలాసానికి తీసుకెళ్లి పెంచుకుంటుంది. అయితే ఒక రోజు ఆ పందిపిల్ల కైలాసంలోని పూల వనాన్ని చిందరవదర చేస్తుంది. దానికి కోపగించిన శివుడు, ఆ పంది పిల్లను చంపేస్తాడు. పార్వతీ దేవి బాధపడుతుంది. బ్రతికించమని కోరుకుంటుంది. సరేనన్న శివుడు, ఆ పంది పిల్లను బ్రతికించి, దానికి కొన్ని ప్రత్యేక శక్తులను ఇచ్చి, భూమి పైకి పంపుతాడు. ప్రజలను కాచి రక్షించమని చెప్తాడు. అదే పంజుర్లిగా పిలవబడుతుంది. ప్రజల పూజలను అందుకుంటుంది. ఇంకొక కథనం ప్రకారం పందులు పంటల మీద పడి నాశనం చేస్తూ ఉంటాయి. ఒకసారి ఒక రైతు ఒక పందిని చంపుతాడు. అయితే పాపభీతి వల్ల ఆ పందికి పూజలు జరిపిస్తాడు. అదే ఆ ప్రాంతానికి ఆచారమైంది. ఇలాంటి కథలు ప్రతి గ్రామ దేవతకు ఉండటం మనకు తెలుసు. చాలామంది గ్రామ దేవతలుగా కొలువబడ్డ వారు మునుపు అన్యాయంగా చంపబడి, తర్వాత పూజలు అందుకున్న వాళ్ళే.

ఇక గుళిగ విషయానికొస్తే... గుళిగ అంటే గులకరాయి అని అర్థం. ఒకసారి కైలాసంలో పార్వతిదేవి తెచ్చిన బూడిదలో ఒక గులక రాయి ఉంటుంది. శివుడు దానిని విసిరేయగా అది విష్ణులోకంలో పడుతుంది. అయితే గుళిగ ప్రవర్తన విచిత్రంగా ఉండడంతో, విష్ణువు దానిని నెల వుళ్ళ సంకే అనే ఆమెకు పుట్టమని శాసిస్తాడు. ఆమె గర్భంలో తొమ్మిది నెలలు ఉన్న గుళిగ, ఆమె కడుపుని చీల్చుకొని జన్మిస్తాడు. అలా పుట్టిన గుళిగకు విపరీతమైన ఆకలి, ఆశ్చర్యం వుంటాయి. చివరకు శ్రీమహావిష్ణువు తన చిటికెన వేలు ఇచ్చి గుళిగ ఆకలిని తీరుస్తాడు. ఒకసారి గుళిగకు, పంజుర్లికి ఘర్షణ జరుగుతుంది. అటుగా వెళుతున్న ఏడు మంది జలదుర్గలు ఆ తగవును తీర్చి, ఆ ప్రాంతానికి పాలకుడిగా పంజుర్లి, రక్షకుడిగా గుళిగను నియమిస్తారు. అందుకే సినిమా కథ ప్రారంభంలోనే పంజుర్లి 'భూమిని తిరిగి అడిగితే, నేను ఊరుకున్నా గుళిగ ఊరుకోడు" అని రాజుని హెచ్చరిస్తాడు. ఈ గుళిగ ప్రస్తావన మనకు క్లయిమాక్స్‌లో కనబడు

తుంది. గుళిగ ఆవహించిన శివలాగా రిషబ్ శెట్టి చేసిన నటన, ఆ తర్వాత కోలం కట్టిన శివను పంజుర్లి పూనినప్పుడు రిషబ్ శెట్టి నటన సినిమాను తదుపరి లెవెల్‌కి తీసుకువెళ్తుంది.

కథా విషయానికి వస్తే...క్లుప్తంగా... ఒక రాజు...అతనికి సకల సంపదలు ఉంటాయి. కానీ నిద్ర, మనశ్శాంతి కరువు. మనశ్శాంతి కోసం పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటూ ఉంటాడు. ఒక అరణ్యం గుండా వెళ్తూ గజ్జెల చప్పుడు విని ఆగిపోతాడు. అక్కడ ఉన్న ఒక రాతిని చూడగానే అతడి మనసుకు శాంతి లభిస్తుంది. ఆ రాయి పంజుర్లి దేవత. అక్కడ ఉన్న పల్లెవాసులకు గ్రామదేవత. ఆ దేవతా మూర్తిని తనకిమ్మని, దానికి ప్రతిఫలంగా ఏదైనా ఇస్తానని అంటాడు రాజు. ఆ పల్లె వాసులలో ఒకరిని పంజుర్లి పూని, తాను కావాలంటే తన అరుపు వినిపించిన మేర భూమిని ఆ ప్రాంత వాసులకిమ్మని రాజుకు చెప్తాడు. అయితే తిరిగి ఆ భూమిని కోరితే గుళిగ ఊరుకోడని రాజును హెచ్చరిస్తాడు. రాజు ఒప్పుకుంటాడు. భూమిని ఆ ప్రాంత వాసులకు ఇచ్చి, దేవతామూర్తిని సంతోషంగా తనతో తీసుకువెళ్తాడు.

ఆ తర్వాతి కాలంలో రాజు వారసుడికి, రాజు చేసిన పని మూర్ఖంగా తోస్తుంది. ఒక రాయి కోసం భూమిని ఇచ్చాడని అనుకుంటాడు. జాతర జరుగుతున్న సమయంలో వెళ్లి, భూమిని తిరిగి ఇచ్చేయమని అడుగుతాడు. కోలం కట్టిన వ్యక్తిని చూస్తూ, "మాట్లాడేది పంజుర్లా? నర్తకుడా?" అని అవమానిస్తాడు. దానికి నర్తకుడిలోని పంజుర్లి, "నర్తకుడైతే నీకు కనిపిస్తాడు. పంజుర్లి అయితే కనపడడు. భూమి ఎవరికి చెందాలో భవిష్యత్తు చెప్తుంది" అని చెప్పి అరణ్యం వైపుకు వెళ్లి అంతర్ధానమైతాడు. పంజుర్లికి ఇక్కడ తన మహిమను చాటి చెప్పాల్సిన పరిస్థితి, తన ఉనికిని నిరూపించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే మిస్టీరియస్‌గా మాయమైతాడు. ఆస్తి కోసం కోర్టుకు వెళ్లిన రాజు వారసుడు కోర్టు మెట్ల మీదే చనిపోతాడు.

అలా అడవిలో అంతర్ధానమైన వ్యక్తి కొడుకు శివ... మన కథా నాయకుడు. తండ్రి వెళ్ళిపోవడం చూసిన అతను ఇక కోలం కట్టడు. ఆ కుటుంబంలోని అతని తమ్ముడు గురవ నర్తకుడిగా ఉంటాడు. శివ దురుసు స్వభావంతో ఉంటాడు. మందుకు, గంజాయికి బానిసగా ఉంటాడు. కోపం, ఆవేశం ఎక్కువ. అతడి నివాసం పేరు కూడా కైలాసం. దర్శకుడు బహుశా పరమేశ్వరుడి స్వరూపంగా శివ పాత్ర చిత్రణ చేసి ఉండవచ్చు. జమీందారు శివకు మందు పోయిస్తూ తన పనులు చేయించుకుంటూ వుంటాడు. ఆ ప్రాంతానికి ఫారెస్ట్ ఆఫీసర్‌గా వచ్చిన మురళి నిజాయితీగా డ్యూటీ చేస్తుంటాడు. మురళికి, శివుడికి మొదట ఇగో క్లాషస్ వస్తాయి. జమీందారు, భూమి పట్టాలపై పల్లెవాసుల వేలిముద్రలు వేయించుకొని, తన పేర్న రాయించుకున్నాడని తెలుసుకుంటాడు మురళి. భూమి కోసం తన తమ్ముడు గురవాను జమీందారు చంపాడని తెలుసుకుంటాడు శివ. ఈ సంఘటనలు శివ, మురళి ప్రవర్తనల్లో మార్పుని (character transformation) తెస్తాయి. భూమిని బలవంతంగా ఆక్రమించుకోవడానికి తన మందీ మార్బలంతో వస్తాడు జమీందారు. పల్లెవాసుల ఇళ్ళను తగలబెట్టించి, వారిపై తీవ్రమైన దాడి చేయిస్తాడు. శివ వారిని ప్రతిఘటిస్తాడు. కానీ ఆ దాడిలో దాదాపుగా శివ చనిపోయే పరిస్థితి వస్తుంది. అక్కడే ఉన్న గుళిగ రాయికి తల కొట్టుకొని, శివ నుదుటిన గాయం అయి నిశ్చేతనంగా పడిపోతాడు. ఆ గాయం అతడికి మూడో కన్నులా ఉంటుంది. పంజుర్లి 'హో' అన్న నాదానికి శివలోని గుళిగ మేల్కొంటాడు. విపరీతమైన ఆకలితో, ఆవేశంతో, కోపంతో ఊగిపోతూ జమీందారు మనుషులని చంపేస్తాడు. ఆ తర్వాత జరిగే జాతరలో కోలం కడతాడు శివ. ఆవహించిన అతను గ్రామవాసులను మురళికి అప్పజెప్పి, తన తండ్రిలాగే అడవిలోకి వెళ్లి అంతర్ధానమౌతాడు.

కాంతారా... టైటిల్‌లో ఉన్న మార్మికత, కథనంలో కూడా కనపడుతుంది. సినిమాలో అనేక అంశాలు అంతే మార్మికతతో వుంటాయి. 'హో' అనే అరుపుతో పంజుర్లి దేవత, చిమ్మచీకటి రాత్రుల్లో అడవి, పంజుర్లి వేషధారణలో చనిపోయిన గురవా ఏడుస్తూ... కీడు జరిగిందని శివకు చెప్పడం, శివ తప్పు చేసిన ప్రతిసారి, అతని కలలో పంజుర్లి కానీ, అతని తండ్రి కానీ కనపడి హెచ్చరించడం, దైవ వరాహం అలంకరణలతో గజ్జెలతో శివకు కనపడటం, పంజుర్లి, గుళిగ ఆవహించినప్పుడు రిషబ్ శెట్టి నటన, శివ, శివ తండ్రి అడవిలో అంతర్ధానం అవ్వటం, కథాకళి నృత్యంతో పోలిన వేషధారణతో నర్తకుడి భూతకోల నర్తనం ఇలాంటి అంశాలు సినిమాను బాగా ఎలివేట్ చేశాయి. ఓపెన్ ఎండ్ ఇచ్చినప్పుడు సినిమా మీద చర్చలు సాధారణంగా ఎక్కువగానే వుంటాయి. ఈ చర్చలే సినిమా విజయవంతం అవ్వడానికి ఇంకా దోహదమయ్యాయి.

భూమి కోసం పోరాటం అన్న సమస్య పాతదే. అయితే పోరాడే వ్యక్తులకు అది తీవ్రమైంది. ఆ తీవ్రత, పల్లెవాసులు జమీందారును ఎదిరించే తీరులో స్పష్టంగా కనబడుతుంది. చూసే ప్రేక్షకులు ఈ పోరాటానికి, సినిమాలో చూపించే సాంప్రదాయాలకు బలంగా కనెక్ట్ అవుతారు.

KGF, కాంతారా సినిమాలతో కన్నడ చిత్రరంగం, మరెన్నో సినిమాలతో తెలుగు, తమిళ, మలయాళ చిత్రరంగాలు బాలీవుడ్‌ను సవాలు చేస్తున్నాయి.

-ఎస్‌వీఎమ్ నాగ గాయత్రి, 94404 65797

సీరియల్ ప్రారంభం

(13)

నిర్వేదం

సాగర్ శ్రీరామకవచం

(గత సంచిక తరువాయి)

అది ఎంత ఎత్తు వుందో, అంతకంటే మించిన పొడుగ్గా సాగివుంది. మా చూపులు సారించలేనంత పొడుగ్గా విస్తరించి వుంది.

మేమున్న లోయకి అడ్డంగా చిన్నపాటి సెలయేరు సాగిపోతా వుంది. సెలయేట్లో నీళ్ళు తాగుతున్న పులులు గుంపుని చూసి భయంతో "స్వామీ! సూసినారా, పులులు గుంపు, యేడన్నా ఆటికి కన్పడకుండా దాంకోవాల" అని నాకే వినబడేంత రహస్యంగా మాట్లాడింది.

నిజమే! వాటి కంట బడకూడదు, మాకు తెలియకుండానే నక్కి నక్కి పాకుతా మేము నడిచి, దాటి వచ్చిన అడవి వైపుకి వెనక్కి మళ్ళాము.

ఓ పదినిమిషాల పాటు పాక్కుంటా తిరిగి అడవిలోకి సాగిపోయాము. చెట్ల చాటుగా నిలబడిన తర్వాత ధైర్యాన్ని చిక్క బెట్టుకొని, పిరికి దానిలా ఒగరుస్తున్న చుక్కమ్మ భుజంపై, ఆనక నడుమ చేయి వేసి దగ్గరికి లాక్కుంటా.

"ఎందుకి అంత పిరికిదానిలా భయపడ్డావు. పులులు ఏం చేస్తాయి. మనల్ని చంపితింటాయి. చావుకంటే ఆనందం ఏముంది? వాటికి మనం ఆహారం కావటం కూడా ఓ అదృష్టం కాదూ" అన్నాను నిర్వేదంగా ఆమె వైపు చూస్తా.

"నీపాటి గ్యానం నాకేడది సామి! నిజమే, ఎప్పుడో సావాల్సింది దాన్ని, నీ కోసమే బతికి బట్ట కట్టి నానేమో" అంటా నా భుజంపై వాలిపోయింది.

ఆమెని మరింతగా దగ్గరగా తీసుకున్నాను. నాలోని పురుషతత్త్వం ఆమెలోని స్త్రీతత్వాన్ని ఆక్రమించింది.

మేమిద్దరం కలుసుకుంటా వుండగా, పులుల గుంపుమమ్మల్ని చూస్తా గంభీరంగా దాటుకుంటా పోవటం చూసి ఆశ్చర్యపోయాను. చుక్కమ్మకి ఆ దృశ్యం కనబడలేదు, ఆమె తమకంగా, మైకంగా కళ్ళు మూసుకొని వుంది. ఆమెని మరింత ధైర్యంగా ఆక్రమించుకోసాగాను. దూరాన కదిలిపోతున్న పులులగుంపు సాక్షిగా నాలోని పశువు మరింతగా విజృంభించింది. ఇటువంటి తన్మయం నా జీవితంలో ఏనాడూ సంభవించలేదు. ఆ మధురానుభూతికి తారాస్థాయిలో వున్న నేను చుక్కమ్మని ముద్దులతో మరింత మురిపించాను.

"చుక్కమ్మా! నీవు చాలా గొప్ప అందగత్తెవి. నాకింత ఆనందాన్ని యిచ్చావు. నీరుణం తీర్చుకోలేను" అన్నాను.

"అది శాస్వితం సేసుకోసామి, నిన్ను నమ్ముకొని కాలం గడుపుతా" అంటా నన్ను మరింతగా పెనవేసుకొంది.

"బైరాగులం! మనకి ఏదీ శాశ్వితం కాదు"

"నిజమే సామి! మనిషితో పాటే నీడా పోతుంది" అంది చుక్కమ్మ నర్మగర్భంగా.

నేనేమీ బదులివ్వలేదు.

పులులగుంపు మమ్మల్ని దాటుకపోయిన వైచిత్రి భ్రమలోంచి ఎంతసేపటికి బైటపడలేక పోయాను.

నీటిలో మునిగి జలకాలాడాము. తడిసిన చీరలో వున్న చుక్కమ్మ అప్సరసలా వెలుగులు చిమ్మింది. ఆమె అందాన్ని ఆహ్వానించాను.

ప్రకృతిలో మా కలయికలోని ఆనందం ఈ జన్మకి చాలనిపించింది. అదే మాట చుక్కమ్మతో అంటే మురిసిపోయింది.

బైరాగి జీవితంలోని ఆనందం ఎంతో గొప్పదని బదులిచ్చింది.

నిజమే! సమస్తం త్యజించి, ఏదీ వద్దని నిరాకరించి, ఇలా నిర్వేదంగా బతకటంలోని ఆనందం జీవితంలో అందరికీ అందేది కాదని తెల్సుకున్నాక "ఆనందో(బ్రహ్మ" అన్నాను.

"చుక్కమ్మా! నీ సాంగత్యంతో నన్ను మరో సంసార రొంపిలోకి లాగేస్తావేమోనని భయంగా వుంది. డాక్టర్‌గా కోట్లు సంపాదించే వృత్తిలోనించి విముఖతతో బైటకి వచ్చాను. భార్యనించి దూరం జరిగాను. నా పరిశోధనలనించి నిర్వికారంగా బైటకి దూకాను. నేను అమితంగా శోధించే సముద్రాన్ని వదిలేసి వచ్చాను. కానీ నీ సహచర్యంలో ఈ గంటసేపటి నుంచి ఎంతో ఆనందాన్ని పొందాను. నా జీవితంలో పొందలేని మధురానుభూతిని యిచ్చావు. నీకాళ్ళ దగ్గర కుక్కలా కట్టిపడేసే అదృష్టాన్ని, దురదృష్టాన్ని నాకు ప్రాప్తింప చేశావు" అన్నాను చుక్కమ్మని అలానే నీళ్ళల్లో పొదివి పట్టుకొని! చుక్కమ్మ చందమామలా చల్లగా నవ్వింది.

అంతలోనే చుక్కమ్మ నన్ను విదిలించుకొని, భయంగా చూస్తా "స్వామీ! ఎవరో వస్తున్నట్టుంది... మాటలు వినపడతా వుండాయిగానీ, యింక లెగుస్వామీ!" అంది.

నిజమే! దూరంగా చప్పట్లు కొడ్తా, మమ్మల్ని పిలుస్తా మల్లయ్య, ఓబులేసు బైరాగులు ఇద్దరూ పరిగెత్తుకుంటా రాసాగారు.

"మనం కల్సుకోటం వాళ్ళు చూసి వుంటారంటావా" అని అడిగాను అనుమానంతో చుక్కమ్మతో.

"చూస్తే! ఏమవుతోంది. నా ఎంట పడకుంటా తోక ముడుచుకుంటారు నాయాళ్ళు" అన్నది కోపంతో.

రాత్రిళ్ళు కనిగిరి మఠంలో వాళ్ళు ఆమెని వేధించిన సన్నివేశాలు కొన్ని నాకు ఆ సమయంలో గుర్తుకి వచ్చాయి. వాళ్ళని గద్దిస్తా చుక్కమ్మ అరిచిన అరుపులూ నాకు గుర్తుకివచ్చాయి.

చుక్కమ్మ మీద నా అభిమానం పొడుచుక రావటం నా కళ్ళు తేరిపార చూస్తున్న ఆమెకి అర్థమయ్యిందో లేదో చెప్పలేనుగానీ, ఆమె ధైర్యంగా నా చేతిలో తన చేయి కలిపి ముందుకి నడవటం ద్వారా

నాలోని పిరికితనాన్ని మటుకు ఆమె చాలా దూరం చేసింది. అంతేకాదు చుక్కమ్మ నాకు మరింత చేరువగా జరిగి.

"సామీ! నీవెంతో పిరికివాడివి. అందుకే బైరాగుల్లో కలిశావు" అంది గోముగా.

ఆమె మాటల్తో నాకు జ్ఞానోదయం శానా అయ్యింది. అంత చదువు చదువుకున్న నా డాక్టర్ సహచారిణి, (భార్య అనగూడదు) స్వరాజ్యం కూడా నన్ను అర్థం చేసుకోలేదు. నాలో ఓ పిరికివాడు దాగున్నట్టుగా ఏ మాత్రం చదువులేని చుక్కమ్మ ఎంత జీవితానుభవంతో నాలోని పిరికివాడిని ఎంత బాగా గుర్తించిందో గ్రహించి ఆశ్చర్యపోయాను.

జీవితం నుంచి ఎన్నో రకాలుగా చిన్నప్పటి నుంచి పారిపోతా వచ్చిన నా బేసిక్ ఇన్‌స్టింక్ట్‌ని చుక్కమ్మ ఎంత బాగా అర్థం చేసుకుందో గ్రహించి సిగ్గుపడిపోయాను.

నా బాల్యపు రోజులు గుర్తుకి వచ్చాయి: నా ప్రేమని నిరాకరించిన సక్కుబాయి ఔన్నత్యం నన్ను వేధించింది. ఇద్దరి కులాలు వేరు కావటం మూలంగా నన్ను అమితంగా ప్రేమించిన సక్కుబాయి దూరం కావడం మూలంగానే నాలో ఈ నిర్వేదం నిండుక పోయిందని ఆత్మీకరించుకున్నాక గానీ నాలోని ఆమె ఎడబాటుకి, నా కుంగుబాటుకీ కారణాలు వెతుక్కోలేకపోయాను.

లోకంలో ఎందరో ప్రేమికులు. తొలిప్రేమని దక్కించుకునేవాళ్ళు కొందరే కానీ ఆ ప్రేమ క్షణికంగా పారేసుకున్న జంటలూ చాలామంది వుంటారు. కానీ తొలిప్రేమ చావదు. నిత్యం బతికే వుంటుంది.

ఈలాగా గతంలోకి జారిపోతున్న నన్ను మల్లయ్య, ఓబులేసు చెంతకి చేరి ఆప్యాయంగా ఆనందం ప్రకటిస్తా కౌగిలించుకోటంతో ఈలోకంలోకి వచ్చాను.

కళ్ళనీళ్ళతో మల్లయ్య "సామీ! తమరు మాకంటబడతారని ఎంతగా ఎదికినామో ఆ దేవుడి కెరుక. రోజా ఓబులేసు కలల్లో కూడా తమరి పేరే మదికి తెచ్చుకునేవాడు. ఎంత సంతోషం. ఎంత ఆనందం. భజరే గోపాలం" అంటా ఆనందంగా చిందులేశాడు. పాటలు పాడుతా, చిందులు వేస్తా ముందుకు సాగారు. వాళ్ళని నేను మవునంగా అనుసరించాను. చుక్కమ్మ నా చేయి పట్టుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తా నావెంటే రాసాగింది.

దారిలో ఓ కుక్కపిల్ల ఎదురుపడింది. ఓబులేసు దానిని దగ్గరికి తీసుకొని ఆప్యాయంగా దాని తలనిమిరాడు. అది విశ్వాసం ప్రకటిస్తా, మాకు దారి చూపించేదానిలా ముందుకు పరిగెత్తింది.

"ఓబులేసూ! ఆకుక్క నిన్నెలా గుర్తుపట్టింది" చుక్కమ్మ అనుమానంగా అడిగింది.

నిర్వేదం

"అది నాకు తెలియదు, కాని కుక్కల్ని మచ్చిక సేసుకోటంలో నేను పెద్ద దిట్టని కదా?" పెద్దగా నవ్వుతా తన బారెడు గడ్డం దువ్వుకున్నాడు చిరునవ్వుతో సమాధానమిస్తా.

కొండకి అతి సమీపంలోకి వచ్చాము. సన్నటి కాలి దోవ కనబడితే ఆ తోవనే పోతా కొండ ఎక్కసాగాము. బెత్తం స్వామి ఆ కొండ దగ్గరే దొరుకుతాడనే ఆశ మా అందరిలోనూ బలంగా వుంది.

ఎవరీ బెత్తం స్వామి. ఆయన్ని చేరుకోవాలని మాకెందుకీ ఆత్రం. ఎందుకీ పరుగు! ఈ నడక! ఇందాక పులుల గుంపు కనుచూపుమేరలో నన్నూ చుక్కమ్మని దాటు కొని పోవటం, మేము మరణానికి చేరువలో సంగమించటం కేవలం యాదృచ్ఛికమా? లేక అదృష్టమా! కామమా! జీవితేచ్ఛనా? ప్రశ్న, ప్రశ్న వెంట ప్రశ్న!!

నాలో నేను జవాబు చెప్పుకున్నానిలా అదో వెతుకులాట. ఎండ మావుల వెంట లేదూ మృగతృష్ణ వెంట పరుగులాటలోనే జీవితం అంతా తెల్లారాల్సిందే. ఓ రాతిని లేదూ ఈ మధ్యన తెల్ల పాలరాతిని నల్లరాత్రుళ్ళని దాటటానికి దుఃఖాన్ని సంభాళించుకోటానికి పూజలూ, భజనలూ చేస్తున్న వైనంలో ఓ పిరికితనం చాటుగా వున్నట్లు ఈ ఎస్కేపిజంలో ఓ అస్తిత్వపు నైరాశ్యాన్ని దాటుకోటానికీ, ఎల్లలు లేని స్వేచ్ఛని అనుభవించటానికీ సంకెళ్ళు తెంచుకొనే క్రమంలో మరో కొత్త జైలులోకి ప్రవేశించిన్నట్లు ఈ అంతులేని పరుగుని నెమ్మదిగా నిలకడగా చిన్ని అడుగులుగా మేము ప్రయాణిస్తున్నాము. ఇదో మగత. ఓ తృష్ణ ఏ బాధ్యతాలేని జీవితాన్ని ఆహ్వానించే ఓ క్రమం. నేను ఇంతగా చదువుకున్న డాక్టర్ని. ఎందుకు మానసికంగా విచలితుడ్ని అయ్యాను? పిచ్చివాడిలా నటించాను. వెర్రివాడిలా ప్రవర్తించాను.

షేక్స్పియర్ ఫేమస్ పద్యం "ది సెవెన్ ఏజెస్ ఆఫ్ మ్యాన్" గుర్తుకి వచ్చింది. "ఆల్‌ది వరల్డ్ ఈజ్ ఏ స్టేజ్, అండ్ ఆల్ ది మెన్ అండ్ వుమెన్ మియర్‌లీ ప్లేయర్స్ దేహేవ్ దైర్ ఎక్సిట్స్ అండ్ దైర్ ఎంటర్రెన్సెస్, అండ్ ఒన్ మ్యాన్ ఇన్ హిజ్ టైమ్ ప్లేస్ మెనీ పార్ట్స్, హిస్ యాక్ట్స్ బీయింగ్ సెవెన్ యేజెస్. యట్ ఫస్ట్ ది ఇన్‌ఫాన్ట్..."

ఆ తర్వాత ఫ్రెంచ్ పదంతో "సాన్స్ టీత్, సాన్స్ ఐస్, సాన్స్ టేస్ట్, సాన్స్ ఎవిరిథింగ్" ముసలితనంలో విత్ అవుట్ అనే ఇంగ్లీష్ పదంతో కాక సాన్స్ అనే ఫ్రెంచ్ పదంతో ఆ పద్యం ముగించటంలోనే ఎంతో ఔచిత్యం వుంది.

నేను కూడా అంతే. అన్నీ వదులుకొని, అన్నీ వదిలించుకొని, విదిలించుకొని, దులిపేసుకొని, త్యజించుకొని గౌతమబుద్ధుడిలా సమస్తాన్ని పరిత్యజించి, పరిత్యాగిలా, చెట్లు కూలుతున్న దృశ్యాల వెంట అగచాట్లు తప్పించుకొని చావుని ఆహ్వానిస్తా...

ఏమిటీ ఆలోచనల కందిరీగలు.

ఈలోగా ఓబులేసు పెద్దగా కేకలేశాడు. "చుక్కమ్మా! పంతులా! పరిగెత్తండి. తేనెటీగల దండు తరుముతా వస్తాంది. అవి కుట్టినాయంటే దానెమ్మ మనం ఆధాటున సచ్చిపోతాము. లగెత్తండి" అనేస్తా పరుగు ప్రారంభించాడు. వెనక్కి తిరిగి చూసాను.

కందిరీగలు దండులా మా మీదకి దూకబోతున్నాయి. పరిగెత్తాము. సాన్స్ ఫీట్, పాదాలు లేకుండా గాలిలో దూకుతా, దుముకుతా... పరుగో... పరుగు.

చుక్కమ్మ లగెత్తలేక వెనకబడి పోయింది. ఆ తర్వాత కూలబడి పోయింది.

"పంతులు సామీ" అని పెద్దగా అరిచింది. వెనక్కి తిరిగి చూశాను. ఓ బండరాయిని తట్టుకొని చుక్కమ్మ రక్తం ఓడుతా పడిపోయి వుంది. ముందుకి చూశాను. ఓబులేసు, మల్లయ్య మాకంటే వేగంగా పరిగెత్తుతా ఆమడ దూరంలో మసక మసకగా కాన వచ్చారు.

చుక్కమ్మని తేనెటీగల దండు దాడి చేసే క్రమం ఏ క్షణంలో నయినా ప్రారంభం కావచ్చు.

అంతే వేగంగా వెనక్కి పరిగెత్తాను. ఒకటా పదా యాభయ్యా, వందా, రెండు వందలా? మూడు వందల అడుగుల దూరం పరిగెత్తాను! అయినా దూరం పెరుగుతానే వుంది. తీరా చూస్తే కనుచూపు మేరలో చుక్కమ్మ కన్పించలేదు. "చుక్కమ్మా!" అని పెద్దగా అరిచాను కాదు ఏడ్చాను.

"పంతులా, ఈడ, ఈడ" అంటా చుక్కమ్మ కేకవేసింది. ఆ అరుపువైపుకి దిక్కు సారించాను. ఓ చెట్టు చాటున చుక్కమ్మ కన్పించింది. ఆమె వైపు కదలబోతుంటే తేనెటీగల దండు నావైపుకి రాసాగింది. భయవేసింది. నా మెడికల్ కిట్‌లో తేనెటీగల దాడికి తట్టుకొని మరణాన్ని రక్షించుకొని మందులు తేలేదు. అయితే అదృష్టం.



నాకెదురుగా బెత్తం స్వామి ప్రత్యక్షమయ్యాడు! గాలిలో బెత్తం వూపుతా నాచేయి పట్టుకొని లాగి ఓ సెకన్‌లో నన్ను తన వీపుమీద ఎగరేసుకొని, చిటికలో గాలిలో ప్రయాణిస్తా, త్రుటిలో చుక్కమ్మ చెంత చేర్చాడు. అదృష్టం కొద్దీ తేనెటీగల దండు మరో వైపుకి మళ్ళిపోయాయి.

చుక్కమ్మ గుండెలు బాదుకుంటా "బెత్తం స్వామీ! దండాలయ్యా, నీపాద పాదాన పరిపరి దండాలు. మమ్మల్ని కనికరించి బతికించినావు, నీవు మాకిలా ఎదురుపడటం ఏమిటీ, మాపానాలు రచ్చించటం ఏమిటీ? నీ మహిమలు అంతా యింతా కాదు స్వామి, రచ్చ రచ్చ" అంటా ఆయన పాదాల మీద కన్నీటితో పడిపోయింది.

-ఇంకావుంది

పొ రు గిం టి ప రి మ ళ ం
10

బహుమతి



-మేరీ ఒలివర్ (1935 - 2019)
అమెరికన్ కవయిత్రి

1. ఈ ఉదయం
ఈ ఉదయం ఎర్ర పక్షులు గుడ్లు పొదిగాయి..పిల్లలు అప్పటికే ఆహారం కొరకు కిచకిచా అరుస్తున్నాయి. ఎక్కడ్నుంచి తాము వచ్చామో వాటికి తెలియదు, ఇంకా! ఇంకా! ఊరకే అరుస్తున్నాయి, వాటికి మరో ఆలోచన లేదు.అవి కండ్లు ఇంకా తెరవలేదు, నిరీక్షించి చూసే ఆకాశం గురించి వాటికేం తెలీదు.లేదా వేల లక్షల చెట్ల గురించీ తెలీదు. వాటికి రెక్కలున్నాయన్న సంగతీ వాటికి తెలీదు.ఆ విధంగా, పొరుగున జరిగే ఒక సాధారణ సంఘటనలా, అక్కడ ఒక అద్భుతం చోటు చేసుకుంటోంది.

2. టామ్ షా కోసం (1945 - 2014)
ఈ చలి ఎక్కడ నుండి వచ్చింది?
"ఇది మీ స్నేహితుడి మరణం నుండి వచ్చింది."
నేనెప్పుడూ, ఇక నుండి ఇలా చల్లగా ఉంటానా?
"లేదు, అది తగ్గుతుంది. కానీ ఎప్పుడూ నీతోనే ఉంటుంది."
దానికి కారణం ఏంటి?
"మీ స్నేహం ఎప్పుడూ మంటలా అందంగా ఉండదు కదా?"

3. నాకు తెలుసు
పువ్వు మరింత త్వరగా తెరుచుకునే విధంగా ముద్దుపెట్టుకునే వ్యక్తి నాకు తెలుసు. పువ్వులు మధురంగా ఉంటాయి. అవి చిన్నవైన, అందమైన జీవితాలను కలిగి ఉంటాయి. అవి చాలా ఆనందాన్ని అందిస్తాయి. వాటికి వ్యతిరేకంగా చెప్పగలిగేది ప్రపంచంలో ఏమీ లేదు. విచారకరంగా, అవి ముద్దుపెట్టుకోగలిగేది గాలిని మాత్రమే.
అవునవును! మనం అదృష్టవంతులం.

4. చిన్న మృగం
ఆ అందమైన చిన్న మృగం - పద్యం, దానిదైన ఆలోచన దానికుంది. కొన్నిసార్లు నేను ఆపిల్‌ను కోరుకుంటాను, కానీ అది ఎర్రటి మాంసం కోరుకుంటుంది. కొన్నిసార్లు నేను ఒడ్డున ప్రశాంతంగా నడవాలని కోరుకుంటాను, కానీ అది తన బట్టలన్నీ విప్పి లోపలికి దూకాలని కోరుకుంటుంది. కొన్నిసార్లు నేను చిన్న పదాలు వాడాలని, వాటిని ముఖ్యమైనవిగా చేయాలని కోరుకుంటాను, కానీ అది నిఘంటువుని, అవకాశాలను బిగ్గరగా అరవడం ప్రారంభిస్తుంది. కొన్నిసార్లు నేను సంక్షిప్తీకరించి, వస్తువులను క్రమబద్ధీకరించి, కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను, కానీ అది నవ్వుతూ, నన్ను దారుణంగా పిలుస్తూ, బొచ్చు కాళ్ళపై గది చుట్టూ డ్యాన్స్ చేయడం ప్రారంభిస్తుంది. కానీ కొన్నిసార్లు, నేను నీ గురించి ఆలోచిస్తున్నప్పుడు, హాయిగా నవ్వుతున్నప్పుడు, అది నిశ్శబ్దంగా కూర్చుని, తన గడ్డం కింద ఒక పాదం ఆన్చి అలాగ వింటుంది.

5. చెరువు
మరొక వేసవి ఆగస్ట్, మరోసారి నేను ఎండని గ్రోలుతున్నాను..లిల్లీలు మళ్లీ నీటిలో వ్యాపించాయి.అవి ఒకదానికొకటి తాకడం అంటే ఏమిటోనని నాకు ఇప్పుడు తెలుసు. నేను చాలా సంవత్సరాలుగా ఇక్కడ లేని ఆ సమయంలో నేను నా జీవితాన్ని కొనసాగించాను. కొంగ లాగా, అతను బొంగురుగా మాత్రమే పాడగలడు, ఎవరు అతను పాడాలని కోరుకుంటారు, నేను పాడగలను అని అనుకుంటాను. ప్రతి స్వరం నుండి కొద్దిగా కృతజ్ఞతలు కొనియాడతగినది. ఇది ఎలా ఉంది, ఇది ఇలానే ఉంటుంది: నా జీవితమంతా నేను ఆనందం కానిది తప్ప, మిగతాది అనుభవించగలిగాను, నాకు గుర్తుంది. మనలో ప్రతి ఒక్కరికి నీడ వుంటుంది. ఇప్పుడు మళ్ళీ వేసవి వచ్చింది. లిల్లీలు ఒకదానికొకటి తలొగ్గడం చూస్తున్నాను, ఆపై గాలికి దగ్గరగా, ఒకదానికొకటి దగ్గరగా జరగడం, వాంఛతో ఒరగడం చూస్తున్నాను. ఇక, నేను తిరిగి ఇంటికి బయలుదేరుతాను. ఎవరికి తెలుసు, బహుశా నేనూ పాడతానేమో...



6. ఇప్పుడే అన్నాను
నేను మీకు హాస్యాస్పదంగా ఏదో చెప్పాను. ప్రతిస్పందనగా, మీ అద్భుతమైన నవ్వు. ఈ రోజులు..సూర్యుడు తూర్పు వైపు తిరిగి ఈదుతున్నాడు, నీటిపై కాంతి మునుపెన్నడూ లేనంతగా మెరుస్తుంది. నేను ప్రతి వసంతాన్ని గుర్తుంచుకోలేను, నేను చాలా సంవత్సరాలు.. ప్రతిదీ గుర్తుంచుకోలేను- ఉదయపు చుంబనాలు తీయనైనవా లేక సాయంత్రాలా లేక వీటి మధ్యలో వున్నవా? నాకు తెలిసిందల్లా "ధన్యవాదాలు" ప్రతి చోటా కనిపించాలని. కాబట్టి, నేను దానికి సరైన స్థలాన్ని కనుగొనలేకపోతే- "ధన్యవాదాలు, ధన్యవాదాలు."

7. బహుమతి
నా ఆత్మ సాక్షీ; నిశ్చలంగా, స్థిరంగా ఉండు. గడియారం నుండి సమయం తరిగిపోతున్నప్పటికీ భూమి మరియు స్వర్గం రెండూ ఇప్పటికీ చూస్తున్నాయి. విశ్వాసంగా,వేగంగా వుండే మీ నడక నెమ్మదిగా మారింది. కాబట్టి, మీరు అవసరమైతే నిదానించండి, కానీ మీ హృదయాన్ని దాని పాత్రను దానిని పోషించనివ్వండి. మీరు ఒకసారి ప్రేమించబడినట్టే, గాఢంగా మరియు ఓరిమి లేనట్టుగానే ఇప్పటికీ ప్రేమించండి. మీరు కృతజ్ఞతతో ఉన్నారని, బహుమతి ఇవ్వబడినదని దేవునికి, ప్రపంచానికి తెలియజేయండి. ★



అనువాదం :
పి.శ్రీనివాస్‌గౌడ్,
99494 29449

రమణీయం 6

యేమినేని వెంకటరమణ, 98483 62588

ఆఖరి మజిలీ వరకు ఆమె ఏడుస్తూనే వుంది...

ఆమె ఏడుస్తూనే వుంది. ఎవరు ఓదార్చినా ఆమె ఏడుపుని అరికట్టలేక పోయారు. అలా అలా ఆఖరి మజిలీ వరకూ ఆమె ఏడుస్తూనే వుంది. తన జీవితంలో ఏడుపుని మర్చిపోయిన సందర్భాలు చాలా తక్కువే... ఆమె పుడుతూనే పురిటినొప్పులతో అమ్మని ఏడిపించింది. దాని ఫలితంగా తల్లి గర్భం నుండి బాహ్య ప్రపంచంలోకి తన ప్రయాణం ఏడుపుతోనే ప్రారంభమైంది. తొలిచూలు ఆడపిల్ల పుట్టింది. నానమ్మ తాతయ్యల నిరాదరణ, ఊహ తెలిసే నాటికి అమ్మానాన్నల ఆంక్షలతో మనో వేదన, ఆడి పాడే వయస్సులో ఆటపాటలు మగవారి జన్మహక్కులాగా ఈ సమాజం విధించిన నిబంధనలు. బంధువులు గీసిన లక్ష్మణరేఖలు ఆమెను ఇంకా ఇంకా ఏడుపు బాట పట్టించాయి. గోళీలాటలు, వంగుడు దూకుళ్ళు, కంచాలాటలు, బిళ్ళంగోడు ఆటలు చిన్నతనంలో తనను ఆడనివ్వలేదు.

ఏంటే మగరాయుళ్ళాగా ఆ ఆటలు. ఎంచక్కా నాలుగు చుక్కలు పెట్టి ఇంటి ముందు ముగ్గులు నేర్చుకో, అలా! ముందుగా ఆవు పేడతో కళ్లాపి చల్లడం నేర్చుకో. ఇంట్లో అంట్లు తోము. కూరగాయలు తరగడం నేర్చుకో. రేపు అత్తారింటికెళ్ళాక వారిని మెప్పించేలా వంటలు చేయాలి. వాటిని జాగ్రత్తగా నేర్చుకో.

ఇదీ ఆడపిల్ల బాల్యంలో తన భావాలు, అభిరుచులు, ఆలోచనలకు సజీవ సమాధి కట్టినట్టుగా తల్లిదండ్రులు, చుట్టుపక్కలవారు తనకు సలహాలు ఇవ్వడంతో అక్కడా ఓదార్పు లేని ఏడుపు... కళ్ళల్లో నీటిని దిండులో ఇంకించిన సందర్భాలూ చాలా వున్నాయి. యవ్వన దశలో మొదలైన అనుమానపు చూపులు తనకు తెలియకుండా తనపై నిఘా... మగ వారితో మాట్లాడకు ఆడవారితోనే మాట్లాడు.. అంతేకాదు ఫలానా అమ్మాయి తల్లి మంచిది కాదు, ఆ అమ్మాయితో మాట్లాడకు.. ఇలా తన వ్యక్తిత్వాన్ని ఉప్పుపాతరేసి తన స్నేహం ఎవ్వరితో సాగించాలి.. ఎవ్వరితో ముగించాలి అని నిర్ణయించే తల్లి ధోరణి వల్ల ఆమె ఏడుపు కొనసాగుతూనే ఉంది.

బాల్యం, కౌమారం, యవ్వనం ఇన్ని దశలు దాటినా ఆమె స్వేచ్ఛలేని ఆడపిల్లలా కట్టుబాట్ల పంజరంలో నిత్యం ఏడుస్తూనే వుంది.

ఇక కలలు కనాలన్నా భయమే. తన కలల్లో ఏ రాకుమారుడో లేదా సుకుమారుడో వచ్చినా కన్నెగా తాను వూహాల్లో తేలియాడటమే తప్ప చేయగలిగిందేమీ లేదు. ఇలలో జరగని దాన్ని గుర్చి ఇక్కడా ఏడుపే మిగిలేది. తానూ మనిషే, తనకూ కొన్ని అభిప్రాయాలు ఆలోచనలు, ఆశయాలు ఉన్నాయని గొంతెత్తి అరవాలని ఉన్నా గాని 'ఏమే అపుడే పెద్దదానివయ్యావా? మాకు ఎదురు చెప్పేంత ధైర్యం వచ్చిందా?' అంటూ నిందించే తమ పెద్దరికాన్ని నిగ్గుతీసి అడగలేక, తన అసహాయతకు తననే నిందించుకుంటూ ఆమె ఏడుస్తూనే వుంది.

ఐదో తరగతి, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఇలా తన చదువు పట్టాల చిట్టా పెరుగుతున్నాగాని ఆడపిల్ల అనే చక్రం నుండి దానిలోని ఆంక్షలు నుండి బయటపడలేక ఆమె ఏడుపు కొనసాగిస్తూనే ఉంది. కులం కట్టుబాట్లు, సమాజం కట్టుబాట్లు తెంచుకోవాలని ఉన్నా మనమేమీ కోటీశ్వరులం కాదు, అతి సామాన్యులం. కష్టమైనా ఇష్టం లేకున్నా మాయందు కనికరించి మేము చూసిన సంబంధమే చేసుకోవాలని ఇక్కడ మాత్రం కాళ్ళ బేరానికి వచ్చినట్టుగా బతిమిలాడుతున్న తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలనే హైందవ సంప్రదాయాలకు సరిపెట్టుకొని సంప్రదాయంగా అత్తారింట అడుగుపెట్టినా అక్కడా విడవని ఏడుపే. అత్తగారి సాధింపులు.. భర్త వేధింపులు.. ఆడపడుచు చులకన చూపులు అన్నీ దాటుకోవాలన్నా గాని ఏడుపు పడవని ఎక్కాల్సిందే.

తాను తల్లిగా మారడానికి పురిటినొప్పులు మునిపంట బిగబట్టినా తొలికాన్పు ఆడపిల్ల కావడంతో అక్కడా అత్త మామల నిరాదరణ. భర్త ఈసడింపులు. తన ఆరోగ్యం బాగాలేక పోయినా అత్తవారింట గొడ్డు చాకిరీ చేయలేక 'ఏమిటీ ఈ స్త్రీ జన్మ భగవంతుడా!' అంటూ ఆమె ఎన్నోమార్లు ఏడుస్తూనే ఉంది.

కాలక్రమంలో తన పిల్లలు మారుతున్న కాలమాన పరిస్థితులను తనకే వివరించి తనను పాతకాలపు ఛాందసవాదిగా ముద్రించి తనను తన భర్తను కాదని ప్రేమ వివాహాలు చేసుకొని రెక్కలు వచ్చి పక్షుల్లా ఎగిరిపోయిన

తన బిడ్డల కోసం అనుక్షణం అలుపులేని ఏడుపులు.. ఆమెను ఆమే ఓదార్చుకొనే స్థితికి వచ్చాయి. అన్ని విషయాల్లో రాజీ పడుతూ ఏడుపుకు మాత్రం రాజీపడకుండా ఆమె ఏడుస్తూనే ఉంది. భగవంతుడా నా జీవితంలో ఏదీ నాకు అనుకూలంగా జరగలేదు. కనీసం చావుల్లోనైనా తన భర్త కంటే తానే ముందుగా ముత్తయిదువుగా పోవాలనుకునే చాలామంది ఆడవారు తన పసుపు కుంకుమ పోగొట్టుకుని ఏడుస్తూనే వున్నారు. భర్త బతికుండగా తానే మహారాణిలా చలామణి అయిన ఆమె భర్త మరణంతో అభద్రతా భావంతో ఏడుస్తూనే ఉంది. తనకు తన భర్త దూరమైతే ఆ ఆలోచనలే ఆమెకు పుట్టెడు దుఃఖంతో ఏడ్చేలా చేస్తుంది. తిట్టుకొన్నా కొట్టుకున్నా చివరకు రాజీపడే దంపతుల్లో ఎవరు ముందు పోయినా మిగితా వారికి నరకమే.

అన్నింటికీ కొడుకు కోడలి మీద ఆధారపడాల్సిందే. అలాంటి పరిస్థితుల్లో భర్త ముందుగా పోయిన భార్య మానసిక వేదన వర్ణనాతీతం. తన పిల్లలే తనను విసుక్కున్నాగాని అదే ఆయన బతికుంటే..ఈ ఆలోచనతో ఆమె అభద్రతా భావానికి గురై పుట్టెడు దుఃఖంతో రోదిస్తూనే ఉంటుంది.

ఆడదాని జీవితంలో ఏడుపులేని ఘట్టాలు చాలా చాలా తక్కువే. అందుకే ఆమె ఆఖరిమజిలీ వరకూ ఏడుస్తూనే ఉంటుంది. ★

స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి బలమైన శక్తిగా భారత్

భారతీయులు గణితంలో స్వతహాగా ప్రతిభావంతులు. గణితం, ఇంగ్లీష్ కలిస్తేనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ. ఇదే విషయం బిల్‌గేట్స్‌కు చెప్పా. ఒక్క మైక్రోసాఫ్ట్ తీసుకొస్తే దానివెనుక అనేక సంస్థలు వస్తాయని అప్పటి ఆలోచన. చెన్నై, ముంబయి, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి వచ్చాకే హైదరాబాద్‌ను ఎంచుకున్నారు. మిగతా రాష్ట్రాలు ఇచ్చే రాయితీల కంటే అదనంగా ఇస్తామని చెప్పాం. ఇంతగా శ్రమించాక హైదరాబాద్‌లో ఐఎస్‌బీ పెట్టాలన్న కల సాకారమైంది. అందరు పారిశ్రామికవేత్తలను సంతృప్తిపరిచి ఐఎస్‌బీని ఇక్కడికి తెచ్చాం. మైక్రోసాఫ్ట్ వచ్చాకే హైదరాబాద్‌లో ఐటీ విప్లవం ఊపందు కుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నెలకొన్నాయి.

20 ఏళ్లలో హైదరాబాద్ ఎంతో ప్రగతి సాధించింది. ఐటీ, బయోటెక్ రంగాల్లో హైదరాబాద్ ఎంతో ప్రగతి సాధించింది. బయో టెక్నాలజీలో జినోమ్ వ్యాలీ కొత్త విప్లవం సృష్టించింది. మర్యాద ఇచ్చి పుచ్చుకోవడంలోనే పనులు సమకూరుతాయనే సూత్రం నమ్మాను. 162 కిలోమీటర్ల ఓఆర్ఆర్ హైదరాబాద్‌కు మణిహారం. ఓఆర్ఆర్ పక్కన వచ్చిన పచ్చదనం హైదరాబాద్‌కు గ్రీన్‌సిటీ అవార్డు తెచ్చింది. ఇప్పుడు నేను కొత్తగా ప్రతిపాదిస్తున్నది డెమొగ్రఫిక్ అడ్వాంటేజ్. యూరప్, జపాన్ లాంటి దేశాలు వృద్ధాప్యంలోకి చేరుకుంటున్నాయి. ఇప్పుడు భారత్‌కు ఉన్న అడ్వాంటేజ్ యువత. వారిని అవకాశాలుగా మలచుకోవాలి. దేశంలో తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న ప్రజల్లో తెలుగువారే అధికశాతం. 2047 నాటికి భారతీయులు అధిక తలసరి ఆదాయం ఉన్నవారిగా మారతారు. 2047 నాటికి 1, 2, 3 స్థానాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ఉంటుంది. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి బలమైన శక్తిగా భారత్ ఎదుగుతుంది.

-ఐఎస్‌బీ హైదరాబాద్ ద్విదశాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన సంగతి తెలిసిందే. ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ క్రమంలో, వివిధ పార్టీలు, రంగాలకు చెందిన వారితో అల్పాహార సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జనసేనాని పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వచ్చిన హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పవన్‌ను కలిశారు. ఆయనతో సెల్ఫీ దిగి ఆనందం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన ఫొటోను గద్వాల్ విజయలక్ష్మి ట్విట్టర్‌లో పంచుకున్నారు.

జగన్ మోహన్‌రెడ్డి యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. బీసీలను జగన్ సర్కారు ఓటర్లుగా మాత్రమే చూస్తుంది. ఏపీలో ఏం అభివృద్ధి జరుగుతుందో ఎవరికీ అర్థం కావటంలేదు. రాబోయే రోజుల్లో 13 వేల గ్రామాల్లో పాదయాత్ర చేస్తాం. 2024 ఎన్నికల్లో జనసేనతో కలిసి అధికారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు పోతుంది.

రోల్ మోడల్ (48)

పొన్నాడ సత్యప్రకాశరావు

పరమేశ్వరీ పిక్చర్స్ వారు నూతన నటులతో తీయబోయే చిత్రం తాలుకా ఆడిషన్స్ హొటల్ మూన్‌లైట్‌లో జరుగుతున్నాయంటే వెళ్ళారు మూర్తిగారు. అంతా హడావుడిగా వుంది. కుశల ప్రశ్నలయ్యాక ఆడిషన్ కోసం వచ్చిన యువతీ యువకుల దగ్గర కూర్చొని పరిచయం చేసుకున్నారు. కుర్రాళ్ళ మాటలన్నీ సహజంగానే నేటి నిన్నటి నటీనటుల మీదే తిరుగుతున్నాయి. వాళ్ళ వాళ్ళ మాటలలో తమ తమ ఆరాధ్య హీరోల ప్రస్తావన వచ్చినప్పుడల్లా మెగాస్టార్, పవర్‌స్టార్, రైజింగ్‌స్టార్, స్టైలిష్‌స్టార్, ప్రిన్స్, యంగ్‌టైగర్, ఇంకా రెబల్ స్టార్, సూపర్‌స్టార్ వంటి బిరుదులు దొర్లుతున్నాయి.

మూర్తిగారు నవ్వుకుంటూ కలగచేసుకున్నారు.

"అసలు మీకు అసలు సిసలైన స్టార్ ఎవరో తెలుసా" అని అడిగారు. వారు చెప్పిన వారి వారి అభిమాన నటులు అసలు స్టార్స్ కాదు అనేశారు.. ఓ కుర్రాడు కొంచెం తెలివిగా నేటి నిన్నటి నటుల పేర్లు చెబితే ఈ ముసలాడు ఒప్పుకోడు అని పక్కనున్న స్నేహితునితో అని ఎన్టీరామారావు అన్నాడు. మూర్తిగారు కాదన్నారు.

'అక్కినేని' అన్నాడు మరొకడు. అడ్డంగా తలూపారు. అందరూ "సరే మీరే చెప్పండి" అనటంతో నవ్వి ఒకపేరు చెప్పారు మూర్తిగారు. ఓ కుర్రాడు నవ్వి "ఆయనా! నేను చూసిన పాత సినిమాల్లో ఆయన్ని చూశాను... కానీ నేను చూసిన నాలుగైదు పాత సినిమాల్లోనూ ఆయన మంచమ్మీదే కనబడేవారు... దగ్గి దగ్గి పోయేవారు. ఆయనా అసలైన స్టార్" అన్నాడు.

మూర్తిగారు నవ్వడం ఆపి అవును... ఆ దగ్గిదగ్గి పోయె ఆ ముసలాయనే మొట్టమొదటి సూపర్‌స్టార్ అని, ఎలాగంటే అని చెప్పసాగారు.

***

రేపల్లెకి చెందిన దంపతులకు నలుగురు పిల్లలు పుట్టి పోగా నాగదోషం వలన అలా జరుగుతోందని తెలుసుకుని నాగప్రతిష్ఠ చేశాక పుట్టిన పిల్లవాడికి 'నాగేశ్వరం' అని పేరు పెట్టుకున్నారు. తదుపరి ఆ కుటుంబం చిత్తూరుకు మారింది. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంది. తండ్రి సంగీత పాఠాలు చెప్పేవారు. "నాగేశ్వరం చిన్ననాడే ఆయన దగ్గర సంగీతం నేర్చుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో విద్యాభ్యాసం కొనసాగించాడు. తండ్రికి ఇతడిని లాయర్ని చెయ్యాలని ఉండేది కానీ ఈ

కుర్రాడి దృష్టంతా నాటకాల మీద సంగీతం మీదనే ఉండేది. స్కూలులో నాటకాలు వేసేవాడు. సంగీత కచేరీలు జరుగుతున్నప్పుడు ఎలాగో అవకాశం కల్పించుకుని కీర్తనలు పాడి ప్రశంసలు అందుకునేవాడు కూడా. ఇంటర్ చదువుతున్నప్పుడే వివాహం కావడం, ఆర్థిక పరిస్థితి మరింత దిగజారడంతో చదువు ఆపేసి కలెక్టర్ ఆఫీస్‌లో గుమాస్తాగా చేరాడు.

శ్రీరామ విలాస సభ అనే నాటక సమాజం తరపున నాటకాలు ఆడేవాడు. ఇంతలో భార్య గర్భం దాల్చడం, ఆడపిల్లని ప్రసవించి కన్ను మూయడం, ఆ పిల్లను సాకడం కోసం మరొక పెళ్ళి చేసుకోవడం, ఆ చిన్నపిల్ల మరణించడం తండ్రిపోవడం.. ఇలా ఒకదాని వెనక ఒకటి కష్టాలు దాడి చేశాయి. ఇల్లు విడిచి అరుణాచలం రమణ మహర్షి ఆశ్రమంలో చేరారు.

కాని ప్రాణమిత్రులు అతడిని వెతికి పట్టుకుని రమణ మహర్షి చేతనే దైనందిన జీవితంలోకి ప్రవేశించమని ఉపదేశం చేయించారు. మద్రాసు చేరుకున్న నాగేశ్వరం సినిమా వేషాల కోసం ప్రయత్నాలు చేశాడు. చిత్తూరులో అతడి నాటకాలని చూసిన ఓ పెద్దమనిషి నాటకాలను కొనసాగించడానికి ప్రోత్సాహాన్నందించాడు. అనుకోకుండా కొంత డబ్బు లభించటంతో సినిమా వ్యాపారంలోకి దిగాలనుకున్నారు. కాని ఓ వ్యక్తి అతడిని నమ్మించి డబ్బు కాజేయటంతో సినిమా తియ్యలేకపోయారు.. అదృష్టవశాత్తు నాగేశ్వరానికి బి.యన్ రెడ్డి, హెచ్.ఎం.రెడ్డిల పరిచయం కలగడం, ఇతడి ప్రతిభను తెలిసిన వారు ఇతడినే హీరోగా పెట్టి

సినిమా తియ్యడం, అది ఘనవిజయం సాధించటంతో ఇతడి ఆర్థిక కష్టాలు తీరినట్లయింది. ఆ తరువాత సినిమాలూ విజయం సాధించటంతో ఇంక వెనుతిరిగి చూడలేదు. ఒక్క నటనే కాక గానం, సంగీతం, సాహిత్యం, దర్శకత్వం నిర్మాణం వంటి అన్ని అంశాలలోనూ ప్రవేశం ఉండటంతో అతడి సినిమాలకు తెలుగు ప్రజలే కాకుండా తమిళులు కూడా బ్రహ్మరథం పట్టారు.

తమిళ సినిమా 'మీరా'లో పాత్రలకు పెట్టింది పేరయ్యారు. తులం బంగారం యాభై రూపాయలు, ఎకరం పొలం వందరూపాయలు ఉండే ఆ కాలంలో ఆయన అందరికన్నా,

ఎక్కువగా చిత్రానికి లక్షరూపాయలు తీసుకొనే స్థాయికి చేరుకున్నారు. ఏ నటుడు అందుకోని సన్మానాలు అందుకున్నారు. మైసూర్‌లో ఏనుగు అంబారి మీద ఊరేగి మైసూర్ మహారాజు సింహాసనం ప్రక్కన ప్రత్యేక ఆసనంలో కూర్చొని కనకాభిషేకం చేయించుకున్నారు. ఎంత ప్రముఖుడినైనా తూర్పారపట్టే పాత్రికేయుడు, ఫిల్మ్‌ఇండియా అనే పత్రిక సంపాదకుడూ అయిన బాబూరావు పటేల్ చేత "పాల్‌ముని ఆఫ్ ఇండియా"గా అభివర్ణించబడిన ఈ నాగేశ్వరం 'చిత్తూరు నాగయ్య'గా ప్రసిద్ధులు.

"దక్షిణ భారతదేశం నుంచి 'పద్మశ్రీ'ని అందుకున్న తొలినటుడు నాగయ్య. దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు గారి నుండి 'అంగ భూషణ' బిరుదును అందుకున్నారు. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని కలవడానికి కొందరితో కలిసి నాగయ్య గారు వెళ్ళినప్పుడు తన కాళ్ళకి దండం పెట్టబోయిన వ్యక్తులను రాధాకృష్ణన్ గారు వారించి నాగయ్య గారికి మొక్కవలసిందిగా సూచించడం జరిగిందంటే నాగయ్య గారి కీర్తి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. మద్రాస్‌లో నాగయ్య గారి కారుని ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపేవారు కాదట. ఒక త్యాగయ్య, పోతన, వేమన, రామదాసు వంటి పాత్రలకు మరే నటుడు ధైర్యం చెయ్యలేని విధంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. నాగయ్యగారు సినిమాకు లక్షరూపాయలు తీసుకునే సమయంలో అడుగుపెట్టిన నాగేశ్వరరావు, రామారావులు లక్షరూపాయలు తీసుకోవడానికి సుమారు ఇరవై ఏళ్ళు పట్టింది. ఆయన "వేమన" "పోతన" సినిమాల ప్రభావంతో ఒక బాలుడు ముమ్మిడివరం బాలయోగిగా మారిపోయాడు. తెరమీద సాత్విక పాత్రలను ఎంత అద్భుతంగా పోషించారో అదే స్థాయిలో నిజ జీవితంలోనూ అంత సాత్వికతతో జీవించారు. ఆయన మంచితనాన్ని వాడుకొని ఆయన నమ్మిన వాళ్ళే మోసం చెయ్యటంతో ఒకప్పుడు అత్యధిక పారితోషికం తీసుకున్న వ్యక్తి చివరిదశలో వందకి అయిదు వందలకి కూడా వేషాలు వేసే పరిస్థితిని ఎదుర్కొవలసి వచ్చింది.

తనకుమాలిన ధర్మం వలదంటూ అపాత్రదానాలు చెయ్యొద్దుంటూ తరలిపోయిన నాగయ్య మహానటుడు, మహాదాత, మహామనిషి, ఓ సూపర్‌డూపర్ స్టార్. చిత్ర పరిశ్రమంతా నటసామ్రాట్, నటరత్నాలు సైతం ఆయనను 'నాన్నగారు' అని పిలిచేవారు. ఆ 'నటపురుషోత్తముడి తరువాతే ఏ స్టారైనా' అంటూ ఎంతో భావోద్వేగానికి గురయ్యారు మూర్తిగారు. ★

కావ్యమల్లిక

ఎంతో కమ్మని తీయని తెలుగు భాషలో వచ్చిన మహా కావ్యాల సారాన్ని ఒక్క పద్యంలో-ఈతరం వారికి సాహిత్యంలో రుచి కలిగే విధంగా-పద్యమౌళి డాక్టర్ రాధశ్రీ ప్రత్యేకంగా నవమల్లెతీగ పాఠకుల కోసం అందిస్తున్నారు. -సంపాదకుడు

కరుణశ్రీ గారి ఉదయశ్రీ

సీ. ప్రాభాత వేళలో, రాట్నసుందరిపై యు
షస్సుల నొసగిన సాత్వికుండు
పుష్పవిలాపాన్ని, పోతన్న స్థానాన్ని
కళ్యాణగీతిగా కలయజెప్పి
కరుణాకుమారిపై, కవితా కుమారిపై
కుంతీ కుమారిపై కురిసి ప్రేమ
అద్వైతమూర్తికి, ఆంధ్ర విద్యార్థికి
విజయోస్తులను గూర్చి విశదపరచి
తే.గీ. పండితుండు, జంధ్యాల పాపయ్యశాస్త్రి
ఖండకావ్యాలకద్ద సౌగంధికమును
కవులలో కరుణశ్రీ గ ఖ్యాతికెక్కి
రమ్యముగ ఉదయశ్రీని వ్రాసినాడు

-డా॥ రాధశ్రీ, 94944 81210

వసుమతీయం

శ్రీమతి చలసాని వసుమతి

- ★ వ్యష్టి నుండి సమిష్టిలోకి పయనమైనపుడు, మనసుకు అందని సృష్టి వైవిధ్యాలన్నీ అదృశ్యమై శ్వేత పద్మమై, ఆహ్లాదాన్ని ఆనందాన్ని, అనుబంధాలను పెంచుతుంది.
- ★ ప్రియురాలు ప్రతి సెకను మనసునిండా నిండి ఉంటుంది. ఆమె దూరంగా ఎక్కడ ఉన్నా కొంతమంది దేవదాసులా, జీవితమంతా అంకితభావంతో ఉంటారు. కనిపించని ప్రియురాలు, ప్రియుడు ఎప్పుడూ తనను ఆక్రమించుకుని వుంటే బాధ భరించలేక ఎందరో ఎన్నో విధాల బలి అవుతారు. అశాశ్వతమైనది జీవితం అని తెలిసి కూడ నెట్టి వేసి ఎవరికి తోచిన నిర్ణయాలను వారు తీసుకుని ఈ అద్భుతసృష్టికి సహాయం చేస్తారు.
- ★ ఈవిశ్వమంతా ఆక్రమించిన బొమ్మలమైన మనల్ని ఏ మహాత్ములో తప్ప మరెవ్వరు ఒక సెకన్ కూడా తలవరే. కారణం విచిత్రం.
- ★ కన్నతల్లి చెట్టు వేరు లాంటిది. పిల్లలు లేత చివురులై, చిట్టి కొమ్మలై ఆకాశమంత ఎత్తుకు ఎదిగినా భూమిలోతుల్లో వున్న తనే జవమూ జీవమూ అందిస్తుంది. వేరును తెంచుకున్న ఏ చెట్టూ బతికిన దాఖలాలు ఎక్కడా లేవు. అంతేకాదు, కనిపించకుండా తను పాతాళంలో వుండి కూడా తన కొమ్మల్ని ప్రపంచానికి అందంగా అందిస్తుంది.
- ★ తన పీక కోస్తున్నా, తనను చెట్టు నుండి విడదీస్తున్నా, తన గుండెల్లో సూదులు గుచ్చుతున్నా పూలెప్పుడైనా ఆగ్రహాన్ని వ్యక్తం చేయవు. ఆవేశానికి లోను కావు. కన్నతల్లి కూడా పువ్వు లాంటిదే. ★

కొత్తతరాన్ని ప్రోత్సహించకపోతే సాహిత్య చరిత్రలో శూన్యత ఏర్పడే ప్రమాదముంది..

బాపట్ల 'సాహితీ సమ్మోహనం' సభలో వక్తలు



కొత్తతరాన్ని ప్రోత్సహించాలన్న ప్రధాన లక్ష్యంతో సాహిత్య సంఘాలు ఏర్పడటం శుభపరిణామమని బాపట్ల జిల్లా డియస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. బాపట్ల జియస్ఎన్ టవర్స్ ప్రాంగణంలో బాపట్ల జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 18న ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన 'సాహితీ సమ్మోహనం' కార్యక్రమానికి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ..కవులు, రచయితలు సమాజానికి ఉపయోగపడే రచనలే చేయాలన్నారు. ప్రతి రచనకీ ఉన్నత లక్ష్యం వుండాలన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ...కొత్త కవుల్ని, రచయితల్ని ప్రోత్సహించకపోతే సాహిత్య చరిత్ర మొత్తం శూన్యంగా మారే ప్రమాదం వుందన్నారు. ఇప్పటికీ ఐదారు తరాలకు ముందు రచనలే గ్రంథాలయాల సొరుగుల్లో ఎక్కువగా దర్శనమిస్తున్నా యంటే కొత్తతరాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నామో అర్థం చేసుకోవాలన్నారు. ఒక రచయిత మరో రచయితని లేదా వాళ్ళ రచనల్ని, ఒక సాహితీ సంస్థ మరో సాహితీ సంస్థని లేదా వాళ్ళ కార్యక్రమాల్ని గౌరవించే సంస్కారం కనుమరుగవుతుందన్నారు. సాహిత్య సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న 'ఇగోయిజం' చెదను తుదముట్టించే కొత్త ఫెర్టిలైజర్‌ని కనిపెట్టాల్సిన అవసరం వుందన్నారు.

సాహితీవేత్త సజ్జా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..కొత్త కలాలతో సంకలనాలు రావడం సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఎంతో ప్రతిభ వుండి కూడా గత మూడు దశాబ్దాలుగా ఎవరి చేత గుర్తించబడని ప్రతిభామూర్తులను గుర్తించి సత్కరించారు. సంగీత, సాహిత్య, క్రీడా రంగాల్లో విశేషంగా కృషి చేసిన 17 మంది ప్రతిభా మూర్తులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తొలుత కొత్త కవుల కవిత్వంతో రూపొందిన 'దీపధార' కవితా సంకలనాన్ని డా॥వి.వి.రాఘవమ్మ ఆవిష్కరించగా, ప్రతిభా మూర్తుల పరిచయ పత్రికను నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ ఆవిష్కరించారు. గ్రామీణ పాఠశాలల్లో కార్యశాలల్ని ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ బాలబాలికల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఒక ప్రణాళికను రూపొందించినట్టు నిర్వాహకులు తెలిపారు. బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యామ్ సుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుడంశెట్టి వెంకటేశ్వర్లు, గుంట్రెడ్డి సత్యనారాయణ, సంగమేశ్వరశాస్త్రి, డా॥కాగిత సుబ్బారావు, రచయిత్రి పోగుల విజయశ్రీ, కవయిత్రి ప్రత్తిపాటి సుభాషిణి, షేక్ బాబావలి, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, ప్రసిద్ధ కవి నందిరాజు విజయ్‌కుమార్ పర్యవేక్షణంలో కార్యక్రమం ఆసాంతం ఎంతో హృద్యంగా సాగింది. ✶

విజయవాడలో పుస్తక మహోత్సవం ఫిబ్రవరిలో...

ప్రతి యేటా విజయవాడ పిడబ్ల్యుడి గ్రౌండ్స్‌లో జనవరి **1** నుండి **11** వరకు జరగాల్సిన పుస్తకాల పండుగ ఈ సంవత్సరం ఫిబ్రవరి **9** నుండి **19** వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్ నందు జరుగనుంది. పుస్తక ప్రియులు, పుస్తక విక్రయదారులు గమనించగలరు.

నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరుజిల్లా శాఖ నూతన కార్యవర్గం

గుంటూరు రాజేంద్రనగర్‌లోని నవ్యాంధ్ర రచయితల సంఘం కార్యాలయంలో డిసెంబరు 18న ఆదివారం ఆ సంఘం గుంటూరు జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ హాజరయ్యారు. పూర్వ కమిటీ కాలపరిమితి పూర్తి కావడంతో హాజరైన సభ్యుల సమన్వయంతో అందరికీ ఆమోదయోగ్యమైన నూతన కమిటీని ఎంపిక చేశారు. గుంటూరు జిల్లా శాఖ గౌరవాధ్యక్షులుగా డా॥భూసురుపల్లి వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా డా॥తూములూరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్రీమతి షేక్ బషీరున్నీసా బేగం, లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్య, కార్యదర్శిగా సయ్యద్ జానీ బాష, సహాయ కార్యదర్శిగా ఆరేపల్లి సైదులు, కోశాధికారిగా ప్రసన్నత బాబు, కార్యవర్గ సభ్యులుగా కారంచేటి విజయకుమార్, శ్రీమతి విజయ గోలి, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, కోట లీలాకృష్ణ, జిల్లా శాఖ అధికార ప్రతినిధిగా బండికల్లు జమదగ్ని ఎన్నికయ్యారు. ఎన్నిక పరిశీలకులుగా ప్రముఖ సాహిత్య పరిశీలకురాలు సిహెచ్.సుశీలమ్మ వ్యవహరించారు. ఇదే కార్యక్రమంలో విజయవాడకు చెందిన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ యేమినేని వెంకటరమణను నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా నూతన కమిటీని, యేమినేని వెంకటరమణను రాష్ట్ర నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరుజిల్లా శాఖ పూర్వ అధ్యక్షులు వైహెచ్‌కె మోహన్‌రావు, పూర్వ కోశాధికారి బి.జనార్ధనరెడ్డి, సీనియర్ పాత్రికేయులు నిమ్మరాజు చలపతిరావు, ఇస్కా రాజేష్‌బాబు, వల్లూరు ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ★

నవ్యాంధ్ర రచయిత సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా యేమినేని వెంకటరమణ

విజయవాడకు చెందిన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ యేమినేని వెంకటరమణను నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసింది. నూతన సంవత్సరం 2023 నుండి రెండు సంవత్సరాలపాటు వెంకటరమణ ఈ పదవిలో కొనసాగుతారని రాష్ట్ర అధ్యక్షులు బిక్కి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కరోనా కారణంగా సంఘ కార్యక్రమాల్లో కొంత వేగం తగ్గిన కారణంగా సంఘాన్ని, సంఘ కార్యక్రమాల్ని తిరిగి బలోపేతం చేసేందుకు సంఘం రాష్ట్ర కార్యవర్గం కొత్త నాయకుల నియామకాల్ని చేపడుతున్నట్టు ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణను రాష్ట్ర నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. సీనియర్ పాత్రికేయులు నిమ్మరాజు చలపతిరావు, ఇస్కా రాజేష్‌బాబు, వల్లూరు ప్రసాద్‌కుమార్, సాహిత్య పరిశోధకురాలు సిహెచ్.సుశీలమ్మ వెంకటరమణను అభినందించారు. ★

మధురాంతకం నరేంద్ర, వారాల ఆనంద్‌లకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాలు

సుప్రసిద్ధ నవలా రచయిత మధురాంతకం నరేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును, వారాల ఆనంద్‌కు అనువాద పురస్కారాన్ని ప్రకటించారు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు. దేవదాసీ వ్యవస్థపై చారిత్రక పాత్రల జీవితాలను ఆధారంగా తీసుకుని అద్భుతమైన నవలగా మలచిన చిత్తూరుజిల్లాకు చెందిన మధురాంతకం నరేంద్రకు ఈ ఏడాది అవార్డును ప్రకటించినట్లు కె.శ్రీనివాసరావు తెలిపారు. నరేంద్రకు లక్ష రూపాయల నగదు, తామ్రపతకాన్ని అందజేస్తారు. కరీంనగర్ జిల్లాకు చెందిన వారాల ఆనంద్‌కు హిందీ కవి గుల్జార్ రచించిన 'గ్రీన్ పోయెమ్స్'ను ఆకుపచ్చని కవితలు పేరుతో తెలుగులోకి అనువదించినందుకు గాను ఆనంద్‌కు అనువాద పురస్కారాన్ని ప్రకటించారు. ఆనంద్‌కు 50 వేల రూపాయల నగదు, తామ్రపతకాన్ని అందజేస్తారు. వారాల ఆనంద్ రచయితగానే కాక సినిమా రంగ విమర్శకుడిగా కూడా ప్రసిద్ధులు. ★

సమాజ మార్పులో రచయిత్రుల పాత్ర కీలకం

సమాజంలో పేరుకుపోయిన భావదారిద్ర్యాన్ని కడిగేసేవిధంగా కవులు, రచయితలు తమ రచనలు సాగించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ అధ్యక్షులు శ్రీమతి వాసిరెడ్డి పద్మ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్ ఆడిటోరియంలో కడపకు చెందిన కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పురస్కారాలు-2022 ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు వాసిరెడ్డి పద్మ ముఖ్యఅతిధిగా హాజరై ఐదుగురు రచయిత్రులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ- ప్రభుత్వం రచయితల్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థలు కూడా ఆ బాధ్యతను తీసుకుని రచయితల్ని ప్రోత్సహిస్తూ పురస్కారాలివ్వడం సంతోషించాల్సిన విషయమన్నారు. పురస్కారాలు రచయితల చేత సమాజానికి ఉపయోగపడే మరిన్ని రచనలు చేయిస్తాయన్నారు. ముఖ్యంగా సమాజ మార్పులో రచయిత్రుల పాత్ర కీలకమన్నారు. సభకు అధ్యక్షత వహించిన సుప్రసిద్ధ కవయిత్రి డా॥యంబిడి శ్యామల కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ పురస్కారాల ఎంపికలో పారదర్శకత పాటిస్తుందన్నారు. ఈ సభలో డా॥పట్టాభి కళాపీఠం అధ్యక్షులు డా॥తూములూరి రాజేంద్రప్రసాద్, జాతీయ మహిళా సమాఖ్య బాధ్యులు శ్రీమతి అక్కినేని వనజ, కథా నవలా రచయిత అలపర్తి రామకృష్ణ, కేంద్రసాహిత్య అకాడమీ యువ యువ పురస్కార గ్రహీత, రచయిత వేంపల్లె షరీఫ్, ప్రసిద్ధ కవి బంగార్రాజు కంఠ, మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, కవయిత్రి గంగవరపు సునీత, ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, కవిత సంస్థ అధ్యక్ష కార్యదర్శులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, శ్రీమతి బోయపాటి దుర్గాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధి శ్రీమతి వాసిరెడ్డి పద్మ చేతుల మీదుగా కందుకూరి నవలా పురస్కారాన్ని ఎమ్.ఆర్.అరుణకుమారి, గురజాడ కథా పురస్కారాన్ని బండారు విజయ, శ్రీశ్రీ కవితా పురస్కారాన్ని పద్మావతి రాంభక్త, జానమద్ది సాహిత్య పురస్కారాన్ని ఆచార్య కిన్నెరశ్రీదేవి, డా॥రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారాన్ని సమ్మెట ఉమాదేవిలకు నిర్వాహకులు అందజేశారు.

డా॥ప్రభాకర్ జైనీ 'హీరో' నవలకు డా॥జయప్రద నవలా పురస్కారం

సుప్రసిద్ధ కథ, నవలా రచయిత, కవి, నిర్మాత, దర్శకులు డా॥ప్రభాకర్ జైని రచించిన 'హీరో' నవలకు నెల్లూరుకు చెందిన డా॥పెళ్ళకూరు జయప్రద నవలా పురస్కారాన్ని అందజేశారు. డిసెంబరు 25న ఆదివారం నెల్లూరులో జరిగిన సభలో డా॥ప్రభాకర్ జైనీకి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సభలో పురస్కార ప్రదాత డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి, సాహితీవేత్తలు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, శిరంశెట్టి కాంతరావు, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెరుగు రామకృష్ణ, కోసూరు రత్నం, అవ్వారు శ్రీధర్‌బాబు, శ్రీమతి పాతూరు అన్నపూర్ణ, శిరంశెట్టి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ సత్కారం అందుకున్న సీనియర్ జర్నలిస్టు బండారు రాధాకృష్ణ

సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు బండారు రాధాకృష్ణను డిసెంబరు 28న బుధవారం గుడివాడలో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. కొమ్మినేని శ్రీనివాసరావు ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టాక ప్రతి జిల్లాలో, ఇతర ముఖ్య పట్టణాల్లో సీనియర్ మోస్ట్ జర్నలిస్టులను వారి ఊళ్లకి వెళ్లి, మరి కొందరికి అయితే లేవలేని స్థితిలో వుంటే వారి ఇళ్లకు వెళ్లి మరీ సత్కరించి వస్తున్నారు. ఆ విధంగా శ్రీకాకుళంలో భయంకర్ పేరుతో 600 డిటెక్టివ్ నవలలు రాసి, సరైన గుర్తింపునకు నోచుకోని సీనియర్ జర్నలిస్ట్‌ను కొమ్మినేని గుర్తించి సన్మానం చేసి వచ్చారు. అలాగే పాలకొల్లులో 90 ఏళ్ల సీనియర్ జర్నలిస్టును సత్కరించారు. ఆ పరంపరలో భాగంగా 84 ఏళ్ల వయసులోనూ ఇంకా విశాలాంధ్ర, నవమల్లెతీగ పత్రికల్లో కాలమిస్ట్‌గా వ్యాసాలు రాస్తున్న బండారు రాధాకృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు, స్పందన కల్చరల్ అసోసియేషన్ బాధ్యులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక సాహితీకావ్యం సుంకర గోపాలయ్య 'మా నాయిన పాట'



గోపాల్ ఆపాదమస్తకం కవిత్వంగా అల్లుకు పోతున్నాడు. సరికొత్త అభివ్యక్తితో, నవ్య వస్తువులతో కవిత్వ పరిభాషతో పరికిస్తున్నాడు. కవితావేణువై వేణుగానం వినిపిస్తున్నాడు. 'మా నాయిన పాట' నవ్య కవితా శిల్పప్రహేళిక. ఆధునికత్వం తొంగిచూస్తున్న కవితావీచిక. కవిగా గోపాలుడు మరింతగా ముందుకు దూసుకుపోగలడనడంలో సందేహం లేదు. ఆయన పాడిన పాటే దానికి భరోసా.

పద్యం పిట్టగోడ మీద వాలిందట. అది రెక్కలు కట్టుకుని చెట్టు లాంటి కవి గుండెల్లో గుభాళించిందని 'ఎగిరి' కవితలో చెప్తాడు. కవితలకు పేర్లు నిర్ణయించడంలో గోపాల్‌ది అందెవేసిన చేయిలా కన్పిస్తుంది. చిన్న భావాన్ని కూడా అలజడి జడివానగా సృష్టించడం ఈ కవి ప్రత్యేకత.

నెల్లూరు జిల్లా నాయుడుపేటలో ప్రవహించీ ప్రవహించలేని స్వర్ణ ముఖిని చూశాక గోపాల్ హృదయం వ్యాకులత హృదయ అవుతుంది. ఉప్పొంగవే అంటూ రుద్రవీణ సవరిస్తాడు. పద్యమంతా గొప్పగా సాగిం చడంలో కవిలోని భావావేశం ఉప్పొంగుతుంది. చాన్నాళ్ళ క్రితం భర్తను పోగొట్టుకుని కొడుకులు కూడా ఆదరించని 'పెన్షన్' పీకేసిన అమ్మలా వుందని దయనీయ పరిస్థితిని వెళ్ళగక్కుతాడు కవి. నదిలోని గొట్టపు బావుల్ని చూసి వెంటిలేటర్ అమర్చినట్లుందంటూ మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తాడు గోపాల్. చెంగుచెంగున దూకిన స్వర్ణముఖి మాసిన గడ్డంతో దిగాలు చూపుల్తో నీటిచుక్కల బోణీలేక దివాళా తీసిన చిరు వ్యాపారిలా వుందంటాడు. దివాళా తీయడమైతే అక్షరాలా నిజమే కానీ చిరు వ్యాపారి మాత్రం కాదు, భారీ వ్యాపారసేద్యమే చేసింది స్వర్ణముఖి. ఇప్పుడు ఆ మట్టిబంగారంతో కన్పిస్తూంటుంది.

ఏమయ్యావ్ స్వర్ణముఖీ అంటూ ఆత్రంగా కౌగిలించుకుని కన్నీళ్ళ చదరంగం ఆడతాడు కవి. టీనేజ్ పిల్లలా నువ్ నాట్యం చేస్తే చూడాలని వుందంటాడు. పొంగలే స్వర్ణముఖి, ఉప్పొంగలే స్వర్ణముఖీ అని తపమాచరిస్తాడు కవితోత్తముడు.

నువు బతికున్నట్టేనా! అంటూ ఓ కవితాచిత్రాన్ని గీశాడు కవి గోపాల్ చక్కని కవితగా మలిచాడు. మనసున్న మనిషి హృదయం పెట్టి ఆలకిస్తే ఆయన స్పర్శించిన వాక్యాలు 'స్టెతస్కోపులై' అతడు మనిషో కాదో బేరీజు వేస్తాయని చెప్పవచ్చు. ఎప్పుడైనా పక్షుల్ని పలకరించావా! లేలేత చిగుర్ల సంభాషణలు విన్నావా! మేఘాల రాగం ఆలకించావా! అని ప్రశ్నిస్తూ మొక్క పుష్పిస్తున్నప్పటి పురిటినొప్పుల చిత్రం గీయగలవా! అవి ఒక్కసారిగా మనిషిని 'లాబరేటరీ టెస్టు'కు గురి చేస్తాడు. పక్కింట్లో మరణించిన మనిషిని సాగ నంపని నువ్వేం మనిషివయ్యా! అసలు బతికున్నావా! అని కవితా సౌందర్యాన్ని ఓదెలు ఓదెలుగా ఆరేస్తాడు పొలం గట్టున కవి. ఎంతైనా అభినందనీయుడు గోపాల్.

'మళ్ళీ ఇంట్లోకి' మరో గొప్ప కవిత. ఇల్లు కూలి పోయింది అంటూ ప్రారంభించి పంట కాలువలాంటి మనిషి నరాల్లో విద్యుత్ లాంటి మార్కెట్ ప్రవహిస్తే చాలు ఆ ఇల్లు కూలిపోయినట్లే అంటూ కవితాత్మకంగా హెచ్చరిస్తాడు కవి. అహం విషపురుగై రక్తాన్ని తొలిచాక ఇల్లు కూలిపోతోందంటూ ఈ ధ్వంసరచన ఆపాలంటే మనిషి హృదయసీమ సారవంతమై మనిషితనం పుట్లకొద్దీ పండాలని ముగిస్తాడు.

మా నాయినపాట కవితలో మరో కొత్తదనపు ప్రతీకను వాడు కున్నాడు కవి. యుద్ధాలు చేయాలంటే గదలక్కరలేదు గడ్డిపరక చాలనే వాడని చెప్తూ ఆ మాటల్లో ఎంటులాంటి గట్టితనం ప్రవహించేది అని చక్కగా చెప్తాడు కవి.

'దుఃఖలిపి' కవిత ఒక సరికొత్త ఆవిష్కరణ. దుఃఖంపై యుద్ధం ప్రకటిస్తాడు కవి. దుఃఖానికి సానపెడితే ఓటమి కుత్తుకలు తెగ్గోస్తుంది అని చెప్తూ సామూహిక దుఃఖం ఉద్యమానికి ఊపిరి అని ఊపిరులూది, దుఃఖ స్తన్యం కన్నీళ్ళు కన్నీటి చుక్కల దుఃఖ లిపులేనని తీర్మానిస్తాడు.

'ఖాళీ అయిన ఇల్లు' అంటూ ఖాళీ అయిన ఇంటి పరిసరాల్లో కవి అనుభవాల దృశ్యాల్ని ఆరబోస్తాడు. కుళాయి బొట్లుగారాలే నీటి చుక్కల్ని చూసి ఆ ఇల్లు కష్టాలకు దుఃఖించి వుండవచ్చునని ఊహా చిత్రం లిఖిస్తాడు కవి. ఇల్లు ఓ సముద్రం అని చెప్తూ ప్రతి సముద్రాన్ని దాటడానికి పడవల్లాంటి మనుషులు కావాలని మనుషుల పట్ల తన నమ్మకాన్ని వ్యక్తీకరిస్తాడు కవి.

'మాట'పైన మరో అద్భుతమైన కవిత. చీకటిని చీల్చే మిణుగురు మాటలు కావాలి అంటాడు. మాట వెలుతురు ముక్కై మార్గదర్శనం చేయాలంటాడు గోపాల్. శుభ్రపరిచే ఒక్క మాటకోసం నీ స్వరపేటిక చందన చర్చితం కావాలని సమర్థవంతంగా కవిత్వీకరిస్తాడు.

ఇదో గొప్ప కవితాలయమైన పుస్తకంగా చెప్పాలి. రాబోయే మరింత మహత్తరమైన కవిత్వానికి మార్గదర్శకత్వం వహించే అపురూపదృశ్య కావ్యం 'మా నాయిన పాట'. ఈ కవి కవితాత్మకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందే గొప్ప లక్షణాలు విరివిగా వున్నాయనడం అతిశయోక్తి కాదు.

-చిన్ని నారాయణరావు, 94402 02942

జీవితమంటే అనుభవం..గొప్ప అనుభవాల వైపు ప్రయాణించడమే జీవిత లక్ష్యం. అనుభవాలను గొప్పగా..గాఢంగా తీసుకోగలగటం అనేది మన హృదయపు సున్నితత్వం మీద..స్వేచ్ఛ మీద..నిజాయితీ మీద ఆధారపడి వుంటుంది. -చలం

ఆత్మగౌరవ పోరాటాల అగ్నిశిఖ



అనేకానేక ప్రయోగాలతో డిజిటల్ యుగంలో మనిషి దూసుకు పోతున్నా, ఆధునికత అనేక రూపాల్లో హొయలుబోతున్నా, ఆ మనిషికి అస్తిత్వాన్ని దూరం చేసే వివక్షల తాలూకు సామాజిక సంఘర్షణ మాత్రం అతనిని వీడలేకపోతోంది. తీరని వ్యధల్ని మిగుల్చుకుంటూ ఆ అస్తిత్వం కోసం అతడు వందల ఏళ్లుగా వెతుకుతూనే వున్నాడు. పరుగులు తీస్తూనే వున్నాడు. ఆ వెతుకులాటలో, ఆ పరుగులో ఎన్నో జీవితాలు బలైపోతున్నాయి. అ వెతుకులాటలో అలసిసొలసిన ఎన్నో జీవితాల ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ, ఆ జీవితాల్లోని వ్యధల్ని ఎన్నో కోణాల్లో చిత్రిస్తూ జి.కళ్యాణరావు ఒక కావ్యంలా మలచిన నవలే 'అంటరాని వసంతం'.

స్వాతంత్రానికి ముందు, తరువాత వందేళ్ల కథాకాలంలో నిషేధం మాటున కూనారిల్లే ఏడుతరాల దళిత జీవితాల వ్యధాభరిత గాధలను 240 పేజీల ఈ నవలలో విలక్షణ, కవితాత్మక శైలీవిన్యా సంతో గుదిగుచ్చడం రచయిత సాహసమేనని చెప్పవచ్చు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న రచయితకు దళిత కార్మికుల జీవి తాలను అతిదగ్గరగా చూసిన అనుభవం వుంది కనుకనే వారి జీవితాల్ని అనేక కోణాల్లో ఆవిష్కరించగలిగారు. అప్పట్లో అరుణతార మాస పత్రికలో సీరియల్‌గా వెలువడిన ఈ నవల ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైనా తనకున్న సిద్ధాంతాల రీత్యా రచయిత ఆ అవార్డును తిరస్కరించారు. 'నాది కుటుంబాల్ని వెతుక్కుంటూ పోయిన వెతుకులాట కాదు. ఒక పురాతన వెతుకులాట. నేను నా పూర్వీకులు పోగొట్టుకున్న దానికోసం వెతుకుతున్నాను.' అనే రచయిత అంతరంగమథనం నుంచి వెలువడిన ఈ నవల ఐదుభాషల్లో అను వాదానికి నోచుకుంది. ఈ కథను చెప్పడానికి రచయిత ఉరుముల నృత్యం తదితర కళారూపాల్ని ఆయుధాలుగా ఎంచుకున్నారు. ఆ కళారూపాల ద్వారానే విభిన్నపాత్రల అస్తిత్వ అన్వేషణ కనిపిస్తుంది. 'కళ కన్నా కులం ముఖ్యమైంది. కళని కూడా కులం తక్కెట్లో తూచారు' అన్న రచయిత అవేదన తొంగిచూస్తుంటుంది. అందుకే వీధిబాగో తాలు తన స్వరూపాల్ని మార్చుకొని ప్రజాచైతన్యకళారూపాలుగా మారిపోయిన వైనాన్నీ వివరిస్తాడు రచయిత.

ఊరికి దూరంగా వెలివేయబడ్డట్టు వుండే యెన్నెలదిన్ని దళిత వాడలో ఈ కథ ప్రారంభమై నూరేళ్ల తరువాత ఆవలపాడులో ముగు స్తుంది. ఈ సుదీర్ఘ కాలంలో మనకు కనిపించే అన్ని పాత్రల్లోనూ సామాజిక సంఘర్షణ ఒకేలా కనిపిస్తుంది. మారేదల్లా ప్రదేశాలు, మను షులు మాత్రమే. తన ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలనే తలంపుతో ఉరుముల నృత్యం వంటి కళారూపాల్ని నేర్చుకొని వాటి ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి ప్రయత్నించి ఆ తరువాత మాలబైరాగిగా మారే ఎల్లన్న నుంచి అతని తరువాత ఏడో తరానికి చెందిన జెస్సీ వరకు శివయ్య, శశిరేఖ, వారి కొడుకు యిమ్మానుయేలు... వీళ్లంతా తమ జీవనగమనంలో ఎన్నో వివక్షల్ని ఎదుర్కొన్నవారే. అయితే ఈ కథంతా తన భర్త రూబేను అతని అనుభవాలతో రాసుకున్న డైరీలను చదువుతూ, అతని జ్ఞాపకాలతో గడిపే రూతులో కలిగే అంతరంగ మథనం ద్వారా వివరిస్తాడు రచయిత. ఆ పాత్ర ద్వారా తన ఆలోచనల పరంపరను పంచుకుంటూ ఆ పాత్రలో అంతర్లీనంగా కనిపిస్తుంటాడు. ఉద్యమంలో వున్న తన మనవడికి భవిష్యత్తు సందేశాన్నిస్తూ రూతు ఉత్తరం రాయడంతో నవల ముగుస్తుంది.

ఈ నవల కథాంశం పట్ల రచయితకు ఎంత నిబద్ధత వుందంటే అది ప్రతి పేజీలోనూ అనేక వాక్యాల్లో జాలువారుతూ కనిపిస్తుంది. రూబేను తన డైరీలో రాసుకున్న 'మా పూర్వీకులు పోగొట్టుకున్న దాన్ని వెతుకున్నాను నేను. నానమ్మ చెప్పింది మీ తాత యిట్టాగ వెతికాడని. అమ్మ అంది మీ నాన్న వెతుకుతూనే వెళ్లిపోయాడని. ఆ తర్వాత నానమ్మ వెతికింది, యిప్పుడు నేనూ వెతుకుతున్నాను.' వంటి వాక్యాలు మన మనసుల్ని కలచివేస్తాయి. "రుతువు మారింది. దాని వేరు మారింది. శిశిరం, వసంతం, గ్రీష్మం, అట్టా కాదు దోపిడీ రుతువు, దొంగల రుతువు, దౌర్జన్యాల రుతువు, ఆకలి రుతువు' వంటి ఆధునిక భాష్యాల్లా కనిపించే కవితాత్మక వేదనాపూరిత వర్ణనలు ఈ కథాంశానికి బలాన్నిచ్చాయి.

ఏ రచనకైనా సమకాలీన సందర్భాలు ఎంతో బలాన్నిస్తాయి. ఈ నవలలో కూడా సన్నివేశాల కల్పనలో రచయిత ఆయా సందర్భా లకు తగినట్టుగా కొన్ని చారిత్రక సంఘటనలనూ, సందర్భాలనూ ఎంచుకోవడం ఆయనలోని పరిశోధనాత్మక దృష్టికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. ఆయా సందర్భాల్లో బ్రౌను దొర, వేమన, బసవడు, పోతులూరి వీరబ్రహ్మం. పెరియార్, సంజప్ప, గణపతి వంటివారి ప్రస్తావన కనిపిస్తుంది. చరిత్రలో రికార్డు అయిన బకింగ్ హామ్ కాల్వ పనుల్లో కులవివక్ష చోటుచేసుకోవడాన్ని ప్రస్తావిస్తూ ఆ పనుల్లోకి శివయ్య, సుభద్రలను రానివ్వకపోవడమనే సన్నివేశం నవలలో కని పిస్తుంది. యిమ్మానుయేలు శ్రీకాకుళం నక్సల్బరీ పోరాటంలో చురు కుగా పాల్గొని పోలీసు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యే ఘటనలోనూ సమకాలీన సందర్భం కనిపిస్తుంది. బ్రతుకుతెరువు కోసం దళితులు క్రైస్తవాన్ని స్వీకరించడం వెనుక వున్న అనంతమైన వ్యధల్నీ రచయిత విపులీకరిస్తారు. ఎల్లన్న, రామానుజం, యెమ్మానుయేలు, రూబేను, జెస్సీ పాత్రలను చైతన్యానికి ప్రతినిధులుగా రచయిత తీర్చిదిద్దినట్టే కొన్ని స్త్రీ పాత్రలనూ అంతే చైతన్యవంతంగా తీర్చిదిద్దారు. తన మేన ల్లుడు ఎల్లన్నను తీర్చిదిద్దే భూదేవి, అంతటి వివక్ష నడుమా వూరి చెరువు తూమును తెగ్గొట్టి తమవారికి నీళ్లు పారించుకొనే సుభద్ర, జెస్సీతో పాటే అతని భార్యగా ఉద్యమంలోకి వెళ్లే రూబీ... వీళ్లంతా చైతన్యవంతులే.

ఈ నవలకు కేంద్రబిందువైన వివక్ష నవలలో ఎన్నోరకాలుగా కనిపిస్తుంది. ఎన్నో రకాలుగా పాత్రలను వేధిస్తూ వుంటుంది. కళ

విషయానికొస్తే గ్రామంలో కళారూపాన్ని ప్రదర్శించే వేదిక ముందు అగ్రకులాల వాళ్లు కూర్చునే విధంగానూ, దురంగా వుండే రెండు వేరువేరు దిన్నెలమీద మాల, మాదిగ కులాల వాళ్లు కూర్చునే విధంగానూ ఏర్పాట్లు చేసివుంటాయి. ఆ గ్రామ చెరువు నుంచి నీళ్లు తెచ్చుకొనే విషయంలో కూడా అనేక ఆంక్షలు వుంటాయి. ఆ సందర్భాన్ని రచయిత 'గుక్కెడు నీళ్ల కోసం యుద్ధమే జరిగింది. అట్టాగని వాళ్లు యుద్ధప్రియులు కారు. శాంతిమార్గంలో నీళ్లు దక్కితే వాళ్లంత శాంతిప్రియులు మరొకరు లేరు' అని వర్ణిస్తాడు. ఆ వాడలో ఎగువన అగ్రకులాల వారి ఇళ్లు, దిగువన దళితుల ఇళ్లు వుండడం మరో వివక్ష. ఎందుకంటే అక్కడ వరదొస్తే దళితుల ఇళ్లన్నీ మునిగిపోతుంటాయి.

మనిషి ఆత్మగౌరవం కోసం చేసే పోరాటాలు, ఆ పోరాటాల్లోని ఆక్రోశాలూ, అవేదనలూ ఈ నవల అంతటా జాలువారుతుంటాయి. సీరియస్ కథాసంవిధానంలో, ఉద్విగ్నభరిత సన్నివేశాల కల్పనలో, ఉద్వేగభరిత పాత్రల చిత్రణలో ఎన్నెన్నో ఆలోచనలు మనల్ని ముసురు కుంటాయి. దశాబ్దాల చరిత్ర మన కళ్లముందు కదులుతుంది. వుండవలసిన చరిత్రను మనకు సూచిస్తుంది. అందుకే అస్తిత్వ ఉద్యమంలో ఒక సెగ, ఆత్మగౌరవ సంగీతాన్ని వినిపించే ఒక స్వరరాగ విపంచిక ఈ 'అంటరాని వసంతం'.

- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 91777 32414

సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు తప్పనిసరిగా రెండు కాపీలు పంపాలి. సమీక్షకులు చదవటానికి సమయం తీసుకుంటారు కాబట్టి పత్రికలో సమీక్ష రావడానికి కొంచెం ఆలస్యం కావచ్చు...కవులు, రచయితలు గమనించగలరు.

'ప్రణయ విపంచి' కవిత్వం

స్త్రీ పురుషుల మధ్య ప్రేమను పెన్నిధిగా, జీవిత పరమార్థ సన్నిధిగా దాంపత్య ధర్మఫలంగా, దేశభవిష్యత్తును పెంపొందించే బాధ్యతగా భావించిన అభ్యుదయ కవి నక్కా రాజేంద్రప్రసాద్ వెలువరించిన తాజా కవితా సంపుటి 'ప్రణయ విపంచి'. ఇందులో వున్న 34 కవితలూ ప్రేమకు సరికొత్త భాష్యం చెప్పేవే. 68 పేజీలు, వంద రూపాయలు. కాపీలకు : రచయిత సెల్ : 98499 43639

నవ మల్లెతీగ ప్రకటనల రేట్లు

బ్యాక్ పేజీ (కలర్)	-రూ.30,000
సెకండ్ కవర్ (కలర్)	-రూ.25,000
థర్డ్ కవర్ (కలర్)	-రూ.25,000
సెంటర్‌స్ప్రెడ్ (కలర్)	-రూ.30,000
సెంటర్ స్ప్రెడ్ (B&W)	-రూ.20,000
ఇన్నర్ ఫుల్‌పేజీ (B&W)	-రూ.10,000
ఇన్నర్ హాఫ్ పేజీ (B&W)	-రూ.5,000
ఇన్నర్ క్వార్టర్ పేజీ (B&W)	-రూ.2,500

యాడ్స్ టెక్నికల్ డేటా

ఫుల్ పేజీ బ్యాక్ (కలర్/బ్లాక్ & వైట్) సైజు
ఎత్తు 28 సెం.మీ. × వెడల్పు 21.5 సెం.మీ.
(ఇందులో మ్యాటర్ ఏరియా 24.5 ×19 సెం.మీ)
హాఫ్ పేజీ సైజు - ఎత్తు 12 × 17.5 సెం.మీ.
క్వార్టర్ పేజీ సైజు - ఎత్తు 12 × 8.5 సెం.మీ.లేదా
ఇంకా స్ట్రిప్ యాడ్స్, క్లాసిఫైడ్స్, బర్త్‌డే శుభాకాంక్షలు
ప్రకటనల కోసం సంప్రదించండి!

సంప్రదించడానికి - 92464 15150

మీరు 'బాలి కథలు' చదివారా?

ఓ ప్రసిద్ధ చిత్రకారుడు కథకుడిగా మారి తన
కలం బలాన్ని ప్రదర్శించిన గొప్ప కథా వేదిక

సుప్రసిద్ధ నవలాకారుడు, విమర్శకుడు శ్రీరామకవచం సాగర్... 'మనం బాలి కథలు చదవకపోతే అర్థశతాబ్దపు కథా సాహిత్యాన్ని కోల్పోయినట్టే' అన్నారు. ఇందులో ముందుమాట రాస్తూ మధురాంతకం నరేంద్ర-'ఇందులో ఓ యాభై పేజీల 'అప్పికట్లవారి వీధి' కథ చదువుతుంటే నాకు ముళ్ళపూడి వెంకటరమణ గారి 'జనతా ఎక్స్‌ప్రెస్' కథ గుర్తుకొచ్చిందన్నారు. అంతేకాదు, తెలుగు సాహిత్యంలో యిదొక అసాధారణ ఫీటు అన్నారు. బాలి రాసిన కథలతో వెలువడిన తొలి కథల సంపుటి ఇది. బాలి బొమ్మల్ని అభిమానించే ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం. 308 పేజీలతో మంచి క్వాలిటీ పేపరుతో నవమల్లెతీగ వెలువరించిన ఈ పుస్తకం ధర 320 రూపాయలు.



రూ.300/-లు చెల్లిస్తే చాలు... రిజిష్టర్ పోస్టులో బాలి కథలు మీ ఇంటికి చేరుస్తాం. **92464 15150** నెంబరుకు ఫోన్‌పే గాని గూగుల్ పే గాని చెయ్యండి.

కదిలించే కథలు పెద్దకొడుకు

ఇటీవల విజయవాడలో విడుదలైన కథల సంపుటి పెద్ద కొడుకు. ఇందులో పందొమ్మిది కథలున్నాయి. ఈ పుస్తక రచయిత వారణాసి భానుమూర్తి కథాకథన దక్షత ఈ సంపుటిలోని ప్రతి కథ నిరూపిస్తుంది. మానవ సంబంధాల మాధుర్యం, పల్లె స్నేహాలు, పండుగలు, బంధుత్వాలు ఇలా అనేకానేక దృశ్యాలు విలువలు రంగ రించి మానవీయ కోణంలో ప్రతి కథను అద్భుతంగా చిత్రించారు. కథ నడపడంలో, పాత్రల చిత్రణలో, వాతా వరణ కల్పనలో వారణాసి భానుమూర్తి బాగా చేయి తిరిగిన రచయితలా కన్పిస్తారు. కథలో వాడే బాష, సంభాషణలు సరళంగా, సహజంగా ఉంటాయి. ఎక్కడ కృత్రిమత్వం, అసహజత్వం, అతి గానీ కనిపించవు. భానుమూర్తి గారి కథలకు విశేష పాఠకాదరణ వున్నది. అందుకు కారణం ఆయన కథలు హృదయాన్ని కది లిస్తాయి. కరిగిస్తాయి. కళ్ళను ద్రవింపచేస్తాయి. ఆయన కథల్లోని ప్రతి దృశ్యం సహజంగా ఉంటుంది. కథనం ఉత్కంఠ భరితంగా వుంటుంది. భాషాసారళ్యం కలిగి రసానుభూతి కలిగించే శైలీ విన్యాసం అబ్బుర మనిపిస్తుంది. ఆయన కథలు కల్పితాలో, వాస్తవాలో అర్థం చేసుకోవడం చాలా కష్టం. రచయిత వ్యక్తిత్వం, సృజనాత్మక ప్రతిభ అతని కథల్లో ప్రతిబింబిస్తుంది. భానుమూర్తి వ్యక్తిత్వం విలక్షణమైనది. అందుకే అతని కథలు సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. 174 పేజీలు, 250 రూపాయలు. కాపీలకు-వారణాసి భానుమూర్తి రావు, హైదరాబాద్, సెల్ : 99890 73105

-బిక్కి కృష్ణ, 83744 39053



బ్రతుకు బొమ్మలు (కవిత్వం)

పద్యకవిత్వాన్ని పరుగులు పెట్టించే ఎరుకలపూడి గోపీనాథరావు తాజాగా వెలువరించి వచన కవిత్వం 'బ్రతుకు బొమ్మలు'. ఇందులో మొత్తం 65 కవితలున్నై. 'కుంచిత భావాల కుడ్యాలన్నీ కూలగొట్టి/ అన్నదమ్ముల్లా ఆలింగనం కావడం అత్యవసరం' అంటూ ఐకమత్యంగా కలిసి వుండటంలోని మాధుర్యాన్ని పంచుతున్నారు గోపీనాథరావు. 128 పేజీలు, 150 రూపాయలు. కాపీలకు : 98482 93119.

ముచ్చటైన ముద్రణ
అందుబాటు ధర
సకాలంలో డెలివరీ...

స్క్రిప్టు మాకివ్వండి
అందమైన పుస్తకాలు
మీకిచ్చేస్తాం...

ఇది..
కవులు,
రచయితల కోసం
నడుస్తున్న
సృజనశీల
కార్యశాల

కవిమిత్ర గ్రాఫిక్స్
సృష్టి మరియు ముద్రణ

కలవండి...
కె.సంపత్
81255 51051

డోర్ నెం.28-23-8, మౌలానా స్ట్రీట్,
స్వగృహ ఫుడ్స్ ఎదురువీధి,
అరండల్‌పేట, విజయవాడ-520 002

ముందుతరం నటుల వరుస మరణాలు



రెబల్‌స్టార్ కృష్ణంరాజుతో మొదలైన ముందుతరం నటుల మరణాల సంఖ్య చూస్తుండగానే నాలుగుకు చేరింది. సెప్టెంబరు 11న కృష్ణంరాజు సినీ ఇండస్ట్రీని, రాజకీయ రంగాన్ని, కుటుంబ సభ్యుల్ని, అభిమానుల్ని విడిచి పరలోకానికి పయనమయ్యారు. ఆ విషాదం నుండి తేరుకోక ముందే నవంబరు 15న సూపర్‌స్టార్ కృష్ణ ఈ లోకాన్ని విడిచారు. ఇండస్ట్రీ మొత్తం విషాదంలో మునిగిపోయింది. కృష్ణ మరణం అభిమానుల్ని ఎంతగానో కృంగదీసింది. వెంటనే నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ డిసెంబరు 23న శుక్రవారం కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు పూర్తికాకముందే 24న శనివారం రాత్రి విలక్షణ నటుడు చలపతిరావు కన్నుమూశారు. ఈ నటులందరి మరణాలకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు తెలుగు సినిమా అభిమానులందరూ తమ సంతాపాన్ని తెలియజేశారు.

కృష్ణా జిల్లా కౌతవరంలో 1935 జులై 25న పుట్టిన కైకాల సత్యనారాయణ గుడ్లవల్లేరులో ప్రాథమిక విద్యను అభ్యసించారు. పై చదువుల కోసం విజయవాడకు వచ్చిన కైకాల తిరిగి గుడివాడకు వచ్చారు. కాలేజీ డేస్‌లో నాటకాలపైన ఆయనకు విపరీతమైన ఆసక్తి ఏర్పడింది. విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో నాటకపోటీల్లో పాల్గొనేవారు. అలా 1952లో ఆచార్య ఆత్రేయ రాసిన నాటకం 'ఎవరు దొంగ'ను ప్రదర్శించారు సత్యనారాయణ. ఆ నాటకాన్ని చూసిన సినీ దర్శకుడు గరికపాటి రాజారావు నీ ముఖవర్చస్సు బాగుందని సినిమాల్లోకి రావాలని ఆహ్వానించారు. చందమామ బ్యానర్‌పై చెంగయ్య దర్శకత్వంలో తీసిన 'సిపాయి కూతురు'లో హీరోగా జమున సరసన నటించారు. అదే సత్యనారాయణకు మొదటి సినిమా. కానీ ఆ సినిమా ఆశించినంత విజయాన్ని సాధించలేదు.

ఎన్టీఆర్‌కు దగ్గర పోలికలుండటం చేత సత్యనారాయణ ఖాళీగా ఉండకుండా ఆయనకు డూపుగా చాలా సినిమాల్లో నటించారు. 1960లో ఎన్టీఆర్ చొరవతోనే మోడరన్ థియేటర్స్ వారి 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' చిత్రంలో నటుడిగా అవకాశాన్ని అందుకున్నారు. ఆ సినిమా దర్శకుడు ఎస్డీలాల్ విఠలాచార్య శిష్యుడు కావటంతో.. సత్యనారాయణలో ఉన్న టాలెంట్‌ను గుర్తించి విఠలాచార్యకు పరిచయం చేశారు. అదే సత్యనారాయణ కెరీర్‌లో కీలక మలుపు. హీరో వేషాల కోసం వేచి చూడకుండా విలన్‌లు తక్కువగా ఉన్న ఇండస్ట్రీలో కొరతను తీరుస్తూ అవకాశాలను అందుకోవాలని విఠలాచార్య ఇచ్చిన సలహాను సత్యనారాయణ స్వీకరించారు.

ప్రముఖ నటుడు తమ్మారెడ్డి చలపతిరావు 1944 మే8న కృష్ణా జిల్లా పామర్రు మండలం బల్లిపర్రులో జన్మించారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. నటుడు, నిర్మాతగా గుర్తింపు పొందారు. 1500కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. 'కథానాయకుడు' సినిమాతో ఆయన చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. ఎన్టీఆర్, కృష్ణ, నాగార్జున, చిరంజీవి, వెంకటేశ్ చిత్రాల్లో ఆయన సహాయ నటుడిగా, ప్రతినాయకుడిగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. కొన్ని వందల చిత్రాల్లో ఆయన కీలకపాత్రలు పోషించారు. గతేడాది విడుదలైన 'బంగార్రాజు' తర్వాత చలపతిరావు వెండితెరపై కనిపించలేదు. ★

కృష్ణంరాజు వారసుడు ప్రభాస్, కృష్ణ కుమారుడు మహేష్‌బాబు ఇద్దరూ ఇప్పటికే అగ్రహీరోలుగా చెలామణి అవుతున్నారు. చలపతిరావు కుమారుడు రఘుబాబు కూడా హీరోగానే పాపులర్ అయ్యాడు. కైకాల సత్యనారాయణ కుమారులే ఇండస్ట్రీకి దూరంగా జీవితాల్ని కొనసాగిస్తున్నారు.

బౌద్ధ సాహితీ సాగరం

బొర్రా గోవర్ధన్, 93906 00157

64



(గత సంచిక తరువాయి)

7. వానప్రస్థ సూత్రం : బుద్ధుడు జేత వనంలో వున్నప్పుడు ఎలాంటి ప్రదేశంలో భిక్షువులు వుండాలి, ఎలాంటి ప్రదేశాన్ని వదిలి వెళ్ళాలి అనే విషయం గురించి చెప్పే సూత్రం ఇది.

భిక్షువులు నివసించే ప్రదేశాలు అడవి అయినా, గ్రామం అయినా, వ్యక్తి నివాసం అయినా... ఎలాంటి చోటులో ఉండాలో, ఎలాంటి చోటు వదిలిపెట్టాలో బుద్ధుడు ఇలా చెప్పాడు.

ఎ) అక్కడ... మనస్సు ఏకాగ్రత కాలేదు, ఎరుక నిలవదు. అలాగే జీవితావసరాలైన ఆహారం, చీవరాలు, నివాసం అతి కష్టం మీద దొరుకుతాయి. బి) ఏకాగ్రత, ఎరుక నిలువదు. కానీ, జీవితావసరాలు దొరుకుతాయి.

ఇక అలాగే అక్కడ సి) ఏకాగ్రత నిలుస్తుంది. ఎరుక కలుగుతుంది. జీవితావసరాలైన ఆహారం, చీవరాలు, నివాసం అతి కష్టంమీద లభిస్తాయి. డి) ఏకాగ్రత నిలుస్తుంది. ఎరుక కలుగుతుంది. జీవితావసరాలు కష్టం లేకుండా దొరుకుతాయి.

ఈ నాలుగింటిలో మొదటి రెండు ప్రదేశాలలో భిక్షువులు వుండకూడదు. మిగిలిన రెండు ప్రదేశాల్ని వదిలిపోకూడదు. ఎందుకంటే భిక్షువులకు ప్రధానంగా కావలసింది ఏకాగ్రత, ఎరుక, చిత్త మలినాలు నశించడం. కాబట్టి అడవి అయినా, గ్రామం అయినా, గృహం అయినా..ఏకాగ్రత నిలిచే ప్రదేశంలోనే భిక్షువులు వుండాలి..అని చెప్పే సుత్తం ఇది.

8. మధుపిండిక సూత్రం : మధు పిండకం అంటే తియ్యని ముద్ద (లడ్డు). ఇది శాస్త శాక్యులదేశం అయిన కపిలవస్తులోని, మహా వనంలోని నిగ్రోధారామంలో వున్నప్పుడు చెప్పిన సూత్రం. ఆ మహావనంలో మధ్యాహ్నం వేళ మారేడు చెట్టు కింద కూర్చుని వున్నప్పుడు దండపాణి అనే శాక్యుడు బుద్ధుని దగ్గరకువచ్చి-

'శ్రమణుని వాదం ఏమిటి?' అని ప్రశ్నిస్తాడు.

'అతను యధార్థవాది. ఎవ్వరితో కలహించడు. తృష్ణాక్షయమొందిన వాడు..' అని చెప్తాడు. ఇది విన్న భిక్షువులకు పూర్తిగా అర్థం కాలేదు. ఈ విషయాన్ని గురించి మహాకాత్యాయనుని దగ్గరకు వెళ్ళి వివరించమని అడుగుతారు.

మహాకాత్యాయనుడు వారికి వివరించి చెప్తాడు. కొన్ని ఉపమానాలు చెప్తాడు.

చేవగల చెక్క కావాలనుకునేవాడు పెద్ద వృక్షాన్ని ఎంచుకోవాలి. లేత చెట్టునీ, కొమ్మల్నీ కాదు..అంటాడు.

కన్ను, రూపం, చక్షువిజ్ఞానం..ఇలా ప్రతి ఇంద్రియాన్ని, ఇంద్రియ జ్ఞానాన్ని వివరిస్తాడు. స్పర్శ గురించి, వేదన గురించీ చెప్తాడు. కన్ను లేకపోయినా, రూపం లేకపోయినా చక్షు విజ్ఞానం లేకపోయినా వాటి ద్వారా కలిగే స్పర్శను గుర్తించలేం అని, ఇంద్రియాల గురించి వివరిస్తాడు.

భిక్షువులు సంతోషపడతారు. కాచ్చాయనుని విషయం బుద్ధునితో చెప్పగా- 'భిక్షువులారా! మహా కాత్యాయనుడు పండితుడు. మహాప్రాజ్ఞుడు. నేనైనా అలాగే చెప్పేవాణ్ణి' అంటాడు.

ఆనందుడు భిక్షువుల విషయాన్ని చెప్పి- 'ఆకలితో వున్నవారికి మధుపిండం (పంచదార లడ్డు) దొరికినట్లుగా వుంది భిక్షువులకు' అంటాడు. అలా...ఈ సుత్తానికి మధుపిండక సుత్తం అనే పేరు వచ్చింది.

9. ద్విధావితర్క సుత్తం : బుద్ధుడు జేత వనంలో వున్నప్పుడు భిక్షువులకు చెప్పిన సుత్తం ఇది.

రెండు రకాలుగా తర్కించుకోవడం గురించి చెప్పే సుత్తం ఇది. సంబోధిని పొందక ముందు బోధిసత్వునిగా వున్నప్పుడు నేను ఇలా తర్కించుకున్నాను.. అని చెప్తాడు బుద్ధుడు.

కామం-నిష్కామం, ద్రోహం-అద్రోహం, హింస-అహింసల గురించి తర్కం వుంది.

తనకు 'కామ' ఆలోచన కలిగినప్పుడు దానిని- 1) ఇది నాకు బాధ కలిగిస్తుంది. 2) ఇది పరులను బాధిస్తుంది. 3) ఇది నన్నూ-ఇతరులను (ఇరువురినీ) బాధిస్తుంది. 4) ఇది ప్రజ్ఞను అడ్డుకుంటుంది. 5) వినాశనకారి. 6) నిర్వాణానికి అడ్డు కలిగిస్తుంది అని తెలుసుకున్నప్పుడు కామం, ద్రోహం, హింసల్ని వదులుకుంటాం అని చెప్పా...'కామం గురించిన తలపుల వల్ల నా మనసు వాటి వైపు వంగేది. పెరిగిపోయేది. దానితో అకుశలాలవల్ల కలిగే ప్రమాదాల్ని గ్రహించానని చెప్తాడు బుద్ధుడు.

'వర్షాకాలం అనంతరం చలికాలంలో పంట పెరిగే కాలంలో, పంటను పాడు చేసే పశువుల్ని దండించినట్లు-అకుశలాల్ని దండించాను' అంటాడు.

అలాగే..చిత్తం, శరీరం పరస్పర ఆధారితాలు అనే విషయం ఈ సుత్తంలో వుంది.

(ఇంకావుంది)

Printed, published and owned by **Kalimikonda Rajeswari**
Printed at Prajasakti daily printing press, M.B.Vignana Kendram, H.No.27-30-4, Akulavari St, Governerpeta, Vijayawada-520 002, Krishna Dt., A.P
Published at D.No.41-20/3-24, Mannavavari Street, Krishnalanka, Vijayawada-520 013,Krishna Dt, A.P
Editor : **K.Sambasiva Rao** (Kalimisri)



శ్రీమతి ఘంటా ఇందిర స్మారక

మల్లెతీగ కార్టూన్ల పోటీ

సీనియర్ జర్నలిస్టు డా॥ఘంటా విజయ్‌కుమార్ మల్లెతీగతో కలిసి గతంలో నిర్వహించిన కార్టూన్లపోటీని కరోనా తర్వాత ఇప్పుడు మళ్లీ కొనసాగిస్తున్నాం.

అత్యుత్తమ కార్టూన్‌కు రు.10,000/-లు

ఉత్తమ కార్టూన్‌కు రు.5,000/-లు

రు.500/-ల చొప్పున 10 ప్రత్యేక బహుమతులు

- కార్టూన్లు 12 × 7 సెం.మీ..లేదా ఆ సైజుకు రెడ్యూస్ అయ్యేలా పెద్దవిగా కూడా వేయొచ్చు.
- కార్టూన్లు కలర్ లేదా బ్లాక్ & వైట్‌లో గీయవచ్చు.
- పోటీలో ఎంపిక కాని కార్టూన్లను నవమల్లెతీగ మాసపత్రికలో ప్రచురణకు స్వీకరించేందుకు వీలుగా మీ అంగీకారం తెలియజేయాలి.
- ఒక్కొక్కరూ 4 కార్టూన్ల వరకు పంపవచ్చు.
- అంశం విషయంలో కార్టూనిస్టుకు పూర్తి స్వేచ్ఛ వుంది. సామాజిక అంశాలకు ప్రాధాన్యత వుంటుంది.

చివరి తేదీ ఫిబ్రవరి 5 2023

వాట్సప్‌లో పంపిన కార్టూన్లు పోటీకి అంగీకరించబడవు. ఈమెయిల్ ద్వారా లేదా కొరియర్ లేదా పోస్టు ద్వారా మాత్రమే పంపాలి. కాపీ కార్టూన్లకు చోటు లేదు. నిర్వాహకులదే తుది నిర్ణయం. కార్టూన్లపోటీ, ఎడిటర్, నవమల్లెతీగ మాసపత్రిక, 41-20/3-24 మన్నవవారివీధి, కృష్ణలంక, విజయవాడ-520 013 చిరునామాకు కార్టూన్లు పంపాలి. malleteega@gmail.com ఈమెయిల్‌కు కార్టూన్లు 300 డిపిఐలో స్కాన్ చేసి పంపవచ్చు

అన్ని వివరాలకు 92464 15150 నెంబరులో సంప్రదించవచ్చు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

సంక్రాంతి శుభాకాంక్షలు

డా॥ఘంటా విజయకుమార్

K125 A 101M 255

DATE OF PUBLICATION
1ST OF EVERY MONTH

NAVAMALLETEEGA - JANUARY -2023
RNI REGD NO : APTEL /2017/73957
POSTAL REGD NO : VJ/190/2023-25

DATE OF POSTING
5, 6 EVERY MONTH

పేదవాడికి కూడా పెద్ద వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న తపనతో ఇప్పటికే వైద్య రంగంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన జగనన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో వేస్తున్న మరో ముందడుగు..

"డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ" పరిధిలో క్రొత్తగా మరో **809** వైద్య చికిత్సలు..!
ఇప్పటికే ఉన్న **2,446** చికిత్సలతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా

ఇక నుండి 3,255 చికిత్సలకు ఉచితంగా వైద్యం..!

లాంఛనంగా ప్రారంభించిన గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

104 కాల్ సెంటర్ ద్వారా ఆరోగ్యశ్రీ పూర్తి సమాచారం అందుబాటులో..

డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

పేదవాడికి కూడా పెద్ద వైద్యం..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

- వైద్యం ఖర్చు రూ.1,000 దాటిన అన్ని చికిత్సలు డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చేట్లుగా తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్న జగనన్న ప్రభుత్వం..
- వార్షిక ఆదాయ పరిమితి 5 లక్షలకు పెంపుతో రాష్ట్రంలోని దాదాపు 95 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ సేవలు.. 1,41,23,843 కుటుంబాలకు లబ్ధి జరుగుతోంది...
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పరిధిలోకి కరోనా, బ్లాక్ ఫంగస్, మిస్-సి వంటి జబ్బులు..
- అన్ని రకాల క్యాన్సర్లూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి.. పరిమితి లేకుండా ఎంత ఖర్చైనా ఉచితంగానే చికిత్స..

- దాదాపు 12 లక్షలకు పైగా ఖర్చయ్యే బై లేటరల్ కాక్లియర్ ఇంప్లాంట్ వంటి ఆధునిక సర్జరీలు కూడా పూర్తి ఉచితంగా..
- ఆసుపత్రుల్లో జవాబుదారీతనం పెంచేలా ఆరోగ్యశ్రీ చికిత్స అనంతరం పేషెంట్ డిశ్చార్జ్ సమయంలో ఆసుపత్రుల్లో వారికి అందిన సేవల నాణ్యతపై ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాతనే ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులు..
- రోగులకు సాధికారత కల్పిస్తూ, ఆసుపత్రులకు చెల్లించాల్సిన బిల్లులను రోగుల ఖాతాల్లో జమ చేసి వారి ఖాతాల నుండి నేరుగా ఆసుపత్రులకు చెల్లించే ఏర్పాటు..

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా : దేశంలో ఎక్కడా లేని విధంగా "ఆరోగ్యశ్రీ"లో చికిత్స తీసుకొని ఇంటికి వెళ్లిన తర్వాత సైతం వారు పూర్తిగా కోలుకొని తిరిగి పనుల్లోకి వెళ్లే వరకు జీవనోపాధికి ఎలాంటి లోటు లేకుండా "వైఎస్సార్ ఆరోగ్య ఆసరా" ద్వారా రోజుకు రూ. 225ల చొప్పున నెలకు రూ. 5,000 లు, రెండు నెలలైతే రూ. 10,000లు అలా ఎన్ని రోజులైనా డాక్టర్ల సూచన మేరకు ఆరోగ్య ఆసరా భృతి అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిన జగనన్న ప్రభుత్వం. ఇప్పటివరకు 13,09,344 మందికి రూ. 821.49 కోట్ల భృతి అందజేసిన జగనన్న ప్రభుత్వం..

పేదవారికి కూడా ఆధునిక వైద్యం ఉచితంగా అందించాలన్న సమున్నత లక్ష్యంతో.. 2007లో మహా నేత, దివంగత ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఆయన మానస పుత్రిక "ఆరోగ్యశ్రీ" పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పరిస్థితిని చక్కదిద్ది "ఆరోగ్యశ్రీ"ని పునరుజ్జీవింప చేయడంతో పాటు 3,255 చికిత్సలను "ఆరోగ్యశ్రీ"లో చేర్చి, "ఆరోగ్య ఆసరా" ను కూడా దానికి జత చేస్తూ పేదలకు ఆపన్నహస్తం అందిస్తోంది..

తేడా గమనించండి..

గత ప్రభుత్వం..

1. గతంలో అరకొరగా ఆరోగ్యశ్రీ సేవలు.. అవీ సమయానికి ఆసుపత్రులకు డబ్బులు ఇవ్వక నీరుగార్చే కార్యక్రమం.. ఆరోగ్య ఆసరా లాంటి పథకం లేనేలేదు.. ఆరోగ్యశ్రీ,104,108 పథకాలకు చేసిన వ్యయం ఏడాదికి సగటున కేవలం రూ.1,100 కోట్లు మాత్రమే..
2. కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ.. రోజుల తరబడి నిరీక్షణ..
3. పేదవారికేదైనా పెద్ద జబ్బు వస్తే అటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందక, ఇటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక, ప్రాణం మీదకొస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి..!! పేరుకు 919 ఆసుపత్రుల్లో 1059 వైద్య చికిత్సలకు ఆరోగ్యశ్రీ అందిస్తున్నామని చెప్పినా, అందించిన సేవలు అతి స్వల్పం..
4. నెట్ వర్క్ ఆసుపత్రులకు నెలల తరబడి బిల్లులు చెల్లించక పోవడంతో ఆరోగ్యశ్రీ క్రింద వైద్యం అందించేందుకు ఆసుపత్రుల నిరాసక్తత.. గత ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సంవత్సరం పైగా చెల్లించకుండా పెట్టిన బకాయిలు 2019 నాటికి రూ. 680 కోట్లు..
5. శిథిలావస్థలో ఆస్పత్రి భవనాలు.. పాడైపోయిన వైద్య పరికరాలు.. కొత్త ఆస్పత్రుల ఊసే లేదు.. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు లేక కునారిల్లిన వైద్య వ్యవస్థ..
6. నాసిరకం మందులు.. అవి కూడా అరకొరగానే ఆస్పత్రుల్లో అందుబాటు..
7. అతి స్వల్పంగా, అదీ అతి కొద్దిమొత్తంలో ఆరోగ్య పెన్షన్లు.. అవీ తమ వారికే.. అందులోనూ వివక్ష, లంచాలు, పారదర్శకత లేమి..
8. వైద్య శాఖలో విపరీతంగా ఖాళీలు..
9. అతి స్వల్పంగా అంబులెన్స్ సేవలు.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా గంటల తరబడి అంబులెన్స్ కోసం వేచి ఉండాల్సిన దుస్థితి..
10. గతంలో ఏ చిన్న జబ్బు వచ్చినా వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు సైతం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కి వెళ్లాల్సిన దుస్థితి.. తీరా అక్కడికి వెళితే డాక్టర్లు అందుబాటులో ఉంటారో లేదో తెలియని దిక్కుమాలిన స్థితి..

మన ప్రభుత్వం..

1. వార్షిక ఆదాయ పరిమితి 5 లక్షలకు పెంపుతో రాష్ట్రంలోని దాదాపు 95 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ సేవలు.. 1,41,23,843 కుటుంబాలకు లబ్ధి.. మన ప్రభుత్వం "డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ"కి రూ. 2,900 కోట్లు, "డా. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా"కు రూ. 400 కోట్లు, 104, 108 కు రూ. 300 కోట్లు కలిపి **ఏడాదికి చేస్తున్న ఖర్చు రూ. 3,600 కోట్లు.. అంటే గత ప్రభుత్వం ఏడాదికి చేసిన ఖర్చుకు దాదాపు 3 రెట్లు అధికం..!**
2. దరఖాస్తు చేసుకున్న 20 రోజుల లోపే లబ్ధిదారుల గడప వద్దనే గ్రామ/వార్డు సచివాలయాలు, వాలంటీర్లు, ఏఎన్ఎంల ద్వారా క్యూఆర్ కోడ్ తో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు..
3. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా **2,228 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,255 చికిత్సలకు ఉచితంగా వైద్యం..** రూ.1,000 ఖర్చు దాటిన అన్ని చికిత్సలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకువచ్చేలా చురుగ్గా చర్యలు.. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాలలోని 202 కార్పొరేట్ ఆసుపత్రులలో, 17 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఉచిత చికిత్సలు అందుబాటులో..
4. క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపు.. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ బకాయిలు రూ. 680 కోట్లతో కలిపి **కేవలం 3 ఏళ్లలోనే ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ. 7,338 కోట్లు** చెల్లించింది..!
5. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు సమూలంగా మార్చే **'నాడు-నేడు'** పథకంలో భాగంగా రాష్ట్రంలోని గ్రామ /వార్డు సచివాలయాల పరిధిలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు / 560 అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 53 ఏరియా ఆసుపత్రులు, 12 జిల్లా ఆసుపత్రులు, 175 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి.. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఉండేలా, కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం.. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు.. కొత్తగా మూడు క్యాన్సర్, ఒక కిడ్నీ స్పెషాలిటీ ఆసుపత్రులు.. ITDA పరిధిలో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం..
6. **అన్ని మందులు WHO/GMP ప్రమాణాలు కలిగినవి మాత్రమే** ప్రభుత్వ ఆసుపత్రులలో ఉండేటట్లు చర్యలు..
7. లెప్రసీ, పక్షవాతం, డయాలసిస్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 3,000/- నుండి రూ.10,000/- వరకు పెన్షన్లు.. పారదర్శకంగా, లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులైన అందరికీ ప్రతి నెల మొదటి తారీఖునే రంఛనుగా వాలంటీర్ల ద్వారా పెన్షన్లు..
8. ఇప్పటికే **46,530 పోస్టుల్లో వైద్య సిబ్బంది నియామకం..** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏ ఒక్కపోస్టూ ఖాళీగా ఉండకూడదన్న తపనతో అక్కడక్కడా మిగిలిపోయిన కొన్ని ఖాళీల భర్తీకి కూడా ఇటీవలే వాక్-ఇన్- ఇంటర్వ్యూలు నిర్వహించి 329 మంది స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యులను నియమించాం.. నిరంతర వాక్-ఇన్- ఇంటర్వ్యూల ద్వారా మిగిలిపోయిన ఆ అతి కొన్ని ఖాళీల భర్తీకి చురుగ్గా చర్యలు..
   మన ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, వైద్య సిబ్బంది, స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టుల నియామకాల కారణంగా **2019 నాటికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న 970 పీజీ సీట్లకు అదనంగా మరో 953 సీట్లు అందుబాటులో..** దాదాపు రెట్టింపు కానున్న సీట్ల సంఖ్య..
9. తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 104 మరియు 108 సర్వీసుల విభాగాలకు జీవం పోస్తూ అధునాతన వసతులతో కొత్తగా 1128 వాహనాలు.. అధునాతన వసతులతో పూర్తి ఎయిర్ కండిషన్‌తో కొత్తగా 500 డా॥ వైఎస్సార్ తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలు..
10. మన ప్రభుత్వంలో మన గ్రామంలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, మన గడప వద్దనే వైద్యం అందేలా **ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్..** ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు.. ఉగాది నుండి పూర్తి స్థాయిలో..

ఇది ప్రాణం విలువ తెలిసిన నాయకత్వం.. ఇది బ్రతికించే ప్రభుత్వం..

శ్రీమతి విడదల రజిని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

R.O.No.48/Sou/Advt.II/2022-23 Dt.30-11-2022

If Undelivered Please Return

Editor, Navamalleteega, # 41-20/3-24, Mannavavari St., Krishnalanka, Vijayawada-520 013. Cell : 92464 15150

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	**KRSA101M255**
పుస్తకం పేరు	నవ మల్లెతీగ
తారీఖు	**23 February 2025**
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	65
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	no
తయారు చేసినది	Sowmya
పేజీలు విడదీసినది	akshaya
స్కాన్ చేసినది	AKSHAYA
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good